ంధ్రపత్రిక
సచిత్ర వారపత్రిక



4 అణాల
12-8-53

సంవత్సర చందా
రు. 12-0-0
విడిపత్రిక 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 45
సంచిక 50
12-8-53

విజయ శ్రావణ శుద్ధ తదియ; బుధవారం



బళ్లారిని ఆంధ్రరాష్ట్రంలో చేర్పించాలనే దీక్షతో కఠోర నిరాహారదీక్ష పూనిన శ్రీ శామిరెడ్డిగారు.

విషయానుక్రమణిక

సంధి-విగ్రహం

సంధి విగ్రహం (పంచతంత్రం) సామగ్రి సీరియల్ కారణాంతరాల వల్ల ప్రచురించలేక పోయినందుకు చింతిస్తున్నాము. తిరిగి త్వరలోనే ప్రచురించగలమని పాఠకులకు మనవి.

—సంపాదకుడు.

కాలక్షేపం

వనజభవుండు కోపమున
వాహనమైన మరాళ భర్తను
వనజవనీ విహార కలనంబు
దొలంగగ జేయుగాని, గుం
భనమున దుగ్ధజీవన
విభాగ విధాన నిరూఢ నైపుణీ
జనిత మహాయశో విభవ
సారము హంసకు మాన్పజాలు నే?

తా॥ బ్రహ్మకు కోపము వచ్చుటచేత తనకు వాహనమైన హంసరాజమునకు తన కాసారములో తిరిగెడి అవకాశమును తొలగించవచ్చును. కాని, నీటిని పాలను విభజించగల నైపుణ్యమువల్ల కలిగిన గొప్ప విఖ్యాతిని హంసకు లేకుండా చేయగలడా? చేయజాలడు అని తాత్పర్యం.

బ్రహ్మదేవునకు కోపం రావడం అనేది ఉంటుందా? బ్రహ్మతేజస్సు అనేది ఎటువంటి వానిలో మూర్తీభవించి ప్రకాశిస్తూ ఉంటుంది అని పరిశీలించి చూచినట్లయితే, కేవలము శుద్ధ సత్వగుణ ప్రధానుడైన వానిలోనే బ్రహ్మతేజస్సు స్వచ్ఛంగా ప్రకాశిస్తూ ఉండగలదు. శాంతరసము ఎవనిలో తాండవిస్తూ ఉంటుందో అటువంటివాడే బ్రహ్మజ్ఞాని. అటువంటివాడే పరమహంస. పరమహంసయైనటువంటి వాడు జీవన్ముక్తుడు. "నేనే ఆ పరబ్రహ్మను" అని గ్రహించినవాడు పరమహంస. "పరబ్రహ్మ" అనబడేది ఒక పరతత్వం అన్నారు. "ప్రాణం" అంటే ఏమిటో మనం చూపించగలమా? "ప్రాణం" అనేది ఒక "తత్వం" అని మాత్రము మనము గ్రహిస్తున్నాము. ప్రాణం అనే ఒక తత్వం నిజమైనదిగా యథార్థమైనదిగా, అంగీకరిస్తున్నాము. కాని, విద్యుచ్ఛక్తి అనే దానిని ఒక తీగగుండా ప్రవహింపచేటట్లు చేయగల్గుతున్నాము. దాని ఉగ్రతను, ఉద్ధతిని, యంత్రసాధనములతో (వేడిని థర్మామీటరుతో కొలిచినట్లుగా) కొలువగల్గుతున్నాము. కాని, అదేవిధంగా "ప్రాణం" అనేదానిని, మనము ఉత్పత్తి చేయలేకపోయినప్పటికీ, దానిని ఒక పదార్థంలోనుంచి యింకో పదార్థంలోకి ప్రవహింపజేయలేకపోయినప్పటికీ, "ప్రాణం"యొక్క ప్రజ్వలన ప్రస్ఫుటత్వాతిశయ పరిమాణ పరిమితిని మనము కొలువలేకపోయినప్పటికీ, "ప్రాణం" అనేది ఒక నిజమైన వస్తు "తత్వం"గా యీ జగత్తులో ఉన్నదని మాత్రము అంగీకరిస్తున్నాము. ఈ "ప్రాణం" అనే తత్వముకంటె మరొక గొప్పతత్వం జగత్తు అంతటను వ్యాపించియున్నదనిన్నీ, "ప్రాణం" అంటే ఏమిటో నిర్ధారణగా మన కొలప్రమాణాలతో కొలిచి చూపించలేకపోయినప్పటికీ "ప్రాణం" అనే "తత్వం" ఒకటి యీజగత్తులో ఉన్నదనిన్నీ ఏవిధంగా మనము విధిగా అంగీకరిస్తున్నామో, అదే విధంగా అన్ని తత్వములకూ అతీతమైన (ఆకాశతత్వము, తేజోతత్వము, మొదలైన తత్వములకంటె అతీతమైన) ఒక పరతత్వం ఉన్నదని, యోగవిద్యవల్ల, యోగిపుంగవులైన వారున్నూ, తపస్సంపన్నులైన వారున్నూ దివ్యజ్ఞానధురీణులైన పరమహంసలున్నూ గ్రహించారు. "ప్రాణం" అని చెప్పబడేది ఎటువంటిదో ఏవిధంగా నిరూపించి నిర్ధారణగా నిర్వచింపజాలమో, అదే విధంగా యీ "బ్రహ్మ" అనబడే "పరతత్వము"ను కూడా నిరూపించినిర్వచింపజాలమన్నారు. కాని, అటువంటి అనిర్వచనీయమైన అతీతమైన "పరతత్వ"మొకటి జగత్తు అంతటను నిండియున్నదని అనుభవసిద్ధమైన జ్ఞానము వల్ల ఘంటాపథముగా వాదించారు. దానికి వారు "బ్రహ్మ" అనే పేరు కూడా పెట్టలేదు. దానిని "పరతత్వం" అన్నారు. ఇంకా మరి కొందరు తత్వవేత్తలు దానికి వివిధమైన నామకరణం చేయ కూడదన్నారు. "పరతత్వం" అనే నామవాచకశబ్దంకూడా అక్కరలేదన్నారు.

"అది" అనే సర్వనామంగాని "అతడు"

దాసు వామనరావు

అనే సర్వనామంగాని ప్రయోగిస్తే చాలునన్నారు. ఎందుచేతనంటే, ఒక మతంలోనివారు "పరతత్వం" అనే మాటకు బదులుగా, "పరబ్రహ్మం" అనే శబ్దాన్ని వాడవచ్చు. ఇంకొకరు "పరమశివం" అనవచ్చు. వారూ వీరూ మాట పట్టింపులతో తిట్టుకొని, జుట్టు పట్టింపులకుదిగి, కొట్టుకోవచ్చు. అందువల్ల ఆ "పరతత్వము" అనే మాటనుకూడా రద్దుచేసి, దానికి బదులుగా "అతడు" అని వ్యవహరిస్తే చాలునన్నారు. "అతడే నేను" అని గ్రహించినటువంటి మహాజ్ఞానులుగాని మహాతపస్సంపన్నులు గాని ఎవరైతే ఉన్నారో, వారే పరమహంసలు. "సః అహం" ("అతడే నేను") అని గ్రహించడమే బ్రహ్మజ్ఞానం - "సోహం" (సః అహం) అనే అనుభవజ్ఞానం కలిగినటువంటివాడు ఆవిషయమును సదా స్మరిస్తూ ఉంటాడు.

"నేను మనిషిని" అనే సంస్మరణ (స్మృతి) మనలను సదా సర్వకాల సర్వావస్థల యందూ ఏవిధంగా వెంటాడుతూ ఉంటుందో, అదే విధంగా "సోహం" (నేనే అతడు) అనే నిత్య సంస్మరణ పరమహంసలను వెంటాడుతూ ఉంటుంది. "సోహం సోహం సోహం" అనే నిత్య సంస్మరణ కలవాడే "హంసోహం" (హంసః అహం=హంసను నేను) అని కూడా ఉచ్చరించినట్లవుతోంది. "సోహం" అనే దానియొక్క పునశ్చరణవల్ల "హంసోహం" అనే వాక్యం ఏర్పడింది. అందువల్ల అట్టి "సోహం" అనే ఆత్మజ్ఞానం కల మహాపురుషుడే "హంసోహం" అని స్మరించినట్లవుతోంది. అటువంటి వానినే పరమహంస అని లోకం అన్నది. అటువంటి పరమహంసయే బ్రహ్మజ్ఞాని.

"బ్రహ్మ" అనేటటువంటి ఒక "పరతత్వం" బ్రహ్మ అనేటటువంటి ఒక "పరాశక్తి" విద్యుచ్ఛక్తి లాగున జగత్తు అంతటను విస్తరించి వ్యాపించి ఉంది. మద్రాసులోని ఆలిండియా రేడియో స్టేషనులో విద్యుచ్ఛక్తి తరంగములరూపంగా అనేకములైన శబ్దములు, స్వరములు ఆకాశ తత్వంలోకి విస్తరిస్తాయి. కాని మన యింట్లో రేడియో పెట్టె ఉన్నట్లయితే, ఆ రేడియో పెట్టె తాలూకు పిడిని సరిగ్గా త్రిప్పి శ్రుతి చేసినట్లయితే, ఆకాశ తత్వంలో తరంగాలు తరంగాలుగా విస్తరించిపోతున్న ఆ విద్యుత్ శక్తిని మన రేడియో పెట్టె తనలోనికి ఆకర్షించుకొని, ఆ విద్యుత్తరంగాలను తిరిగి శబ్దరూపం లోనికి, (పది రూపాయల నోటును మార్చి పది వెండి రూపాయిలు తెచ్చిన విధంగా) మార్చును. ఆ పెట్టెచే ఆకర్షింపబడిన విద్యుత్తరంగజాలం శబ్దతరంగాలుగా, చక్కని సంగీతంగా, నాదబ్రహ్మంగా ప్రత్యక్షమవుతోంది. ఈ రాగి తీగెలలోనుంచి రాగరూపంగా విద్యుచ్ఛక్తి ఎప్పుడైతే ప్రవహిస్తున్నదో అప్పుడు ఆ తీగెగుండా ఆశక్తి సవారీచేస్తోంది అని అర్థం. ఆ శక్తి ఒకచోటనుండి యింకొకచోటికి పోవుటకు ఆ రాగితీగె ఈ విద్యుచ్ఛక్తికి వాహనం అయినదని ఊహించాలి. అందువల్లనే ఆ తీగెగుండా ఈశక్తి ప్రవహిస్తోంది.

ఆకాశంలో అనేక విధమైన శక్తి తరంగాలు ఉంటాయి. కాని, మన రేడియో పెట్టెను ఏ నాదతరంగ ప్రమాణానికి శ్రుతి చేస్తామో ఆ తరంగములే రేడియో పెట్టెలోని రాగి తీగెలలోనికి ప్రవహిస్తాయి. ప్రపంచంలో మన దృష్టిని ఆకర్షించగలినవి అనేకం ఉన్నాయి. దేవుని ఊరేగింపు అఖండ వైభవంగా మేళతాళాలతో, భజన బృందములతో, వేద పాఠములతో, భోగం మేళంతో, బాణాసంచాతో, స్వామివారి పొన్న వాహనంతో, ఆభరణాలంకరణములతో నడుస్తోంది. ఒకని మనస్సును ఆ పొన్న వాహనం ఆకర్షిస్తుంది. ఇంకొకని మనస్సును భోగంమేళంలోని భోగముసానులు ఆకర్షిస్తారు. ఇంకొకని మనస్సును బాణాసంచా ఆకర్షిస్తుంది. ఇంకొకడు వేదపాఠం వింటూ నిలబడతాడు. అది వారి వారి ఆత్మ సంస్కారమునుబట్టి ఉంటుంది. అదేవిధంగా సృష్టిలో అనేక తత్వాలు

★ కాలక్షేపం ★


ఉన్నాయి. ఆ పరతత్వముచే ఆకర్షింపబడిన వాడు మాత్రమే పరమహంస - పరమహంస ఒక్కడే పరతత్వమును తన లోనికి ఆకర్షించుకోగలడు. దీని అర్థం ఏమిటి? ఈ పరతత్వం అనబడేటటువంటి సర్వవ్యాపకశక్తి ఆ పరమహంసలో విద్యుచ్ఛక్తివలె ప్రవహిస్తూ ఉంటుంది. ఆ పరతత్వమునకుగాని, పరాశక్తికిగాని పరమహంస ఒక వాహనంలాగున తయారవుతాడు. అతడు కళ్లు మూసికొని నిశ్చల సమాధిలో వివిధమైన సంకల్ప వికల్పములు లేకుండా, మనస్సును చలింపజేసేటటువంటి ఇతర చిత్త వృత్తి వ్యాపారములు లేకుండా, నిర్వృత్త్యవస్థలో ఉన్నటువంటివాడై ఆ పరతత్వానికి వాహన మవుతాడు. ఆ పరమహంస తనలోనికి ఆ పరతత్వమును ఆవాహన చేసికొంటాడు. అటువంటి జీవ బ్రహ్మైక్యానుసంధానావస్థలో ఆరీతిగా ఆవాహన చేసికొన్నటువంటి ఆ వాహనంలోనే ఆ పరతత్వం లీనమై ఉంటుంది. ఆ తీగలోనే ఆ విద్యుచ్ఛక్తి లీనమైఉంటుంది. రెండింటికీ విభేదంలేదు. అదొక అద్వైత పరబ్రహ్మనందావస్థ అన్నారు.

కామము క్రోధము వగైరా చిత్త ప్రవృత్తులు లేనటువంటి నిశ్చలావస్థ అది. అటువంటి పరమహంస శాంతమూర్తియై ప్రకాశిస్తూ ఉంటాడు. "శాంతరసమొలుక్కు బ్రహ్మతేజంబు తోడ" అన్నట్లుగా ప్రకాశించే వాడే పరమహంస. "అదే నేను" అని ఏ పరమహంస సదా స్మరిస్తున్నాడో ఆ పరమహంసయందున్న శాంతగుణమే, సత్వగుణమే "అది",—అనగా ఆ పరతత్వం - కనుక బ్రహ్మతేజస్సు అనేది శాంతరసం ఉట్టిపడుతూ ఉంటుంది. అటువంటి బ్రహ్మకు ఆగ్రహం అనేది ఏవిధంగా కలుగుతుంది? వనజభవునకు కోపం అనేది రావడం అసంభవం అయినట్లయితే, తన వాహనమైన హంసమీద కోపం రావడం గాని, తన సరస్సులో విహరించకూడదని నిషేధిస్తూ ఆజ్ఞాపించడం గాని అసంభవం.

కాని, పరమహంసయందు ఏదో ఒక లోపం, ఏదో ఒక దోషం ఏర్పడినప్పుడు ఆ పరమహంసలో బ్రహ్మతేజస్సు క్షీణిస్తుంది. మహాత్ములకు భగవంతుడు ప్రత్యక్షంగా ముఖాముఖి మాట్లాడుతున్నట్లుగా అనుభవసిద్ధంగా కన్పిస్తుంది. త్యాగరాజుల వారు బ్రహ్మాండపదవిని అనేకసార్లు అనుభవించినట్లుగా వారి కీర్తనలలో స్పష్టంగా చెప్పియున్నారు. "కను గొంటిని శ్రీరాముని" అని ప్రమాణపూర్తిగా చెప్పగల్గిన వాగ్గేయకారకుడు ఆయన. "నాకొక ఆత్మప్రబోధం (*Inner urge*) కలిగింది. కనుక, ఉప్పు సత్యాగ్రహం ప్రారంభిస్తున్నాను" అని చెప్పి, భారతదేశపు పశ్చిమ కోస్తాలోని "దండి" అనే ఊరువద్ద ఉన్న ఉప్పు కొటారులపై సత్యాగ్రహం సాగించాడు గాంధిమహాత్ముడు.

మహాత్ముడు శాంతమూర్తి. కాని ఆయన ఉద్యమం పేరు సత్యాగ్రహం. ఈ సత్యాగ్రహంలోనే ఆయన శాంతగుణం అంతా ఉంది. ఈ ఆగ్రహంలోనే ఆయన అనుగ్రహం అంతా ఉంది.

బ్రిటిష్‌వారితో సహాయ నిరాకరణం చేశాడు. బ్రిటిష్ వారిమీద తన సత్యాగ్రహం ప్రయోగించాడు. భారతీయులకు స్వరాజ్యం లభించవలెననే సంకల్పంతో యీ సత్యాగ్రహం సాగించాడు, భారతీయుల మీద అనుగ్రహం కలిగి మహాత్ముడు నడిపించిన ఉద్యమం ఇది. కాని, ఆయనకు భారతీయులమీద అనుగ్రహంకలిగి యీ సత్యాగ్రహం సాగించినందువల్ల భారతీయ నాయకులకు అందువలంగా వెంటనే లభించినది ఏమిటి? సభలలో పూలమాలలు, జేజేలు - తర్వాత జెయిళ్లు, లాఠీ చార్జీలు - మహాత్ముని యొక్క కరుణా కటాక్షంవల్లను అనుగ్రహ ప్రసాదంవల్లను కారాగృహాలకు వెళ్ళి నానాఅవస్థలు పడ్డారు. హాయిగా హంసతూలికా తల్పములపై శయనించేవాళ్ళు, ఊగుటుయ్యాలలందు ఊగుతూ ఉండేవాళ్ళు, ఆ భోగములన్నీ వదలుకోవలసి వచ్చింది. ఇన్ని అవస్థల పాలైనవారు ఆ మహాత్ముణ్ణి మరింత ఆరాధించారు. ఆయన సన్నిధానంలో ఉంటేనే చాలునని, ఆయన ఆశ్రయంకోసం కలువరించారు. కారాగారంలో ఉన్నప్పటికీ, ఆయన కాసారంలో విహరించినట్లుగానే మహదానందం పొంది వహవ్వా అన్నారు. గాంధిమహాత్ముడు తన ఉద్యమం ఎవరిద్వారా నడిపించాడు? ఆయన సాగించిన శాంతి సమరంలో ఆయనకు చతురంగబలం ఏది? గజములు తురగములు ఏవి? పండిత నెహ్రూ, సర్దారు పటేలు, దేశభక్తులు, దేశోద్ధారకులు, ఆంధ్రరత్నములు, వీరందరూ ఆయన శాంతిసమరములోని చతురంగ బలములు. గాంధిమహాత్ముని దివ్యతేజస్సూ, బ్రహ్మాండమైన ఆయన ఉద్యమశక్తియున్నూ విజయవంతమగుటకై ఆ మహాత్ముని తత్వము దేశనాయకులను ఆవహించినది. ఆ బ్రహ్మతేజస్సును వహించెడి హంసరాజము లివి. మోహనదాస్ కరంచందు గాంధి యొక్క



ఆంధ్రరాష్ట్ర విభజన
ప్రత్యేకోద్యోగి
శ్రీ చందులాల్ త్రివేది.

తేజస్సువెన్నెలవలెవారిలో ప్రకాశించినంత కాలమూ వారి జీవితం ఆనందమయమైనది. అటువంటి బ్రహ్మమానస సరోవరవిహారమే వారికి కావలసినది. అదే స్వర్గసౌఖ్యం - అదే స్వారాజ్యం. అట్టి కాసారవిహారము వారికి లేకుండా ఎప్పుడైతే మెట్ట వేదాంతములోకి వారు దిగినారో అప్పుడే నీటిలో నుండి బయటపడిన చేపవలె వారి బ్రతుకు బయటపడినదన్నమాట. ఏనాడు కాంగ్రెసు నాయకులు గాంధీతత్వసారకాసారవిహార రహితులవుతారో ఆనాడే వారికి మహాత్ముని అనుగ్రహం తప్పిందని గ్రహించాలి. "సత్యం"అనేది మహాత్ముని తేజోరూపమైన శక్తి. "సత్యమేవ జయతే" అనేవాక్యంలో సత్యస్వరూపుడైన మహాత్ముడు జ్ఞప్తికి వస్తున్నాడు. "సత్యం" అనేటటువంటి ఆయన ఉపదేశప్రభావం, మనలో, మన నాయకులలో ఉన్నంతకాలమూ, మనకు స్వరాజ్యం స్వర్గరాజ్య మవుతుంది. బ్రహ్మయొక్క కాసారములో తిరుగగలం. ఈసత్యం మనలో ప్రజ్వలించినంత కాలమూ మనలో ఆ విద్యుచ్ఛక్తి ఉచ్ఛస్థాయిలో ఉన్నంత కాలమూ, మన ప్రతాపం అవక్ర పరాక్రమంతో సాగుతుంది. అటువంటి విద్యుచ్ఛక్తి తీగల నష్టగించుటకు సాహసించేవాడు ఉండడు. కాని, యీ తీగలలో విద్యుచ్ఛక్తి అంతరించి అంతర్ధానమైనట్లయితే, ఆ తీగలను ఎవరైనా నిర్భయంగా తెంపడానికి సాహసిస్తారు. మన పార్టీలో బలం వుండదు. మన శాసనసభలో కాంగ్రెసుపార్టీకి అందరూ చెవులకు తాటాకులు కట్టగలరు. సభలోని వేర్వేరు పార్టీల బలం గ్రామసింహాల బలం అవుతుంది. అది స్వరాజ్యం కాదు అది శ్వరాజ్యం అవుతుంది.

అయినా ఒక్క విషయం గమనించాలి. మహాత్ముని ఆశీర్వాదబలం మనకు లేకుండా పోయేది ఎప్పుడు? ఆయనతత్వసారకాసార విహారం మనము మానివేసినప్పుడే - బ్రహ్మతేజస్సరోవరంలో విహరించెడి తపశ్శాలి ఆ సరోవరవిహారం విరమించినప్పుడే అతడు ఆ బ్రహ్మకూ ఆ బ్రహ్మతేజస్సుకూ వాహనంగా ఉండడం మానివేస్తాడు. బ్రహ్మయొక్క మానస సరోవరంలో విహరించినంత కాలమూ హంస అనేది బ్రహ్మకు వాహనంగా ఉంటుంది. వాహనంగా ఉండడం మానివేసిన తక్షణం, ఆ బ్రహ్మతేజస్సరోవర విహారంకూడా హంసకు పోతుంది. దేనిమూలంగా ఏది జరుగుతుంది? రెండూ ఒక్కసారిగా జరుగుతాయి. కాలుజారడం, క్రిందపడడం రెండూ ఒక్కటే. రెండూ ఒక్కచోటే.

సత్యం ఏదో అసత్యం ఏదో గ్రహించే శక్తి మనకు బుద్ధి అనేది ఉన్నంతకాలమూ ఉంటుంది. ఈశక్తి,— ఈయుక్తాయుక్త విచక్షణశక్తి,మనిషి అయిన వానికిఉంది. అందుకనే మానవజన్మ మహోత్కృష్టమైన దన్నారు మహాత్ములు - సత్యం అయినదేదో, మంగళకరమైన దేదో,సత్యపరిపాలన అంటే ఏమిటో, పాలు అంటే ఏమిటో, నీరు అంటే యేమిటో విభజించే నేర్పు తీర్పుల కూర్పు పరమహంస కొదగిన ప్రతిమానవునియందున్నూ ఉంది. ఆ శక్తిని ఆ విచక్షణాశక్తిని బ్రహ్మకూడా తీసివేయ లేడు.

సత్యం అంటే ఏమిటో, సత్యమార్గం ఏదో తెలియకపోవడం అనేది మనకు అసంభవం - అసత్యమార్గం అనుసరిస్తున్నప్పటికీ, అసత్యం అనుసరిస్తున్నామనే విచక్షణజ్ఞానం మన హృదయకమలంలో ఉంది. ఆ హృదయకమలంలోని హంసకు తెలుసు.మనలోఉన్న హంస(అంతరాత్మ) మంచిదే-హంస మనలోనుంచి ఎగిరిపోనంత కాలమూ ఈ మానవజన్మకు ఉన్న విలువను నలువకూడా తొలగించలేడు.

భారతజాతికి యీ నమ్మకం పూర్తిగా ఉంది - జీవుడు సర్వ స్వతంత్రుడు. కాని సత్యం అనేదానికి ఒక్కదానికే దాసుడుగా ఉంటాడు. ఈ బ్రహ్మంవంటి సత్యమును గ్రహించిన అండజములు (పక్షులు అనగా హంసలు) భారతీయులు - రాజకీయ సమరంలో కూడా స్వాతంత్ర్యంకోసం భారతీయులు పోట్లాడలేదు. సత్యం కోసం పోరాడి సత్యాగ్రహం సాగించారు. మహాత్ముడీ తిరుమంత్రం కాంగ్రెసుగాలిగోపురం మీద ఎక్కి చాటించాడు. భారతదేశానికి స్వాతంత్ర్యం బ్రిటిష్‌వారు యిచ్చినట్లయితే, బ్రిటిష్ వారు కూడా తరిస్తారని చెప్పాడు. వారి స్వదేశానికి స్వజాతికి ప్రాణంపోయిగా ఉంటుందన్నాడు. కాబట్టి "ఉత్తిష్ఠంతు శ్వేత నివాసినః" "భారతదేశం విడిచిపొండు ఓ! బ్రిటిష్ మహాశయులారా!" అనే మంత్రమును "*Quit India*" క్విట్ యిండియా, మంత్రము మహాత్ముడు జపించాడు. అది మీకే శ్రేయస్కరం అన్నాడు. ఆమాట మహాసంగ్రామ కాలంలో బ్రిటిష్ మహాశయులు గ్రహించారు. బర్మాలో జపానుసేనల దాడికి ధాటికి తాళుకోలేక బ్రిటిష్ సేనలు తోకముడిచిపెట్టి తూర్పుకు తిరిగి నమస్కారం చేశాయి. తమ ప్రాచ్యరాజ్యాలకు సలాము చేసి వెళ్ళిపోయినాయి. 1942 సం॥ ఆగస్టుమాసంలోనే యీ "క్విట్ యిండియా" మంత్రం మహాత్ముడు జపించాడు. తిరిగి సంగ్రామానంతరము రెండేండ్లకు 1947 ఆగస్టు 15 తేదీని, భారతదేశానికి "స్వాతంత్ర్యం" సిద్ధించింది.

మహాత్ముడు మనకు ఉపదేశించిన "సత్యం" మాత్రం ఇంకా సిద్ధించలేదు. "సత్యం" తప్పకుండా "స్వాతంత్ర్యం" నిర్వహింపగల శక్తి యింకా రాలేదు. "సత్యాగ్రహం" సాధకం చేసిన దినాలలో "సత్యం" కోసం నిలువబడుట సాధకం చేశాం. అప్పుడు మనకు స్వపరిపాలనావకాశం లేదు. "స్వాతంత్ర్యం" అనేది లేదు. "స్వాతంత్ర్యం" నిర్వహించుకోవడమనేదీ లేదు. ఇప్పుడు "స్వాతంత్ర్యం" వచ్చింది. దీనిని నిర్వహించుకోవడానికి పాటుపడుతున్నాము. కాని, వెనుకటి "సత్యం"కోసం ఇప్పుడునిలువబడడంలేదు. అదీ యిదీ రెండూ ఒక్కసారిగా సాధకం చేసి సాగించడం ఎట్లాగో బోధపడడంలేదు. మహాత్ముని ప్రజ్ఞ మనకు యింకా పట్టువడలేదు. దాన్ని సాధించినప్పుడే ప్రపంచ రాజ్యాల బకనికాయములో భారతదేశం పరమహంసవలె విహరిస్తుంది. మహాత్ముడు బోధించి చూపించిన యీ ప్రజ్ఞను తృణీకరించడం అజ్ఞానం.

పెద్ద పట్టణం సమీపంలోఉన్న చిన్న పట్టణంలో చలమయ్య అనే సాహుకారు ఉండేవాడు. అతడు హరిభక్తుడు. వేణుగోపాలస్వామిఆలయం ఒకటి తన సొంత సొత్తుతో తన తోటలో కట్టించాడు. దానికి తానే సర్వస్వతంత్రాధికార ధర్మకర్తగా ఉండేవాడు. హంసలదీవి అప్పలాచారిగారు అనే ఒక వైష్ణవశిఖామణిని సదరు గోపాలస్వామి ఆలయంలో నిత్యనైమిత్తిక ధూపదీప నైవేద్యాది పూజా విధానములను జరుపుతూ ఉండడానికి నెల

(54-వ పేజీ చూడండి)

నన్ను గురించే

[ఇది జరుగుతున్నంతసేపు బస్సు స్టాపింగ్ వాతావరణం. సైకిళ్ళు, రిక్షావాళ్ల వార వార, ఐస్‌క్రీం అమ్మకొనేవాళ్ళు, బిచ్చగాళ్ళు, మొదలైన వాతావరణం. ఏక కాలంలో వాతావరణం, సంభాషణలు జరగాలి.]

1

శివుడు: ఒరేయ్, ఒరేయ్ రాముడూ! నిన్నేరా పిలిస్తే పలకవేం?

రాముడు: నన్నా?

శి: అవున్రా నిన్నే.

రా: ఎవరండీ మీరు?

శి: హోరి నీ దుంపతెగా. నన్నే ఎరగవ్రా!

రా: ఎవరు మీరు. ఎప్పుడూ చూసినట్టు లేదు.

శి: బాగా జ్ఞాపకం చేసుకో.

రా: ఏమో గుర్తుకు రావటం లేదు.

శి: ఎవరైవుంటానో, కొంచెం ఆలోచించు.

రా: ఆలోచించేందుకి నాకు తీరుబాటు లేదు.

శి: ఇష్టమొచ్చినంత టైము తీసుకో. ఇప్పుడొచ్చిన తొందరేముంది?

రా: బాగానే ఉంది. అవతల నాకు ఆఫీసుకు వేళయింది.

శి: అయితే మనకేం.

రా: అవును మీ సొమ్మేం పోయింది. పోతే నా ఉద్యోగం పోతుంది.

శి: తుమ్మితే ఊడే ముక్కు ఎంతకాలం ఉంటుందిరా?

రా: ఉన్నన్నాళ్లు ఉంటుంది. ఇంతకీ మీ రెవరో చెప్పారు కాదు.

శి: చెప్పకోవాలి మరి.

రా: బాబూ, మీకో నమస్కారం, నా దుంపతెంచక, మీ రెవరో, నాతో మీకేం పనో వేగిరం తేల్చి చెప్పండి.

శి: నీ తెలివి తెల్లారా. నన్నే పోల్చుకోలేకపోయావా? నువ్వేరా నేను.

రా: మీ రనేది ఏమిటో నాకు బోధపడలేదు. మళ్ళీ చెప్పండి. ఏవరన్నారూ?

శి: నువ్వేరా నేను.—అన్నాను.

రా: అంటే.

శి: తెలుగు భాషలో 'నువ్వేరా నేను' అంటే ఇంకో అర్థం లేదు.

రా: ఏమిటో మీ భాష నాకు బోధపడలేదు.

శి: అవును బోధపడదులే. నాకు తెలుసుగా.

రా: ఏదో నాకు తెలిసేటట్టు వివరంగా మీ రెవరో దయచేసి చెప్పండి?

శి: చెప్పానుగా, నువ్వే నేను అని.

రా: మీరు నేనా? నేను మీరా? ఏమిటీ గారడీ?

శి: గారడీ. గారడీ కాదురా; పచ్చిశుద్ధ నిజం ఇది.

"ఆరుద్ర"

రా: నా కేమయినా మతిపోయిందా, కలగంటున్నానా, జ్వరం వచ్చిందా?

శి: లేదురా నాన్నా, లేదు. నువ్వు ఈ మట్టికి, బస్సు స్టాండుదగ్గర బస్సు కోసం కాచుకొని ఉన్నావు. నీమతి ఎక్కడికీ పోలేదు. నా తలలోనే ఉంది. నాతల ఇంపీరియల్ బాంక్ సేఫు లాంటిది. అందులో దాచిన వస్తువులు ఎక్కడికీ పోవు.

రా: ఏమిటో నా కిదేం బోధపడటం లేదు.

శి: ఇందులో బోధపడకపోవడానికి ఏముందిరా లంగ్డీ. నువ్వూ నేనూ ఒక తల్లి కడుపులో పుట్టి—

రా: అబద్ధం, నేను మా తల్లికి ఒక్కణ్ణే కొడుకుని.

శి: అది నీ ఉద్దేశం.

రా: మర్యాదగా మాట్లాడు.

శి: కడాకూ వినరా. వినకుండా ఎగురుతావేం? నువ్వూ నేనూ ఒక తల్లికడుపున పుట్టి—

రా: అదుగో మళ్ళా ఆ కూతలే కూస్తావ్. మళ్ళా అన్నావంటే దవడపళ్లు రాలగొడతా.

శి: రాలకొట్టేందుకి నాకు పళ్ళు లేవులే. నువ్వూ నేనూ ఒక తల్లికడుపున పుట్టి, ఒక శరీరంలో పెరిగాం.

రా: ఒక శరీరంలోనా.

శి: అవున్రా, నాయనా అవును. ఒకే ఒక్క శరీరంలో ఇద్దరం పెరిగాం.

రా: నేన్నమ్మను.

శి: నమ్మి నమ్మకపో, ఇదిమట్టుకు వాస్తవం.

రా: నువ్వూ నేనూ ఒకే శరీరంలో పెరిగితే, మరి నిన్నెప్పుడూ నేను చూడలేదేం?

శి: నీ వీపెలాగుంటుందో నీకు తెలుసునా?

రా: తెలీదు.

శి: అయితే నోరు మూసుకుని నేను చెప్పింది విను.

రా: వింటాను. ఉండుండు. ఎవరో నన్ను పిలుస్తున్నట్టుంది. ఆ ఎవరు?

రాజారాం: ఏమండీ. శివరామయ్యగారూ. ఏమిటి మీలో మీరే ఏదో మాట్లాడుకుంటున్నారు.

శివ: ఆ. ఏమంటారూ.

రా: } రాజారాం గారూ. అయ్య
కంఠం: } అయ్య ఏమన్నారు.

రాజా: ఆ. ఏమిటో మీలో మీరే ఏదోమాట్లాడుకొంటున్నట్టుందన్నాను.

శివ: ఆ. అదా. అ. అ. (నసుగుతాడు)

రాజా: అవును. ఈ బస్సుకోసం కాచుకోనేసరికి కునుకు పడుతుందిలెండి.

శివ: ఆ. కునుకు కూడానా. అందులోకీ ఈ రొదలో.

రాజా: అవున్లెండి. ఒకబస్సూ రాలేదా

శివ: లేదండి. పావుగంటాయి వెయిట్ చేస్తున్నాను. ఆఫీసు వేళయిపోయింది. మీ రెంతిదాకా?

రాజా: ఇంట్లో బాధ పడలేక ఏవో నగలు కొందామని.



‘నన్నా?’
‘అవున్రా నిన్నే?’
‘ఎవరండీ మీరు?’

శివ: అవునోయ్. ఇంటిలోని పోరు ఇంతింత కాదయా అన్నట్టు వీళ్ళపోరొకటి. నేనూ వస్తున్నాను. వీళ్ళతో వేగలేక. ఆ. ఇంతకీ బంగారమెలా ఉందండి?

రాజా: డెబ్భయి ఐదో డెబ్బయి ఆరో ఉంటుంది.

శివ: అవునేండి. ఆడదాని వయస్సూ బంగారం ధరా ఇంతా అని తేల్చి చెప్పలేం.

రాజా: బాగా చెప్పారు. ఏం బంగారం ధర అడుగుతున్నారు. ఏమైనా నగలు మీరూ కొందామనా?

శివ: నా అర్జనకు కొనటం కూడానా. అమ్ముదామనే.

రాజా: అదేమిటండీ అలా అంటారూ. మీ కేంలోటు. నెలకి నాలుగువందలు సంపాదిస్తారాయె.

శివ: ఏం సంపాదనో. ఒక పంటికిందికి రావటం లేదు. ఎంత వొళ్ళుకి అంత గాలిఅనీ.

రాజా: అదుగో బస్సొస్తున్నది. (బస్సు హారను. బస్సు చప్పుడు)

కండక్టర్: ఎవరేను, ఎవరేన్. ఒత్తరుదా.

రాజా: శివరామయ్య గారూ, మీ రెక్కండి. ఆఫీసు వేళ మించిపోతుందంటున్నారు.

శివ: థేంక్స్, సెలవు.

2

(ఇది జరుగుతున్నంతసేపు చలనంలో, నిండివున్న బస్సులోని వాతావరణం. ఇద్దరు ముగ్గురుగా, సంభాషణలు, గంటలు, డ్రైవరు ఏమికికా, కండక్టరు నోటితో ఈల, ‘వుల్డ్ హాంగో,’ ‘టిక్కెట్ సార్,’ ‘రైట్‌రైట్’ మొదలైన వాతావరణం.)

శివ: ఏమిరా రాముడూ.

రా: నాతో మాట్లాడకు.

శి: నీతో కాకపోతే ఇంకెవరితో మాట్లాడమంటావ్.

(బస్సులో నవ్వులు)

రా: చూడు వాళ్ళంతా ఎల్లా నవ్వుతున్నారో.

శి: వాళ్లు నవుకొంటె నీకేం?

రా: నాకేమా? మా బావుంది నీతో. వాళ్ళు నన్ను చూసే నవ్వుకొంటున్నారు.

కండక్టర్: ఎన్ని సార్. ఎంగె పోవణం. టికెట్ సార్.

శి: టికెట్టు కొనరా.

రా: రెండు పారిస్.

కండ: రెండా సార్. రెండావడు ఆసు యారు సార్.

రా: ఆ. ఆ. ఒకటి. ఒక పారిస్.

(బస్సులో నవ్వులు)

రా: చూడు నువ్వేమిటి చేశావో.

శివ: నేనేమిటి చేశాను మహ్యన.

★ నన్ను గురించే ★

రా: చేసింది నువ్వు కాదూ. నువ్వు నవ్వులపాలు చేస్తున్నావు. ఇంకా ఏం చెయ్యాలి?

శి: అదేమిట్రా.

రా: నా శరీరం చూసి వాళ్ళు నవ్వు కొంటున్నారు. నేను ఇద్దరు మనుష్యుల బరువు ఉన్నాను. అందుకే రెండు టికెట్లు కొంటున్నా ననుకొంటున్నారు గాబోలు.

శి: అందులో తప్పేముంది.

రా: తప్పు కాదూ. అవును నీకేం తెలుస్తుంది. ఎద్దు పుండు కాకికి రుచి. అవును. నన్ను గురించి ఎవరే మనుకొంటే నీకేం?

శి: అదేమిట్రా. అలా అంటావు. నిన్నంటే నన్ను అన్నట్టు కాదూ. నిన్ను గురించి ఎవరే మనుకొన్నా నన్ను (ఎవరో, స్టాపింగ్ హోల్డాన్) గురించి అనుకొన్నట్టే లెక్క. ఏం ఇదివరకు. అదుగో చోటు ఖాళీ అయింది. కూర్చో.

కండ: నాయర్ రోడ్. హోల్డాన్. ఒక్కరుదా. యపిమిత్తే.

రా: నువ్వు కూర్చో నేను నించుంటా.

శి: నీ తెలివి తెల్లవారా రా. నువ్వు కూర్చుంటే నేను కూర్చున్నట్టే. మరిచిపోకు. నువ్వూ నేనూ ఒకే శరీరంలో ఉంటున్నాం.

రా: ఆ. అవునుకదూ.

శ్రీనివాసమ్మ: ఏమండోయ్ శివరామయ్యగారూ.

శివ: ఒరే రాముడూ ఎవరో పిలుస్తున్నార్రా నిన్ను. జవాబు చెప్పు.

రా: ఎవర్రా అది. నువ్వు జవాబు చెప్పు.

శ్రీని: ఏమండోయ్, శివరామయ్యగారూ,

శి: పలకరా, ఆవిడేమయినా అనుకొంటుంది.

రా: అబ్బ నువ్వు జవాబు చెప్పరా.

శి: ఆవిడెవరో నాకు తెలీదు.

రా: అయితే నాకుమట్టుకూ తెలుసునా ఏమిటి?

శి: తెలిసే ఉండాలి.

శ్రీని: ఏమండీ. శివరామయ్యగారూ. మాట్లాడరేం. పలుకే బంగారమా?

శివ: ఎవరూ బంగారమా.

శ్రీని: బంగారాన్ని కానండీ. బంగారమ్మ చెల్లెల్ని సీనమ్మని.

శివ: ఓహో సీనమ్మా, మరిచేపోయాను కులాసాగా ఉన్నావా?

శ్రీని: అవును. మే మెందుకు జ్ఞాపకముంటాము లెండి.

శివ: ఏదో పరధ్యాన్నంలో ఉండి చూడలేదు.

శ్రీని: మేం కనబడతామా?

శివ: కూర్చో, నిల్చొనే ఉండిపోయావు.

శ్రీని: మీరు కూర్చోండి.

శివ: పరవాలేదు కూర్చో.

కండ: రైట్ రైట్ రైట్ రైట్.

శి: ఏవిరా రాముడూ.

రా: ఏవిరా.

శి: ఎవర్రా ఆవిడా.

రా: ఎవరైతే నీకెందుకూ?

శి: ఒరే నాదగ్గరే దాస్తావుట్రా. చెప్పరా.

రా: నేను చెప్పను.

శి: చెప్పరా నేను మరెవరితోనూ అనను.

రా: నీకా సంగతులు అనవసరం.

శి: నీ వాలకం చూస్తే ఏదైనా

రా: ఛ. ఛ.

శి: ఈ సంగతి మన ఆవిడకు తెలిస్తే ప్రమాదం రోయ్.

రా: ఛీ దుర్మార్గుడా.

శివ: ఈ వయస్సులో నీకీ పోయే కాలమేమిటి?

రా: నేనెలా పోతే నీకేం?

శివ: అయితే అఘోరించు.

శ్రీని: కూర్చోండి శివరామయ్యగారూ.

శివ: కూర్చోకురా. ఎవరేనా చూస్తే ఏమేనా అనుకొంటారు.

రా: అనుకొంటే అనుకోనీ.

శ్రీని: ఏమిటి అదోలా ఉన్నారు. ఒంట్లో బాగాలేదా.

శివ: (నిద్రలేచినవాడిలాగ) ఆ.

శ్రీని: ఏమిటి మీలో మీరే ఏదో మాట్లాడుకొంటున్నారు?

శివ: ఏం లేదు. ఏం లేదు.

శ్రీని: పోనీండి చెప్పకపోతే. మీరే దాచుకోండి.

శివ: నీ దగ్గిర నాకు దాపరికమేమిటి? సీనమ్మా ఎప్పుడైనా ఏదైనా దాచానా నీదగ్గర?

శ్రీని: ఇదుగో ఇలా అంటూనే మళ్ళీ పెడతారు. ఆవేళ పొట్లంలో ఏముందో చూడనిచ్చారా?

శివ: ఎప్పుడూ.

శ్రీని: ఇంతలోనే మరుపా. పదిరోజులు కిందట. జ్ఞాపకంలేదూ?

శివ: ఓ. అదా. ఏం వుందీ. మందు పొట్లాం.

శ్రీని: అయితే నన్నెందుకు చూడనిచ్చారు కాదూ?

శివ: మందు పొట్లాం ఏం చూస్తావు? కంటనా, కాసుల పేరనా.

శ్రీని: చాల్లెండి. ఆ పొట్లంలో ఏమున్నదీ నేను తెలుసుకోలేనట్టు. మీ ఆవిడకు గొలుసు చేయించి తీసుకెళ్తున్నారు. అది నేను చూస్తే ఎక్కడ అడుగుతానా అని చూపెట్టలేదు.

శివ: ఆ. నీకెలా తెలుసు.

శ్రీని: మీరు చెప్పకపోతే మాకు తెలియకపోదు.

శివ: నీకెలా తెలిసిందీ అంటా?

శ్రీని: మీ ఆవిడే చూపించింది లెండి.

శివ: అలాగా.

శ్రీని: గాభరా పడకండి. నేను అడగ న్లెండి. నేను అడిగినా...

రా: అడుగుతుంది కాబోలా.

శివ: ఏమిటిరా.

రా: కంటో, కాసుల పేరో, దీనికొక్క చేయించేదీ.

శివ: ఓ అదా. నే నంతా విన్నాను

రా: ఏం దారిరా భగవంతుడా.

శి: సరే. ఇక్కడే దిగిపో.

రా: ఆఫీసో.

శి: ఆఫీసు మాట దేవు డెరుగును దిగిపో.

శ్రీని: ఏవండీ మాట్లాడరేం.

శివరా: ఆఁ. ఏదో ఆలోచిస్తున్నాను.

శ్రీని: ఏమిటి పిల్లలకి గాజులు చేయించడమా మానడమా అనా?

శివ: నీ కెలా తెలుసు?

శ్రీని: ఓస్సి ఈమాత్రం కనుక్కోలేనా?

శివరా: స్టాపింగ్ హోల్డాన్.

శ్రీని: మీరూ దిగుతున్నారా?

శివరా: ఎక్కడికి?

శ్రీని: మరి బస్సాపమని కేకేశారే.

శివరా: నువ్వు దిగుతావుకదా అని.

శ్రీని: నేను దిగుతానని మీ కెలా తెలుసు.

శివరా: నా మనస్సులో విషయాలు నువ్వన్ని కనుక్కోగా లేంది, ఈమాత్రం నేను కనుక్కోలేనా?

శ్రీని : అంటే?

శివరా : అంటే ఏమిటో నీకే తెలుసు. నే నెందుకు చెప్పడం.

(బస్సు ఆగుతుంది)

శ్రీని : సరే. నే దిగుతున్నా. మరచిపోకండి.

శివరా : ఆఁ. ఆఁ. ఏమిటి మరచిపోవద్దంటావ్.

శ్రీని : అదే నే నడిగింది.

కండక్టర్ : ఎరంగమ్మా. యారూ విరాదు. సార్ ఎడమిల్లే. ఎరంగమ్మా.

శివు : ఏమిరా రాముడూ.

రా : ఏం?

శి : బాగా తప్పించుకొన్నావే.

రా : ఏం నీకు కష్టంగా ఉందా?

శి : అవేం మాటలురా.

రా : మరి బాగా తప్పించుకొన్నావే. అని ఈసడించినట్టు అంటావేం?

శి : అదికాదురా. ఆవి డిక్కడ దిగుతుందని నీ కెలా తెలుసు అంటా.

రా : అవన్నీ నీ కనవసరం.

శి : చెప్పరా, నాకన్నా నీ కెవరున్నారు చెప్పు.

రా : చెప్పను.

శి : సరె దాచుకో పోనీ. ఆవి తేమిటడిగింది ? . .

రా : ఏమిటి అడిగిందా ? ఏమిటంటే - ఏమిటయితే నీ కెందుకూ, నువ్వేం ఆర్చేవాడివా తీర్చేవాడివా ?

శి : అవును. ఆర్చేవాణ్ణీ, తీర్చేవాణ్ణీ నేనే చెప్పు.

రా : వెళ్లవోయ్ నువ్వు ఆర్చేదీ, తీర్చేది ఏవిటో నాకు తెలుసు, కబుర్లు చెప్పకు.

శి : లేదురా నాయనో, నీ కేమయినా అప్పులుంటే తీర్చేస్తాను.

రా : ఆస్తుంటే ఆర్చేస్తావ్. అంతేనా.

శి : వేళాకోళం కాదుగానీ, ఆవి తేమిటడిగిందో చెప్పు.

రా : ఏమి టడుగుతుంది. డబ్బు - డబ్బు డబ్బు.

శి : ఎంతడిగిం దేమిటి ?

రా : ఓ రెండువందలు.

శి : ఇస్తావా ?

రా : ఇస్తాను రమ్మని. నే నేం కూచున్నానా? రెండు వందలుంటే పిల్లలకి గాజులు చేయించనూ.

శి : శుభస్య శీఘ్రం పిల్లలకి గాజులు చేయించు.

రా : డబ్బెక్కడుంది ?


శి : డబ్బు లేనట్టే మాట్లాడుతావ్. నాకు తెలీదా? దిగు. అదుగో బంగారపు దుకాణం పెళ్ళు. చేయించు.

రా : మీ తాతగారి సొమ్ము దాచ నాయనా. ఇట్టావ్?

శి : మీ తాతా మాతాతా వేరుకాదురా

రామారావు : నమస్కారం సార్.

(52 వ పేజీ చూడండి)



కోడలు

'రామూ, బావకు ఒక వుత్తరం వ్రాయి నాయనా. లక్ష్మిని తీసుకొని పండగకి ఒకసారి వచ్చి పొమ్మనమని. పిల్ల వెళ్ళి పదినెలలయింది. పదిరోజులపాటు వుండి పోతుంది' అన్నది సుభద్రమ్మగారు కొడుకుతో.

'అమ్మా, కూతురును చూడవలెననివుంటే నీవే ఒకసారి పోయిరాగూడదూ' అన్నాడు రామం చూస్తున్న పేపరు అవతల వేస్తూ.

'అదేమిటిరా. నీకుమటుకూ లేదూ చెల్లెలును చూడవలెననీ. కొత్తగా కాపురానికి వెళ్ళినపిల్ల. పదినెలలయినా మళ్ళీ మన యింటికి తీసుకరాకపోతిమి. అసలు శెలవు పెట్టి నీవే ఒకసారివెళ్ళి చెల్లెలునూ బావనూ తీసుకవస్తా వనుకున్నాను. శెల వివ్వరన్నావు కనుక నే ఒక వుత్తరంముక్కన్నా వ్రాయిస్తే బాగుంటుందనుకున్నాను. అంతే గాని నే నేమని వెళ్లేదిరా అమ్మాయిదగ్గరకు? అని అన్నది తల్లి కుమారునితో.

'అదిగాదమ్మా. పండగకు రమ్మనంగానే సరిపోయిందా. వాండ్లూ రైళ్ళకు బోలెడంత తగలేసి రావాలి. పైగా వాండ్లను పదిరోజు లుంచుకొని సాగనంపటానికి మనకూ వంద రూపాయలయినా వదుల్తవి. ఎందుకుచెప్పు యిప్పు డింత ఖర్చు. నీవు వెళ్ళివస్తే పాతికరూపాయలతో పోతుంది.'

'అబ్బాయి. అన్నింటికీ ఖర్చంటే ఎలాగురా. అయ్యో ఖర్చులలో యిదీ ఒకటి. మరి అక్కలూ, చెల్లెండ్లూ అని వుంటే ఇటువంటి ఖర్చు లెలా తప్పుతవిరా. దానికీ అక్కడ ఇన్నాళ్లుగావుంటే ఎలాగుందో. పదిరోజులు మనదగ్గరుంటే దానికీ సరదాగా వుంటుంది. నువ్వూ నేనూ తప్ప దానికి మటుకు యింకెవ్వరున్నారురా.'

'అమ్మా. యింకా నీకు పిచ్చిగాని దాని భర్తతో అది హాయిగా కాలక్షేపం చేసుకుంటున్నదిగదా. ఎందుకే ఇప్పుడీవంతాను. అయినా దానికి మనలను చూడవలెనని వుంటే అదే వస్తుంది బావతోచెప్పి'

'అదేమిటిరా. బావ పంపుతాడా. మీ అన్నయ్య వుత్తరం వ్రాస్తే పోదువుగానిలే అని అనడూ. పిలుపులేనిదే ఎలా గొస్తుందిరా ఎంత పుట్టింటికయినాసూ. ఒక వుత్తరం వ్రాయి నాయనా. అయ్యో ఖర్చు లేమిటో ఆ పొలంలోవచ్చే మక్తాలో వాడుదువుగానిలే. నీ జీతం డబ్బులో దమ్మిడీగూడా యివ్వ నక్కర్లేదులే' అని నిష్ఠూరమాడింది సుభద్రమ్మగారు.

'అదేమిటమ్మా అలాగంటావు. నాజీతం డబ్బులు మనకు సరిపోతేగదా పొలంపైకం నీకివ్వటానికి. ఈరోజుల్లో జీతం డబ్బులతోనే కాపురం గడిపేవాం డెక్కడున్నారమ్మా. ఆ పొలాలముక్తా కలిస్తేనే ఇల్లు గడవటం కష్టంగా వుంది. నీకు తెలియని దేమున్నదిచెప్పు. మొన్న నీ కోడలికి జబ్బుచేస్తే డాక్టరుకు డబ్బివ్వలేక నేగదా వాండ్ల అమ్మగారింటికి పంపింది. దానికి ఎలాగయినా యీ పండక్కి ఒక పట్టుచీరె తీయవలెనని అనుకున్నాను. ఆమాత్రం అయినా యివ్వలేకపోతే యిహ పెండ్లి చేసుకున్న దెందుకు చెప్పు? అని తల్లివంక చూశాడు రామం.

శ్రీ తన్నీరు

లక్ష్మీనారాయణ

'అబ్బాయి రామూ ఎంత తెలివితక్కువరా నీకు. మీ అత్తారికేం లక్షాధికారులు. వాండ్లమ్మాయికి ఎంతయినా పెటగలరు. పయిగా నీకుగూడా సాయం చేయగలరు. వాండ్లకేంలోటని నీవు నీ పెండ్లానికి చీరెలూ సొమ్ములూ యివ్వాలిరా. ఏదో కలసంబంధం అనిచేస్తే నీవుగూడా యిలాగంటే యిహ మనలక్ష్మికి ఎవరున్నారురా. యీసారికి నామాట విని గట్టిగా రమ్మనమని వుత్తరం వ్రాయి నాయనా. పండక్కి నలుగురూ యింట్లోవుంటే ఎంతో యిదిగా వుంటుంది నాకు' అని అన్నది సుభద్రమ్మగారు.

'అయితే మేముంటే చాలదన్నమాట. అవునులే. ఎంతయినా తల్లికి కూతురుమీద వుండేప్రేమ కొడుకుమీద ఎందుకుంటుందీ. నాకష్టాలు నీకెందుకూ. కూతురూ అల్లుడూ వచ్చి మేసిపోతే నీ కంతే చాలు. ఇవతల చచ్చేది నేనేగా' అంటూ కుర్చీలోంచి లేచాడు రామం.

'ఎందుకురా అలా విసుక్కుంటావు. చిన్నప్పటినుంచీ అన్నయ్యా, వదినే అంటూ నీవన్నా, నీపెండ్లామన్నా అంత యిదయ్యే లక్ష్మి అంటే నీకెందుకురా అంత కోపం? తిని పోతేనే ఖర్చుని లెక్కలువేస్తే ఎలాగురా. అన్నింటికీ రూపాయల జోలి తెస్తే యిహ తల్లీ కూతురనీ - అన్నా చెల్లెలూ - అనీ అనుకోటం దేనికిరా. ఏదో సర్దుకొని అన్నివిధాలా సమర్థుడవని అనిపించుకోవాలెగాని డబ్బుకోసమని సంబంధం మానుకుంటారురా ఎక్కడయినా. బాగానే వుంది నువ్వూను. నీ మాటలూను. నీవు వ్రాయకపోతే ఎవరిచేతన్నా నేనే వ్రాయించుకుంటాలే? అంటూ సుభద్రమ్మగారు లోనికి వెళ్ళారు.

2

'ఏమిటి లక్ష్మీ, ఇవ్వాళ యింత హుషారు' అన్నాడు శేఖరం ఆఫీసునుంచి వచ్చి కోటువిప్పుతూ వంటయింట్లో కూరగాలు తీస్తున్న లక్ష్మితో.

'ఏమండోయి వచ్చారూ. ఇంత ఆలస్యం చేశారేం యివ్వాళ. మనం రేపే మావూరు పోవాలి. పదిరోజులు ఆఫీసుకు శెలవు పెడుదురూ' అంది లక్ష్మిచేతులో వుత్తరం శేఖరాని కందిస్తూ.

'ఓహో, యిదా సంగతి. పుట్టింటిమీద ఘాలి మళ్ళబట్టే నన్నమాట యీ వుషారంతా. అయినా యీ ఆడవాండ్లకు ఎందుకో యింత మమకారం పుట్టింటి మీద'

'అదేమిటండీ. పదహారేండ్లు పుట్టి పెరిగిన యిల్లు. మా అమ్మా, అన్నయ్యా, వదినే వాండ్లను వదలి యిక్కడికివచ్చి ఏడాదిగావస్తున్నది. ఒకసారి వెళ్లిరావలెనని వుండదుటండీ.'

'అయితే నేను మాత్రం మా అమ్మానాన్నను వదలి యిక్కడుంటటం లేదూ. మావూరు పోవాలెనని నాకుండ దెందుకు?'

'ఆ. అలా అంటారు కాని మీవూరు పోవలసివస్తే మీరింతకన్నా హుషారు చూపిస్తారు. సరేగాని మనం రేపే బయలుదేరాలి. పదిరోజులు శెలవు వ్రాయండి.'

'లక్ష్మి. మా ఆఫీసు తనిఖీ కని ఆఫీసర్లు వస్తున్నట్లు తెలియపర్చారు. నాకు యిప్పుడు తీరిక చిక్కదు. నిన్న రేపు

మెయిల్లో ఎక్కించి వస్తాను. తర్వాత పది పదిహేను రోజులలో నేనువచ్చి మళ్ళీ తీసుకవస్తాను.'

'అయితే మీకే పదిరోజులా భోజనం ఏలా?

'ఆ. వీలయితే వండుకుంటాను. లేక పోతే మన హోటలు బంధువులున్నారుగా. పదిరోజుల కేం ఫరవాలేదులే. నీవుమాత్రం వెళ్ళిరా' అంటూ శేఖరం స్నానానికి వెళ్ళాడు.

భర్త రావటానికి వీల్లేకపోయెనే అని కొంచెం బాధకలిగినా అమ్మనూ అన్న య్యనూ చూడవచ్చు గదా అన్న ఉబలా టంలో ఆ బెంగ మాయమయింది లక్ష్మికి. ఎప్పుడు తెల్లవారుతుందా. ఎప్పుడు మెయి లెక్కుదామా అన్న ఆలోచనలతోనే నిద్ర పోయింది లక్ష్మి ఆ రాత్రి.

3

'ఇదుగో. చూడు రాజ్యం. యీ చీర నీకు నచ్చుతుందో. లేదో? అంటూ పొట్లం చేతి కందించాడు రామం.'

'బాగుంది. ఎవరు కొనమన్నారండీ యిప్పు డీ చీరెను. అసలే డబ్బు లేక యిబ్బంది పడుతున్నారుగదా. .ఎందుకండి యింత ఖర్చుపెట్టి యీచీర కొన్నది. ఎంత అయిందండీ యీ చీర.'

'ఆ. ఎంతలే నూటపదిరూపాయలు. యీ మూడేండ్లకీ నీకు ఒక్క చీరెకూడా కొని పెట్టలేదే అని అనుకున్నాను. ఎప్పుడూ వుంటే ఖర్చులే గదా. యీ పండక్కన్నా ఒక చీర కొందామనుకొని కొనేశాను.'

'అయితే డబ్బెక్కడిదండీ'

'పొలాల మక్తాలకింద మొన్ననే రెండు వందలూ యిచ్చిపోయినాడు సుబ్బన్న. యింకా వుంటే ఖర్చయిపోతుందని చీరె కొనుక్కువచ్చాను'.

'అదేమిటండీ. మీ అమ్మతో చెప్పారా'


'ఆ. మొన్ననే చెప్పాను. ఇహ మక్తా పయికం ఆమె కిచ్చేది లేదని'

'బాగుందండీ. పైగా ఆమె పయికం గూడా మనమే వాడుకోటమా.'

'రాజ్యం, ఆమె కెక్కడిదే పయికం. ఆ పొలంమటుకు నాదిగదూ, ఆమె ముటుకేం చేసుకుంటుందీ ఆ డబ్బును. ఇన్నాళ్ళూ అవస్థపడుతున్నా జీతంచాలక ఇహ యీ మక్తాగూడా ఆమెకే యిచ్చేస్తే కాపురం గడచేదట్లా రాజ్యం.'

'పోనీయండీ. ఆమె పెద్దది. యాత్రలకూ దానధర్మాలకూ ఆడపిల్లగూడా వున్నదాయె ఆమె యిష్టంవచ్చినట్లు ఖర్చు చేసుకో నివ్వరూ ఆ మక్తా డబ్బులను.'

'చాల్లే. అసలే ధరలు పెరిగి చస్తుంటే



'ఏమిటి లక్ష్మి ఇవ్వాళ యింత హుషారు' అన్నాడు శేఖరం ఆఫీసునుంచి వచ్చి కోటువిప్పుతూ.

యాత్రలూ, ధర్మాలూను. నీకు తెలియదు వూరుకో రాజ్యం' అంటూ ముగించాడు రామం తల్లిని చూసి.

'చూడండి అత్తయ్యా. పండక్కని చీర కొన్నారుట మీ అబ్బాయి' అంటూ రాజ్యం చీరను అత్తగారికి యిచ్చింది.

'బాగుందమ్మా. లేతరంగు. జరీగూడా నాణ్యమయిందే. పోనీలే తల్లి. యిన్నా ళ్ళకు ఒక్కచీర తెచ్చాడు. పండక్కు కట్టుకో తల్లీ' అంటూ తిరిగీ యిచ్చింది సుభ ద్రమ్మగారు. తల్లి ఏమీ విసుగుకోనందుకు రామానికి ఆశ్చర్యంగూడా వేసింది.

4

'అమ్మా, అన్నయ్య స్టేషనుకు రాలే

(66-వ పేజీ చూడండి)

ఉపకారము!

శేఖరం బ్యాంకులో గుమాస్తాగా చేరేడు. అతడు చదువుకొనే రోజుల్లో కన్న కలలన్నీ కరిగిపోయాయి. కట్టిన గాలిమేడలన్నీ కూలిపోయాయి.

బి. ఏ చదువుతున్న రోజుల్లో శేఖరానికి, జీవితం అంతా వెన్నెల వెల్లువలా కనిపించేది. లోకం అంతా పట్టు తివాసీల్లాంటి పచ్చిక బయళ్లతోటీ, ఫలపుష్పభరితాలైన ఉద్యానవనాలతోటీ, కోయిలల పాటలతోనూ, పండువెన్నెలలో బీచి షికారులతోనూ నిండియుండేది. పాడింది పాటగానూ ఆడింది ఆటగానూ కనిపించేది.

కాని బి. ఏ పరీక్షాఫలితాలు తెలిసిన మరునాటినుంచే, ఉద్యోగ ప్రయత్నాలు ఆరంభమయ్యాయి. వరుసగా వారం రోజులు 'హిందూ' పత్రికలోని ప్రకటనలు చూసినా, శేఖరానికి తన అభిరుచులకి సరిపోయిన ఉద్యోగం కన్పించలేదు. చుట్టుపట్ల ఉన్న కాకినాడ, రాజమండ్రి, ఏలూరు బెజవాడ వగయిరా పట్నాలన్నీ తిరిగేడు. ఆఖరికి ఏ కాలేజీలోనే ట్యూటరు ఉద్యోగమైనా దొరుకుతుందేమోనని ప్రయత్నించేడు. లాభం లేకపోయింది. అన్ని ఉద్యోగాలూ సిఫార్సులమీదా, కుల వర్గ పక్షపాతాలమీదా ఆధారపడ్డట్టు తెలియగానే, అతని కన్నులముందున్న మంచుతెరలు ఒకటొకటే తొలగిపోయాయి.

ఊరునుంచి రాగానే తనవైపు ఆశాపూరిత దృక్కులతో చూస్తూ, ఉద్యోగం దొరకలేదనగానే వైవర్ణ్యం చెందినముఖంతో నిట్టూర్పు విడిచే తల్లినీ, యీ చదువుతో యిల్లుగుల్లయ్యిందని చిరాకుపడే తండ్రినీ చూచి శేఖరం హృదయంలో నిరాశా, నిస్పృహా వ్యాపించడం మొదలుపెట్టేయి. ఇంతలో ఒక పుణ్యాత్ముడు బ్యాంకులో ఒక తాత్కాలికపు ఖాళీ ఉందని చెవిని పడేసేడు. తండ్రి యిది విన్నలగాయతూ కాళ్లక్రింద నిప్పులుపోస్తున్నాడు. శేఖరానికి, ఆలోచించడానికి కూడా వ్యవధి లేకపోయింది. ఇంట్లో జీవితం దుర్భరమైపోతోంది. ఏదిలోటు వచ్చినా, తండ్రి "బి. ఏ ప్యాసైనవాడు అడ్డగాడిదలా యింట్లో, కుంపట్లో గుత్తాలు తప్పుతోంటే, నేనెంతకని ఏడ్వను" అని సూటిపోటి మాటలు అంటూంటే, శేఖరానికి యింతకంటె నరకమే మేలనిపించింది. బ్యాంకు గుమాస్తా పనికి దరఖాస్తు పడేశాడు.

అయినా తనకా ఉద్యోగం రాదనీ తాను అంతకంటె విలువైన దానికి ఉద్దేశింపబడ్డాననీ, అనుకోడం, మానుకోలేకపోయాడు శేఖరం. కాని ఆర్డరు రానేవచ్చింది, వెంటనే వచ్చి చేరమని. శేఖరం, పర్వతశిఖరాన్నుంచి పాతాళానికి పడ్డట్టు అయ్యాడు. తనకు బట్టలు లేవన్నాడు. తండ్రి ఏభైరూపాయలు బదులు తెచ్చి యిచ్చాడు. ఆ ఉద్యోగంలో జీతం సరిపోదన్నాడు శేఖరం. పైన దొరుకుతుంది అన్నాడు తండ్రి. నేను లంచాలు పుచ్చుకోను అన్నాడు శేఖరం. అఘోరించావులే అన్నాడు తండ్రి అది తాత్కాలికమే అన్నాడు శేఖరం. అదే ఖాయమవుతుందన్నాడు తండ్రి ఇది చాలక యింకా


శ్రీ జీ. రాఘవేంద్రరావు

ఊరంతా చాటించివచ్చాడు మాఅబ్బాయికి బ్యాంకులో ఉద్యోగం అయిందని. ఇక శేఖరానికి తప్పలేదు. ఒక శుభముహూర్తంలో బయలుదేరేడు గుడికివెళ్లే మేకపోతులా. మేనేజరు యింటిదగ్గర 'లేకపోతే బాగుంటుందనుకున్నాడు. ఆయన యింటిదగ్గరే ఉన్నాడు. శేఖరాన్ని చూసి, ఒకసారి సకిలించి "బ్యాంకుగుమాస్తాపనికి సూట్లక్కరలేదు" అన్నాడు. శేఖరానికి భావిజీవితపు చీకటిరేఖలు ఒక్కసారి హృదయానికి తట్టేయి. "సరే, యీ కాగితం ఆఫీసులో ఎక్కౌంటెంటుకు చూపించు" అని మేనేజరు, వేరేపని చూసుకుంటున్నాడు. శేఖరం, బరువెక్కిన, హృదయంతో, అతృప్తితో, ఆందోళనతో, ఆవేదనతో బ్యాంకుకు చేరుకున్నాడు. ఎక్కౌంటెంటు పని చేసుకుంటూ హడావిడిలో శేఖరాన్ని చూసి, కుర్చీలో కూర్చోమని సంజ్ఞచేసి తనపనిలో పడిపోయాడు. ఎక్కౌంటెంటు మంచివాడే ననిపించింది శేఖరానికి. ఇక్కడ తాను భయపడ్డంతపాడుగా ఉండదేమోనన్న అస్పష్టమైన ఆశారేఖ హృదయంలో మెదిలింది. ఎక్కౌంటెంటు పని పూర్తవగానే శేఖరం యిచ్చిన కాగితం తీసుకొని చదివి "అరే! ఎంత పొరపాటైంది! గుమాస్తాగాణ్ణి కుర్చీలో కూర్చోమన్నానే. ఆసూటుచూసి ఎవడో ఖాతాదారుననుకున్నాను" అన్నట్టు ముఖం వికృతంగా పెట్టి, బంట్రోతును పిలిచి "ఇతణ్ణి ఆసోమయ్యదగ్గరకు తీసుకువెళ్లి చార్జి అప్పగించమను' అని తనపనిలో నిమగ్నుడైపోయాడు.

సోమయ్య తనకే శని ఎప్పుడు విరగడౌతుందా అన్నట్టు కుర్చీలో కళ్లుమూసుకొని కూర్చొని ఉన్నాడు. బంట్రోతు పిలవగానే, ఉలిక్కిపడిలేచి, శేఖరాన్నిచూసి ఖంగారుపడి తలగుడ్డ చుట్టుకున్నాడు హడావిడిగా ఏ ఆఫీసరో అనుకొని. బంట్రోతు భలానా అని చెప్పగానే "ఎంత వెధవపని చేసేను. తోటిగుమాస్తాగాడికోసం యింత మర్యాద ఎందుకు?" అనుకొని నొచ్చుకొని, ఒక్కసారి మళ్లీ కుర్చీలో కూలబడ్డాడు.

శేఖరం కూర్చోవడానికి కావిడిపెట్టె చూపించేడు. "ఇక ఆలస్యం ఎందుకు? చార్జి తీసుకోండీ" అని రెండువందల నలభైమూడుఫైళ్లూ, ఒకదస్తా కాగితాలున్న అర్జెంటు కాగితాలపెద్దూ అప్పగించాడు. "ఈ కావిడిపెట్టెలోవి ఏమిటి?" అని శేఖరం అడిగాడు. సోమయ్య ఒక వెకిలినవ్వునవ్వి "మిసలేనియస్ పేపర్లు." అన్నాడు. "అవి ఏంచెయ్యాలి" అని అడిగేడు శేఖరం. "ఏమి చెయ్యక్కర్లేదు. వాటికూడా జవాబు రాయలంటేరోజుకు యిరవైనాలుగుగంటలు సరిపోవు" అన్నాడు సోమయ్య పాపం! నువ్వు అమాయకుడవు అన్నట్టు ముఖం పెట్టి.

సోమయ్య ఒక బండెడు కాగితాలు అప్పగించిపోయాడు తల తడివిచూచుకుంటూ. శేఖరానికి ఆ కాగితాలు ఏం చెయ్యాలో బోధపడలేదు. చదివితే అర్థం కావడంలేదు బి. ఏ యింగ్లీషులో సెకండుక్లాసువచ్చినా. ఇటూ, అటూ చూసేడు. అందరు గుమాస్తాలూ తలలువంచుకొని తెగరాసేస్తున్నారు, అలా రాస్తున్నా యిలా బల్లకొద్దీ కాగితాలు ఎలా మిగులుతున్నాయో శేఖరానికి బోధపడలేదు. ఇంతలో బంట్రోతు "ఈ రోజుటపా" అంటూ ఒక బొత్తి కాగితాలు బల్లమీద పడేసిపోయాడు. అందులో కొన్నిటిమీద "అర్జెంటు" అనీ, మరికొన్నిటిమీద "వెరీ అర్జెంటు" అనీ, మిగిలిన వాటిమీద "ఈ రోజునే జవాబులు వెళ్లాలి" అనీ మేనేజరు రిమార్కులు ఉన్నాయి. వీటికి జవాబులు



"ఈ కావిడపెట్టిలోవి ఏమిటి?" అని శేఖరం అడిగాడు.
సోమయ్య ఒక వెకిలినవ్వునవ్వి "మిసలేనియస్ పేపర్లు" అన్నాడు.

రాయడం ఎల్లాగో తెలియలేదు అతనికి. ఇంతలో "ఏయ్! ఓ కొత్త గుమాస్తా! ఇవ్వాళే టపా తీసుకొని యిలా రా" అని ఒక కీచుగొంతుక వినపడింది. శేఖరం అటు చూసేడు. ఒక లావాటి పొట్టిమనిషి, మాసిన కోటు తొడుక్కొని, తాళ్లతో కట్టిన కళ్లజోడు టేబిలుమీద పెట్టి "నిన్నే! పిలుస్తున్నది. వినబడలేదా?" అని గర్జించేడు. శేఖరం కంగారుపడి ఆయనదగ్గరకు వెళ్లి నిలబడ్డాడు. "ఆ కాగితాలేవి" అని అరుపు. శేఖరం వెళ్లి తీసుకువచ్చేడు. "వీటన్నిటికీ యివాళే జవాబులు వెళ్లిపోవాలి. తెలిసిందా? అలా చూస్తావేమిటి" అన్నాడు హెడ్‌గుమాస్తా. "నాకు వీటికి జవాబులు రాయడం ఎలాగో తెలియదు" అని జవాబిచ్చేడు శేఖరం. "మరి మూడు పూటలా మూడు కంచాలు లాగడం తెలుసా?" ఈ ప్రశ్న వినేసరికి శేఖరానికి కళ్లవెంబడి నీళ్లు వచ్చేయి. ఇంత మోటుతనం-అందులో ప్రథమ పరిచయంలోనే, అతను ఎప్పుడూ ఊహించనైనా లేదు.

"నేను యీరోజునే చేరానండి. ఎలా రాయాలో చెపితే రాస్తాను." అని వినయంగా జవాబిచ్చేడు శేఖరం.

"మరే! మీ అందరికీ నేర్పడమే నా పని. నేను మీ బాబుగారి నౌఖర్ని - వెళ్లు. వెళ్లు - నీకు తోచినట్లు రాసిపట్టుకురా. ఈ బి. ఏ గాళ్లంతా యింతే - పైకి పటారం లోపల లొటారం" అని విసుక్కుంటూ హెడ్‌గుమాస్తా తనపనిలో మునిగిపోయాడు. శేఖరం సానుభూతికోసం, మిగిలిన గుమాస్తాలకేసి చూసేడు. వాళ్లు యీగొడవ వినిపించనట్లుగా ఏదో పరపర రాసేస్తున్నారు.

వాస్తవిక ప్రపంచం యింత తలక్రిందులుగా ఉంటుందని శేఖరం ఎప్పుడూ ఊహించలేదు. ఇక్కడ మానవత్వం అన్నది ఏకోశాన్నీ కనిపించదెందుచేత అని విస్తుపోయాడు. ఇంతలో గడియారం అయిదు కొట్టింది.

"అబ్బ! ఈరోజుకి పీడ విరగడయింది" అని లేచి బయలుదేరేడు శేఖరం.

"ఎక్కడికి?" అని కేకవేశాడు హెడ్డుగుమాస్తా.

"టైమయిందికదండీ-వెళ్లిపోతున్నాను."


"సెభాష్! బలేగుమాస్తావి దొరికేవు. బ్యాంకుపెట్టు తేరగా ఉందనుకున్నావు కాబోలు ఇవ్వాళటి అర్జెంటు కాగితాలు రాసేవా?"

"రేపు రాస్తాను."

"పనికిరాదు. ఇవ్వాళే పూర్తిచెయ్యాలి. మేనేజరుగారు వచ్చేరు. వెళ్లి సీటులో కూర్చో."

చేసేదిలేక శేఖరం వచ్చి కుర్చీలో కూల

(55-వ పేజీ చూడండి)



రెండో అంకం

రంగం : అదే.

సమయం : పదిహేను నిముషాల తర్వాత.

[ఉరుములు గర్జిస్తూనే వుంటాయి. తుఫాను చెలరేగుతుంది. నళిని కిటికీలోంచి బైటికి చూస్తూవుంటుంది.

రామానుజం గది అంతా పచార్లుచేస్తూంటాడు, మధ్య మధ్య రాజా గదివైపు చూస్తూ.

మోహన్ కాళ్ళు రెండూ టేబిలుమీద బారజాపి కూర్చుని ఏక్కడో ఆలోచిస్తూంటాడు.

సుకుమార్, నరహరి చెరో మూలవుంటారు.

కమల ఓ సోఫాలో కూలబడి నిశ్శబ్దంగా ఏడుస్తూంటుంది.]

రామా : ఏమంటారు నరహరిగారూ - వెదికొస్తారా శవంకోసం?

నర : ఎందుకండీ అనవసరంగా? నీళ్లల్లో మునిగిపోవడం మనం కళ్లారా చూశాంగదా! ఎక్కడ తేలుతుందో, ఎప్పుడు తేలుతుందో: పోనిద్దురూ.

[కమల ఒక్కసారి కెవ్వుమని అరిచి మళ్ళీ కూలబడుతుంది. నరహరి ఆమె దగ్గరకు వెళ్లి]

కమలా! వూరుకో...వూరుకో ముందు. (కమల మాట్లాడదు). నువ్వు ఇది భరించలేవు. లోపలికిపోయి పడుకుందువుగాని - లే.

[లేవదీసి పడమటింటి లోంచి లోపలకు తీసికెళ్తాడు.]

సుకు : మనిషికి బాగా మతి పోయింది. అనుమానం లేదు.

రామా : రాజారావుగారి సంగతేనా?

సుకు : ఆఁ. ఆ ఉపన్యాసధోరణికూడా చూశారా ఇందాక? మతిభ్రమించిన మనుష్యులకే—

రామా : తప్పించుకోడానికి వేస్తున్న వేషం కాదు కదా! అది పిచ్చిధోరణే అయితే వుత్తనటనేగాని నిజం కాదు. శిక్షపడకుండా తప్పించుకోడానికి! మతిభ్రమించి చేసిన నేరానికి కఠినశిక్ష వుండదుగా

సుకు : అసలెందుకు చేశాడంటారాపని?

రామా : అదే తెలుసుకోవలసిందిప్పుడు మనం.

మో : ఓ - తెల్సుకోవాల్సింది మనమా?

రామా : మీరుకూడా, ఒప్పుకుంటారనుకుంటాను, ఇక ఇక్కడి కార్యభారమంతా నా చేతుల్లోకి తీసుకోడానికి!

మో : (లేచి టేబిలుముందుకొస్తూ) నేనొప్పుకోను.

సుకు : ఎందుకని? ఆయనకంటే అనుభవజ్ఞులెవరున్నారు?

మో : ఆ పనికి ప్రత్యేకం పోలీసు డిపార్టుమెంటొకటి వుంది.

రామా : కాని ఈ లంకలో పోలీసనేవాడు—లేడుకదా!

మో : లేకపోతే వచ్చేదాకా నిరీక్షించండి.

రామా : వాళ్ళిక్కడికి రావడం ఎలా?

మో : తెలియజేస్తే సరి.

రామా : తెలియజెయ్యడంమటుకు ఎలా యిప్పుడు?

మో : నాకేం తెలుసు? ఎలా చేసినా సరే!

సుకు: అదేమిటోయ్ అలా మాట్లాడతావ్!

రామా : ఏం వెంకన్నా! మరో లాంచీ వున్నది కదూ?

వెంక : వుంది గాని ఈ తుపాన్లో అద్దరి చేరుకోడం చానా కష్టం బాబూ. చాలా పాతది - రిపేర్లు పడ్డది కూడానూ. తట్టుకోలేదీ గాలిదెబ్బకి.

రామా : మరేం చెయ్యడమిప్పుడు?

[నరహరి వస్తాడు.]

మో : వెళ్లిపోయిన లాంచీ తిరిగి వచ్చేదాకా కాళ్లు ముడుచుక్కూర్చోడమే!

రామా : రావట మెప్పుడది?

వెంక : ఎల్లుండి మధ్యాహ్నం పేళ బాబూ. సరళమ్మగార్ని ఆర్నీ ఎక్కించుకొస్తుంది.

[నళిని సవిచారంగా ఇటు చూస్తుంది]

అదయినా ఈ తుఫా నణిగిపోతేనూ. ఇలాటిది సామాన్యంగా నాలుగైదు రోజుల్దాకా తగ్గదు.

నర : పాపం! ఇన్నేళ్లకి భర్తని చూడ్డానికి వస్తోంది. చివరికిది!

[అంతా ఒకరి మొహం ఒకరు చూచుకుంటారు. ఒక్క క్షణం అవకాశం..., గాలి హోరెత్తి, ఎక్కడో తలుపులు కొట్టుకుంటై.]

సుకు : (ఉలిక్కిపడి లేచి) ఏమిటది? ఏమిటి? (అంటూ వెనక్కి వెనక్కి తగ్గి సోఫాలో కూలబడతాడు.]

వెంక : వుత్తి గాలే బాబూ - అంతకంతకూ ఎక్కువౌతోంది.

రామా : (గొంతు సవరించుకుంటూ) జరిగిన నేరానికి సాక్ష్యాధారాలు మాసిపోకముందే కేసు క్లియర్ చెయ్యడం మన విధి. నాలుగు మూడురోజుల్దాకా పోలీసు లిక్కడికి చేరుకోలేకపోవచ్చు. వచ్చిన తర్వాత హత్యకు కారణం ఏమిటో వాళ్ళు నిర్ధారణ చెయ్యలేకపోయినా - రాజారావు తనింతదాక స్వయంగా ఒప్పుకున్న విషయం కాదని బుకాయించినా, అతనే నేరస్థుడని రుజువు చెయ్యడం అసంభవం.

మో : ఐతే మీరే అతన్ని నేరస్థుడుగా నిరూపిస్తా నంటారా?

రామా : తప్పేం?

సుకు : అవును. ఏమిటి తప్పు ?

మో : అంత అవసరం లేదంటాను. రాజా రావుని దోషిగా నిరూపిస్తే చచ్చిపోయిన నారాయణ తిరిగి వస్తాడా ? ప్రపంచంలో హత్యలు జరక్కుండా ఆగిపోతయ్యా ?... ఏదో తగినంత కారణం లేందే రాజా అతన్నెందుకు చంపుతాడు ?

వెంక : నేనూ అంతే అనుకుంటున్నా బాబూ.

[అందరూ వెంకన్న వంక చూస్తారు.]

రామా : (అతనివైపో అడుగువేసి తదేకంగా చూస్తూ) మాకు తెలియాల్సిన విషయం ఏదో నీకు! తెలుసునల్లేవుందే...(అధికార స్వరంతో) చెప్పు ఏమిటో అది... (బిగ్గరగా) చెప్పు.

వెంక : నాకేం తెలీదండీ.

రామా : చెప్పు నిజం...నిజంగా తెలీదా నీ యజమాని నారాయణంగార్ని ఎందుకు హత్య చేశాడో ?

వెంక : అదేనండీ.

రామా : (ఉలిక్కిపడి) ఏమిటది ?

వెంక : పూరికే నే చంపెయ్యా లనిపించి వుండొచ్చు!

రామా : ఎవడైనా సరే ఏవిధమైన సాక్ష్యమైనా అణిచిపెడుతున్నాడని తెలిసిందా ! (అని వేలు తాటిస్తాడు) - పోలీసులు రాంగానే—

వెంక: (గబగబా ముందుకొచ్చి) ఏమండీ నాకో చిన్న విషయం జ్ఞాపకం వచ్చిందీ—

[అతని వెనకాలే వచ్చిన నళిని అతని డొక్కలో పొడుస్తుంది మోచేత్తో... వెంకన్న నోరు మూత పడిపోతుంది.]

రామా : చెప్పు - ఊఁ - ఏమిటా చిన్న విషయం ?

వెంక : అరెరే - ఇంతలోనే మరిచి పొయ్యానండీ - వెధవది.

రామా : ఇదుగో అబ్బాయ్! నువ్వేమన్నా దాచి పెడ్దా మనుకుంటున్నావేమో—

నళిని : ఆగండి అంతటితో ! పోలీసులు రాకముందు మేం ఏ ప్రశ్నలకూ సమాధానం ఇవ్వం. అలా అని వాళ్ళకి రిపోర్టు చేసుకోవచ్చు.

[సుకుమార్ ఒక్కసారి ఎగిరిపడి లేచి మెట్లమీది తలుపువంక వేలెట్టి చూపుతాడు. అది నెమ్మదిగా తెరుచుకుంటోంది.]

సుకు : చూడండి - చూడండి—

రామా : (భయంతో కంపిస్తూ) ఈ - ఈమిటది ?

సుకు : (వెనక్కి తగ్గుతూ) ఇ - ఇవతలికి వస్తున్నాడు.

[నరహరి వెనక దాక్కుంటాడు. కాని తలుపు మళ్ళీ నెమ్మదిగా మూసుకుంటుంది]

సుకు : ఏమండీ—ఏమిటి చెయ్యడం ?

నళిని : ఎందుకంతభయం ? ఏం అతను బైటికివస్తే?

సుకు : మనల్నందర్నీ వరసగా నుంచో బెట్టి షూట్ చేసిపారేస్తే?

రామా : బెదిరించాడుగా ఇందాకనన్ను గూడా, రివాల్వరుతో చంపుతానని!

మో : ఏం ఇంతలోనే?

సుకు : ఏమన్నా వుపాయం చూడండీ, అత నెలాగయినా బయటకు రాకుండా చెయ్యండీ. మీకు పుణ్యముంటుంది.

రామా : వెంకన్నా ఆ తలుపుకి తాళం చెవి వుందా?

వెంక : వుందిబాబూ.

★ కాళరాత్రి ★

రామా : ఇచ్చెయ్యిలా.

వెంక : ఎలా ఇవ్వను బాబూ? నే నివ్వ లేను.

రామా : ఎందుకని?

వెంక : ఎలా సార్—తలుపుకే పెట్టి వుంది - (చూపుతూ) అవతలపక్క.

రామా : ఓ! (నిస్సారంగా కుర్చీలో కూర్చుంటాడు.)

నళిని : రాజాని బైటకు రానీకుండా తాళం వెయ్యాలనా? పోనీ - మీరే వెళ్ళి తీసి రారాదూ? దానికే వుందిగా తాళం చెవి?

రామా : (ఎగిరిపడి లేచి) నేనా?... నేను!......నా కతడు తాళం చెవి ఇయ్యక పోవచ్చు.

మో : (అతని పిరికితనానికి నవ్వువచ్చి) లాక్కరండి ఇయ్యకపోతే.

రామా: అతనిదగ్గరే వున్న దింకా ఆరివాల్వరు!...పోనీ మీరు పోయి తీసుకు రారాదూ - నాకంటె పరిచయంగల వారుగా?

మో : నాకేంపట్టింది?

రామా : నిర్వర్తించవద్దుటండీ మరి మనవిధి?...నిరాయుధుణ్ణిచేసి అతన్ని లాకప్‌లో వుంచడం మనడ్యూటీ అంటే వినలేం?

మో : నా డ్యూటీమటుకు్కాదు.

రామా : వెళ్లితీసుకురా వెంకన్నా, ఆతాళం చెవి నువ్వైనా.

వెంక : కావాలంటే ఓ దణ్ణంపెడతా గాని నావల్లమటుకు్కాదు బాబూ ఆపని.

రామా : వెళ్ళనంటున్నావా?

వెంక : చిత్తం.

మో : (చిన్న నవ్వుతో) శబాష్ వెంకన్నా.

రామా : పోనీ నువ్వు సుకుమార్?

సుకు : అమ్మ బాబోయ్ - ఇంకేమన్నా వుందా?

రామా : ఎల్లా చచ్చేది ఇంత మంది సహాయ నిరాకరణం చేస్తూంటే?

నర : నే వెళ్ళి తెస్తాను.

[లేచి వెళ్ళి మెట్లెక్కుతూంటాడు. అంతా వూపిరిబిగబట్టి చూస్తూంటారు]

సుకు : (అతన్ని మధ్యలోఆపి) వొద్దు.. మిమ్మల్ని బతకనీడు.

[నరహరి అతన్ని వదిలించుకుని ముని వేళ్ళమీద నడుస్తూపోయి తలుపు హాండిల్ మెమ్మదిగా తిప్పతూంటాడు]

సుకు : జాగ్రత్త.

రామా : (భయమేసి) ఇష్!

[నరహరి తలుపు కొద్దిగా తోసి సందు లోంచి చెయ్యి పోనిచ్చి తాళం చెవి తీసుకుని దభాలున తలుపు లాగి మూసి ఇంకా బలంగా నే పట్టుకుంటాడు.]

సుకు : కానీండి. త్వరగా తాళం వేసెయ్యండి. మళ్ళీ వస్తాడేమో!

[నరహరి తాళంచెవి పెట్టి తిప్పి కిందికి వస్తాడు. పెద్ద అపాయంలోంచి బయట పడ్డట్టు రామానుజం ఊపిరి పీల్చి, నరహరికేసి మెట్లపైపు పోతూ—]

రామా : మీకేమన్నా సాయంచేద్దామని వస్తున్నాను.

[మోహన్ ఫక్కున నవ్వుతాడు.]

నర : (విరసంగా) ఓ - అలాగా! థాంక్స్!

రామా : జాగ్రత్త చేస్తాన్లెనా తాళం చెవి. ఇవ్వండిలా మిస్టర్ నరహరి!

[నరహరి ఓ క్షణం అతనివైపు చూసి తాళం చెవి ఇస్తాడు.]

రివాల్వరుకూడా ఏకంగా తెచ్చెయ్యక పోయూరా - బాగుండేదిగా!

నర : (అసహ్యంతో ఓపక్కకి పోతూ) ఈసారి మీరు వెళ్ళి తీసుకురండి. తాళం చెవి మీదగ్గరే వుందిగా!

రామా : అఁ - ఆఁ - పోనీండి. మరేం ఫరవాలేదు. తాళం బేశారుగా గదిలోపెట్టి! చాలది...(ఎగిరిపడి)పడిందో లేదో తాళం సరిగ్గా?

నర : చూసి రండి.

రామా : అఁ-ఎందుకూ? పడే వుంటుంది లెండి.

నళిని : ఊఁ. వెంకన్నా? మా యింటికి వెళ్తున్నాను. వస్తావా నాతో అందాకా?

వెంక : వస్తా పదండమ్మా.

రామా : అఁ - వెంకన్నా! వెతికిరావాలి నువ్వోక్కసారి నది ఒడ్డునే. చూడాలి జాగ్రత్తగా ఆ రెల్లుదుబ్బులదగ్గరా అక్కడానూ. అలాంటి చోట్ల శవం చిక్కుకొని వుండొచ్చు!

వెంక : (ఇష్టం లేకపోయినా తప్పనిసరై బల్లమీది పెర్చిలైటు తీసుకుని) సరే బాబూ.

రామా : నా కోసారి నువ్వు కనిపించు మళ్ళీ వచ్చాక.

[వెంకన్న, నళిని వెళ్తారు.]

ఏం బాగుండలేదు నాకీ నౌకరువాడి తరహా. వాడికీ విషయం గురించి మనందరి కంటే బాగా తెలుసని నా అనుమానం.

సుకు : అబ్బ - ఈ పిక్నిక్‌లో హత్య ప్రోగ్రాం కూడా వుంటుందని తెలిస్తే అసలు నే వచ్చేవాణ్ణే కాదు.

రామా: అందులోనూ కళ్ళ ఎదట జరిగింది కాస్తా కూస్తా సంఘటనా? తీసి పారెయ్యడ మూరొ, ఓ నిండుజీవిప్రాణాలు నిలువునా!

సుకు : మొగాణ్ణి నాకే ప్రాణాలింకా గూట్లోకి జేరుకోలేదు.

మో : (అసహ్యంవేసి) నీకేం కొచ్చిందిప్పుడు?

సుకు : ఏం రావాలింకా - చచ్చినంత పనైతే! పిస్తలు సరిగ్గా నాకేసే గురిపెట్టాడిందాక. తెలుసా?

మో : పేల్చలేదుగా.

[రామానుజం చిత్తు కాగితాల బుట్ట లోంచి కొన్ని కాగితం ముక్కలు, ఓ కవరు తీస్తాడు.]

నర : ఏమిటవి?

రామా : చించిపారేసిన ఉత్తరం అనుకుంటాను. దీనిమీద వున్నది రాజారావు గారి అడ్రసే! చింపెయ్యలేదిది.

మో : (లేస్తూ) చూస్తూంటే చాలా దూరం పోతోందిది. మీకేం సంబంధమనండీ—

రామా : ఆయన దారుణకృత్యానికి కారణం ఏమిటో తెలుసుకోడానికి ప్రయత్ని

స్తున్నా ్నేను. దాని కీ ఒక వుత్తరం ఆధారం కావచ్చు.

హే: తినిపోవయ్యా అని విందుకు పిలిస్తే నీపని నువ్వు చూచుకోక పెద్ద సి. ఐ. డి. పని చెయ్యబోతా వేమిటయ్యా నా కర్థం కాక అడుగుతాను ?

సుకు : అఁహాఁ - అదేమిట్రా ? జరిగిన పనికి ఆ వుత్తరం ఆయువుపట్టు కావచ్చు..

మోహన్ మాటల కేంగాని - రండి రామానుజంగారూ ఆ కౌగిలం ముక్కలు అతికిద్దాం కలిపి.

[కౌగిలం ముక్కలన్నీ టేబిలుమీద

★ కాళరాత్రి ★

తేసు కుర్చీని సర్దటం మొదలెడతాడు. రామానుజం పక్కనే నిలబడతాడు.]

మో: ఛీ ఛీ - దరిద్రం!

సుకు: (కాగితం ముక్కలు పేర్చి కూరుస్తూ) ఆఁ - వొస్తోంది - వొస్తోంది.

రామా: (ఉలిక్కిపడి) ఏమిటది?

సుకు: ఇదేసార్ ఈ ఉత్తరం సరిగా వస్తోంది.

నర: ఇలా తేండి అట్టే అరవక. నే చూస్తా నాపని.

రామా: అదికాదు మిస్టర్ మోహన్! ఎందుకు మీకీ మొండిపట్టుదల? వినిపించుకోకేం మేంచెప్పేది?

మో: అసలు వరస చూడగా ఉరితాడు మీ చేతులారా నే బిగించాలని వున్నట్టుందే!

రామా: (కోపంవచ్చి) ఇన్సల్ట్! నేనే కాదు - మనం అధరంకూడా ఇప్పుడు విపరీతమైన అపాయంలో ఇరుక్కునివున్నాం! అవకాశం దొరికితే చాలు, మనలో ఎవరైనా సరే, అంతం చెయ్యడానికి ఖైయిదీ సిద్ధంగా వున్నాడు!—

సుకు: నాకు తెలుసుకే చెప్పడంలా?..

రామా: కాపాడటానికే మిమ్మల్నందర్నీ కూడా - ఏంచేసినా నేనిప్పుడు!

మో: థాంక్స్......నన్ను నేను కాపాడుకోగలను.

సుకు: మరి నాసంగతి?

మో: నీకేం వచ్చిందిప్పుడు?...ఇందుకే నా కసహ్యం మిమ్మల్ని చూస్తుంటే! నవలల్లోనూ సినిమాల్లోనూ హంతకుల్ని చూసి వాళ్లని తెగపొగిడి సమర్థించే మీరు, మన మిత్రుడొకడు ఎవరినో ఎంత సమంజసమైన కారణంవుండో హత్య చెయ్యంగానే అంతా హడిలి చచ్చి వాణ్ణి విచారించాలనీ వురిదియ్యాలనీ పట్టుదల బడుతున్నారు ఛీ!......నాకు మటుకీ దరిద్రవ్యవహారంలో ఏవిధమైన జోక్యం అక్కర్లేదు. మీ ఏడుపు మీరేడవండి - నే వెళ్తున్నాను భోజనాలగదిలోకి [వెళ్ళబోతాడు]

సుకు: మరి- నేను?

మో: రావయ్యా వస్తేనూ.

సుకు: కాస్త - ఆవుత్తరమేమిటో చదవనీరా వినిపోదాం...

[మోహన్ కోపంవచ్చి అతని వంక అసహ్యంగా చూసి తలుపుదభాల్ని మూసుకుని వెళ్ళిపోతాడు. నరహరి లేచి నుంచుంటాడు, అతికించిన వుత్తరం చూస్తూ.]

నర: ఇదుగో-వుత్తరం!

సుకు: ఎక్కణ్ణుంచివచ్చింది?

రామా: ఏమని రాశారు?

సుకు: ఎవరు వ్రాశారసలు?

రామా: ఇవ్వండిలా - చదువుతాన్నేనది.

[కాగితం తీసుకుని దానివంక చూస్తాంటాడు]

రామా: కొంచెం కష్టంగానే వుందిగాని చదవటం—

సుకు: చంపకండీ - వెధవ సస్పెన్సూ మీరూనూ. చదవండి.

రామా: (చప్పచప్పగా చదువుతూ) "ప్రియా—" (ఆగి కాగితంలోకి చూస్తూంటాడు.)

సుకు: ప్రియా?!...ఓఁ - ప్రియా—:

రామా: "ఎప్పుడు రెక్కలు కట్టుకు

వచ్చి మీదగ్గర వాలుదామా అని ఎంత...” తెలీటం లేదేమిటో.

నర : (అతని బుజాలమీదనుంచి చూసి) “ఉఱ్ఱూతలూగుతున్నా—”

రామా : ఆఁ...“ఎంత ఉఱ్ఱూత లూగుతున్నా, ఓరోజు ఆలస్యం అయితీరాల్సి వచ్చింది. దీనికి కారణం మా అమ్మ వంట్లో కాస్త నలతగా వుంటమే. అయినా ఈ ఆలస్యానికి నాకుమటుకు ఏమో దుడుగ్గానే వుంది. ఆలస్యానికి అపార్థం చేసుకోవద్దు. మీరుకూడా నన్నుమానిస్తే ఎలా? మీరే నా ప్రాణం. మీరే నా సర్వస్వం. మన ఆనందం మన సౌఖ్యం పరిపూర్ణం కావాలంటే ఒకే ఒక మార్గం వుంది—” (చదవటం ఆపి అందరివంకా మాస్తాడు, చూశారా అన్నట్టు. వాళ్ళు కానీమని సైగ చేస్తారు.) “మీరైనా నన్ను హృదయపూర్వకంగా ప్రేమించకపోతే నా కాత్మహత్యే శరణ్యం......పిచ్చిపిల్లని ఇదంతా వ్రాస్తున్నానేమిటి!......నాకు తెలీదూ మీరు నన్నెంతగా ప్రేమిస్తున్నారో?... మిగతా సంగతులన్నీ స్వయంగా—”

సుకు : ఆఁ. ఇంకేం రాశారు?

రామా : (ఉత్తరం బల్లమీద పెట్టి జేబుగుడ్డతో నొసలు తుడుచుకుంటూ) అంతే... ఇంకేం లేదు.

సుకు : (దగ్గర కొస్తూ) ఎక్కణ్ణుంచి వచ్చిందసలది? సంతకం ఎవరిది? (తీసుకు చూచి) “సరళ”!....సరళా?...నారాయణ పెళ్లాం? ఓరి దేముడా! రాజారావుకి సరళ ప్రేమలేఖా?

[నరహరి ఎడంగా జర్గాడు.]

రామా : ఇదీ సంగతి! జరిగిన పనికి కారణం ఇదీ! అర్థం కాలే?

సుకు : ఇందుకే నన్నమాట రాజారావీ హత్య చేసింది! నారాయణ తన ప్రేమకలాపాని కేవిధంగానూ అడ్డం లేకుండా వుండాలన్నమాట!—...కాని రాజారావలాంటి వాడయితే నారాయణ్ణీ సరళనీ కలపాలని ఇంత ప్రయత్నం ఎందుకు చేస్తాడా అని!

రామా : అసలు రహస్యం బైటపడకుండా తనేదో పెద్ద ఆప్తుడని అందరూ అనుకోడానికే అయివుండాలి!... ఇదుగో కవరు......చింపెయ్యలేదు దీన్నిమాత్రం. ఇలానే వుంటాయి హంతకులు చేసే పొరపాట్లు!...(కవరుమీది అడ్రెసు చదువుతూ) “మహారాజశ్రీ శ్రీరాజారావుగారికి!” (బాల్కనీవైపు తిరిగి) హుఁ! మహారాజశ్రీ శ్రీరాజారావుగారూ! చాలా పొరబడ్డారు వారీకవరు చింపకుండా పారెయ్యటంలో! చేసినపాపానికి తమరుచేతులారా రాసిచ్చిన వాఙ్మూలం ఇదే!...(సుకుమార్ వైపు తిరిగి) జాగ్రత్త చేస్తాన్నేనివన్నీ. ఇవ్వండిలా. (ఉత్తరం తీసుకుని జేబులో పెట్టుకుంటాడు.)

నర : సరళకూడా ఇది ముప్పే. ఈ వుత్తరాన్నిబట్టి ఆమే ఈ హత్యకు ప్రోత్సహించిందనవచ్చు.

రామా : కానీ - ఒకటున్నది నా కర్థం కాని విషయం - ఎందు కొప్పుకున్నాడసలు రాజారావు ఈపని చేసింది తనేనని? గప్‌చిప్‌గా వూరుకుంటే ఎంత బుర్రలేనివాడైనా, శవాన్ని ఏ యేట్లోనో, బావిలోనో తోసిపారేసి!

సుకు: అసలు నే మేలుకునే వున్నానా; లేకపోతే ఇదంతా ఓ భయంకరమైన కలా?

[ఉన్నట్టుండి అకస్మాత్తుగా పడమటింట్లో రేడియో పాట మొదలెడుతుంది. పాట కీచుగా కఠోరంగా వినవస్తుంది. అంతా ప్రతిమలవలె ఉండిపోతారు.]

సుకు: (గొంతు పెకలించుకుని) పాట!.. రేడియో!...

నర : ఎవరు పెట్టారో?

రామా : చూసిరండి (తనుమాత్రం కదలడు).

[నరహరి గబగబావెళ్ళి కాస్త ఆగి తలుపులు దభాలున తోస్తాడు. పడమటింట్లో అంతా చీకటి - రేడియో పాడుతూనే వుంటుంది. అగ్గిపుల్ల గీచి లోపలికిపోతాడు నరహరి. లోపల స్విచ్ నొక్కి లైటు వేస్తాడు - పాట మధ్యలో ఆగిపోతుంది - లైటు ఆర్పి నరహరి ఇవతలకు వచ్చి తలుపులు వేస్తాడు.]

రామా : } ఏమిటది?
సుకు : }

నర : (కాస్త విసుగుతో) రేడియో.

సుకు : ఎవరు తిప్పారు?

నర : ఏమో - నాకు మటుకేం తెలుసు?

సుకు : ఇహ నాకు మూర్ఛ వస్తోంది.

రామా : (కాస్త తేరుకుని) ఆఁ - ఆఁ. ఏ పనివాళ్లో అయివుంటారు, నీలాంటి పిరికి పందల్ని బెదరగొట్టడానికి.

సుకు : కాదు—అది పెట్టింది రాజారావే! నాకు తెలుసు. అలా అని నా అంతర్వాణి చెప్తోంది.

రామా : అసంభవం. వేసిన బోల్టువుంది వేసిన తాళం. భద్రంచేసిన తాళంచెవి జేబులో భద్రంగానే...

[జేబులో చెయ్యిపెట్టి చూసుకుంటాడు. దొరక్క ముఖం అంతా చెమటలు కమ్మి కంగారుగా జేబంతా గాలిస్తాడు. చివరికి దొరుకుతుంది. అమ్మయ్య అని నిట్టూర్చి—]

ఇదుగో - ఇక్కడే వుంది భద్రంగానే. నేపోయి విడిపిస్తేగాని బైటికి రాలేడతను -

సుకు : అవునూ - ఆ గదిలోంచి ఈగదిలోకి గోడల్లోంచీ స్తంభాల్లోంచీ రహస్య మార్గాలేమన్నా వున్నయ్యేమో?

రామా : అవునండోయ్ వుంటే వుండొచ్చు-మీట తలుపులూ మర సొరంగాలుకూడా!

నర : (విసిగి) సరే - మనమిక చెయ్యగలిగిందేమీ లేదు. పోయిపడుకుంటే మంచిది.

సుకు : పడుకో? [illegible] కంటిమీద కునుకు రాదు, నాకు. ముందా మీట తలుపుల సంగతేదో కనుక్కుంటేగాని—

నర : ఆ మిగతా వుత్తరాల సంగతేమిటి రామానుజంగారూ?...అవేవీ చించిలేవు కదూ?

రామా : లేవు.

నర : ఐతే అవ్వి మనం తెరవడం మంచిది కాదనుకుంటాను. అథమం అవైనా పోలీసులకు వదిలెయ్యడం మంచిది.

రామా : (ఇష్టంలేకపోయినా) అవునను కుంటాను. అదేమంచిది. ఈ డ్రాయర్లో పెడ్తానివన్నీ (పెట్టి) తాళం కూడా వేస్తే మంచిదనుకుంటాను! (వేసి) ఇది కూడా నా జాగ్రత్తలో వుంచుతాను.

(23-వ పేజీ చూడండి)

సౌజన్యం

అతని మన స్తత్వం అతనికే బోధపడదు. ఎందుకు అస్తమిస్తున్న సంధ్యకేసి అదే పనిగా చూడడం? ఎండిపోయి, ఆకులన్నీ రాలిపోయి, కేవలం కొమ్మలు మాత్రమే మిగిలిఉన్న చెట్ల అస్థిపంజరాలు చూస్తే ఎందుకలా నిలబడిపోవడం? రోజూ అతని కదో బాధ అయిపోయింది. ఎందుకో, అందులోనూ మరీ, ఆఫీసుముందుగా ఉండే పెద్ద చెట్టు మరీ నిలబెట్టేస్తున్నది. తోడి గుమాస్తాలు కూడా తనలాగా నడుస్తున్నారు. వాళ్ళందరి తోటే తనూ మొయ్యలేనంత కాగితాలకట్ట చేతపట్టుకుని — ఎదురుగుండా ఆ సమయానికే బయలుదేరబోయే రైలు కోసం వెళ్తున్న యిస్త్రీ బట్టల మనిషి వన కొతల, సామాను మోస్తూ వెళ్తున్న కూలీకేసి ఏదో *Superiority Complex* తో చూసి...తనది మాత్రం *Manual Labour* కాదనుకుని సంతోషించే, సంతృప్తిపడే తన మిత్రులలాగా తనూ బతకగూడదూ. ఆఫీసు వదలి బయటికి వచ్చిన మరుక్షణంనుంచీ కూడా ఎవరికో యిచ్చిన ప్రమోషన్ను గురించో, తనకు యిచ్చిన *Censure* ని గురించో, ఆవేళ ఆఫీసు కాగితాల ఖేషజంలో తాను చేసిన మహత్కార్యాన్ని గురించో, కాకపోతే తన ఆఫీసరుపై లోపాయికారీగా వచ్చిన వివరాల అన్వేషణ గురించో మాట్లాడుకుంటూ — ఒకరు లేకుండా మరొకరిపై ఏవేవో మాటలు చెప్పుతూ — బహుశా రాత్రి కూడా అవే కలలు కని, కాగితాల కట్టలే పక్కలో పెట్టుకుని నిద్రపోయి బ్రతుకంతా గడిపేసే యితరు లందరిలాగే తనూ ఎందుకు బతకలేకపోతున్నాడు.

అసలు యీ చిక్కు అంతా తను కొత్తగా కాలేజీలోంచి విడుదల కావడం వల్ల వచ్చిందనీ చాలా త్వరలో యీ అసందర్భపు, అవకతవక, అక్కరలేని ఊహాలన్నీ పూర్తిగా పోతాయనీ పూర్తిగా, ఆ కాగితాల మధ్య కూర్చొని అందులోనే సజీవ సమాధి అయిపోవడం కేవలం నిజమనీ ఒక చాలా అనుభవస్థుడు చెప్పాడు. కాని — ఆ సమయం ఎన్నటికి వస్తుందో కాని, అంత వరకూ క్షణం ఒక యుగంలా ఉంది.

రోజూ పదకొండో గంటకల్లా, ఆఫీసుకు పోవడం, సాయంకాలం-పాపం, సూర్యుడు చాలా అలసిపోయి దూరంగా కలెక్టరు బంగాళా వెనకాతల బరువుగా అస్తమిస్తూంటాడు. వంతెనక్రింద, పారుతున్న ఒకటి రెండు చిన్న పాయల్లోనూ చాకలాళ్ళు బట్టలు ఉతికి, యిసకమీద ఆరేసిఉంటారు. అప్పటికే ఎర్రబడిపోయిన సూర్యకాంతి పూర్తిగా నేలవాలుగా పడుతూంటుంది. ఆరేసిన అనేకరంగుల చీరలమీదపడ్డ ఒకే రంగు కాంతి వాటికి మరో విచిత్రమైన రంగులు యిచ్చి, కొన్నేపు అనేక రంగుల కాంతులు యిసకమీద *Focus* చేసినట్లు కనిపిస్తుంది. ఒకక్షణం పోయాకగాని తెలియదు, అవి కేవలం రంగుల చీరలనీ, యిసకమీద ఎండేశారనీ. రోడ్డుమలుపు తిరిగేసరికి చీకటి పడిపోతూంటుంది. అస్తమిస్తున్న రంగు బింబం ఎదురుగా — ఆకులన్నీ రాలిపోయినా చెట్టొకటే — నలగా, ప్రతికొమ్మా, ప్రతి వంపూ, ఎంతో స్పష్టంగా, సన్నగా ఉన్నా సిమెంటురోడ్డువేపుకి వంగి, కన్పిస్తుంది. ఏమిటో ఆ కొమ్మల్లో విశేషం. ప్రతి కొమ్మా, ఏమీ దాచుకోకుండా బయటపెట్టుకుని నిలబడ్డ చెట్టు, ఎంత నిష్కపటంగా కనపడుతుంది!

సూర్యుడు పూర్తిగా అస్తమించేసి, అలుముకుంటున్న చీకటి ఆ చెట్టుకొమ్మలంత నల్లబడిపోయి, ఆకాశం, చెట్టూ, విడదీయరానంత సన్నిహితంగా కలిసిపోయే దాకా అక్కడే నిలబడి చూడాలనుకునేవాడు...కాని తోటి గుమాస్తాలు చూడనివ్వరుగా! ఆఫీసుముందు చెట్టు, యింత కన్నా అందమయినది. అవకాశం ఉన్నప్పుడల్లా దానికేసి చూసేవాడు. అదృష్టవశాత్తూ తన కిటికీలోంచి ఎంతో బాగా కనపడుతుంది చెట్టు — అన్నిరకాల కాంతుల్లోనూ, ఎన్నో విధాల కోణాల్లో ఆ చెట్టును చూశాడు. యీ చెట్టునుకూడా అల్లా చూడాలి. ఎప్పుడో.

వాళ్ళు రోజూ అనుకునేవాళ్ళు — ఇతను పిచ్చివాడు; — కాకపోయినా అలాటివాడు — అని. లేకపోతే ఎండిపోయిన చెట్లు అందంగా ఉండటమేమిటి? చాకలివాళ్లు ఆరేసిన చీరల్లో ఏవో దృశ్యాలు ఊహించుకోవడమేమిటి? అస్తమిస్తున్న సూర్యుడి కాంతిలో అందమైన రంగులు కనిపించడమేమిటి?

యితను కేవలం పిచ్చివాడయిపోతున్నాడని రఘునాథం చెప్పాడు. ఎవరూ సాహసించి అలా చెప్పలేదు. అన్ని లౌకికవ్యవహారాల్లోనూ అతను చాలా తెలివయినవాడే — యీ చెట్లనీ, యీ సంధ్యలనీ చూస్తేనే వస్తుంది యీ పేచీ అంతా. ఆ సంగతి రఘునాథాని కేం తెలుసు? రఘునాథానికి ఒక తమ్ముడుండేవాడనీ, అతనూ యిలాగే చెట్లకొమ్మల వంపుల్నీ, చందమామ వెలుగుల్నీ — నదులమీద నురగనీ, చూసి చూసి తనకి తెలియకుండా ఓ చెట్టుకేసి చూస్తూ, కారుకిందపడి — చచ్చిపోయాడట. అతనుకూడా అల్లా అయ్యే ప్రమాదం ఉందనీ, అలాంటిపని ఎప్పుడూ చెయ్యవద్దనీ రఘునాథం అన్నాడు.

పాపం, ఆరఘునాథం చాలా మంచివాడు. తను తినే హోటల్లో సర్వరు. అతనితో రోజులో కొంత భాగం, చాలా సంతోషంగా గడుస్తుంది. నిజాన్ని చాలా దిగంబరంగా చెప్పగలడతను. అతనితో అలా మాట్లాడడం, అతనితో కలిసి సినిమాకి వెళ్ళడం, ఎందుకో నచ్చదు చాలా మందికి.

ఏం? అతనితో బెంచీ టిక్కెట్టుకి వెళ్తే తప్పా! అతని కంతకన్నా కొనే తాహతు లేదు. తనకీ లేదు! కానీ, ఒకటే తేడాట! ఆమాటా అనుభవస్థుడు చెప్పాడు. గుమాస్తా తనకి తాహతులేదని చెప్పడట — సర్వరు చెప్పేస్తాడట సర్వరు చిరిగిపోయిన

చొక్కా బహిరంగంగా తొడుక్కుంటే- గుమాస్తా, అలాంటి చొక్కాపై ఒక కోటు తొడుక్కుని కూచుంటాడట! - యీ విచిత్రజీవన వేదాంతపు పరమార్థం అతనికి బోధపడలేదు. అసలు దానికోసం అతనాట్టే ఆలోచన వృథాచేయలేదు. బెంచీ టిక్కట్టుకి వెళ్ళడం, ఆఫీసు గుమాస్తా హోదాకి తక్కువట. కాని ఏం చెయ్యాలి. డబ్బెట్టుకి 1-4-0 కి వెళ్ళలేదు. ఆఫీసు పేరు ఉపయోగించుకుని ఊరికినే పరుపుల సోఫాలమీద కూర్చోవడం అతనికింకా అలవాటు కాలేదు.

ఒక సహోద్యోగి ఓసారి తనతో తీసుకుపోయాడు. గేటు దగ్గర ఆఫీసు పేరు చెప్పి, లోపల కూర్చోపెట్టుకున్నాడు, తనపక్క. కాని ఆ మూడు గంటలూ ఏదో మహాపాపం చేసినవాడిలా *Feel* అయ్యాడు. తనవాడు మాత్రం, ఎంతో దర్పంతో, ఏదో సాధించినవాడిలా ***Pose*** పెట్టి, బయటికివస్తూ నవ్వాడు తనకేసి చూసి. అతని కేమునాలో అర్థంకాలేదు. ఏమిటీ జీవితం. ఆఫీసులో అధికారి ముందు జవానుకన్నా కనిష్టంగా తలవంచవలసిన వ్యక్తి, మరోచోట, యింత దర్జాగా ప్రవర్తించడానికి ఎంత మార్పు కావాలి! వీళ్లు ఎంత గొప్పవాళ్ళు?(!) ఎప్పటి కప్పుడే మరచిపోగలరు. క్షణం క్షణం మరో జన్మ ఎత్తినంత పని చెయ్యగలరు.

మరి తనో- ఓరోజున ఆ అధికారి అన్న మాటలకు మతి పూర్తిగా చెడిపోయినంత పని అయి- అస్థిపంజరం వణికి, జీవితమంతా శిథిలమైపోయినంత యాతనపడి - ఒకడిచేత మాట అనిపించుకున్నానే అని, మొహం, మనస్సూ ఎఱ్ఱబారిపోయి, తనలో కొన్ని వేల భూకంపాలు జరిగిపోయి, కొన్ని రోజులదాకా, ఆ మాటే మళ్ళీమళ్ళీ స్ఫురణకి వచ్చి, యింకే పని చెయ్యబోయినా, ఎవరితో మాట్లాడబోయినా, అదే సంఘటన జ్ఞాపకానికి వచ్చి, ఎంత కుమిలిపోయాడు! చివరికి యింటికి వచ్చి ఎవరూ చూడకుండా ఎక్కెక్కి ఏడిచాడు; ఆ బాధోపశమనానికి. ఎంతోమంది ఆంతరంగిక మిత్రులకి ఉత్తరాలు రాశాడు ఆ విషయం వెళ్లబోసుకుంటూ. మనిషై పుట్టించినందుకు, మనస్సు తన కిచ్చినందుకు దేవుడిమీద ఎంత కోపం వచ్చింది. మళ్ళా నేటికీ ఆ విషయం గుర్తుకి వచ్చి తనలో తనకే నమ్మకంపోయి కృంగిపోతూంటాడు. అలాంటిది తన స్నేహితుడెంత గట్టిమనిషి. బహుశా బతకగల మనిషి లక్షణం యిదే కాబోలు.

సినిమా అయిపోయిన తరువాత యిద్దరూ బయటికి వచ్చేస్తున్నారు. దారిలో ప్రొప్ర



"ఇది ఎండిపోయిందని ఎవరు చెప్పారు? వసంతంరానీ, మళ్లా హాయిగా చిగురిస్తుంది."

యిటరు అడిగారు "ఏమండీ, ఏమయిందండీ మా పని" అని. "అయిపోయిందండీ - తరవాత మాట్లాడతాగా" అన్నాడు నా ప్రక్కాయన. ప్రొప్రయిటరు ఊరుకున్నాడు. కొంచెందూరం పోనిచ్చి తన ప్రక్కవాడన్నాడు గదా—"వాళ్ళకి బోలెడు పనులు మనతో ఉంటాయి. ఆమాత్రం గౌరవం యివ్వద్దూ" అని. తనకెందుకో జీర్ణం కాలేదు ఆ మాటల్లో భావం. ఆఫీసులో ఏ అధికారీ తన కిందవాడిని మనిషిలా చూడడు. అదే సమయంలో తనకన్నా పైవాడికి మాత్రం 'అడియేన్ దాసోహ' మంటాడు చేతులు నలుపుతూ. యీ మనిషి తన అధికారిచేత మనిషిలా చూడబడటం లేదు. అలాంటప్పుడు దూరంగా ఉన్న ఎవరో తనకు చూపించిన

చెట్టు

‘అవసరార్థపు’ గౌరవాన్ని; చూసుకుని తనో ఆరంగుళాల పొడుగు ఎదిగినట్లు ఆయన ఎందుకు భావించుకుంటున్నాడో బోధపడడంలేదు. ఆఫీసులో తన కివ్వబడే స్థానం ఆ సమయంలో మరచిపోగలడు ఆయన. అవును, లేకపోతే తన లాగా ప్రతిదానికీ వాళ్ళూ మగ్గిపోతే యీపాటికి పిచ్చివాళ్లయిపోదురు. కొంపదీసి తనకీ పిచ్చెక్కదు గద.

యింటికొస్తున్నాడు...దారిలో ఆకులు రాలిపోయిన చెట్టు నవ్వుతూ పలకరించింది. యీ కోణంలోంచి చూస్తే మరో రకంగా కనపడుతుంది ఆ చెట్టు - దానిపక్కనే వెలిగే చిన్న దీపపుకాంతి కొన్ని కొమ్మల మీద ఒకప్రక్క పడి, బంగారపు చెట్టులా కనపడుతోంది. దానికేసే చూస్తూ నడుస్తాడు. అల్లా నిలబడిపోయి చూడ్డం యీ మధ్య బలవంతాన మానుకోవలసివస్తోంది. అందరూ నవ్వుతారు. దానికి ఎదురుగా ఉన్న యింటిగోడ నీడలో ఎవరికీ కనపడకుండా నిలబడి ఆ చెట్టుకేసి చూడాలని ఎన్నాళ్ళనించో సంకల్పం. ఏదీ తీరిక ఉంటేగా! ఎప్పుడూ ఆఫీసే. ఎప్పుడూ కాగితాలే. పోనీ, దేవుడి ధర్మమా అని ఆ చెట్టు రోడ్డు పక్కనే ఉంది. దానికోసం పని కట్టుకుపోవాల్సినంత దూరంలో ఉండకుండా.

ఆ మర్నాడూ, ఆఫీసుకు పోయాడు. దారిలో చెట్టు ఎందుకో తల వంచుకున్నట్టుంది.

కారుల దుమ్ము ఆ చెట్టుచుట్టూ పట్టి దానిని సరిగా కనపడనీయడంలేదు. ఆఫీసు టైము అయిపోతోంది. గబగబా నడిచాడు. ఆఫీసుకి వచ్చేశాడు. టైము పదకొండయింది సరిగ్గా. ఆఫీసుముందు చెట్టుచుట్టూ ఎవరో పదిమంది మనుషు లున్నారు. వాళ్ళేదో కొల్చుకుంటున్నారు. ఏమిటో అతని కర్థం కాలేదు. ఆలోచించడానికి వ్యవధి లేదు. గబగబా మేడమీదికిపోయి సంతకం పెట్టాడు. అక్కడినుంచి చూస్తే చెట్టుకొమ్మలు ఎంత దర్జాగా ఉంటాయి. ప్రతి కొమ్మ చివరా ఎన్ని చిన్న పలవలు! వాటిలో ఎన్ని వంపులు? ఎన్ని మలుపులు? వాటి ప్రతి అంగుళం అతి జాగ్రత్తగా తయారుచేశారు- ఎవరో అజ్ఞాతశిల్పి. ఒక పక్కనుంచి వెలుగు పడుతూంటే వెండిలాగా మెరిసిపోతోంది చెట్టు. కొమ్మలు గాలికి ఊగి నవ్వుకుంటున్నాయి; ఒకటెని చూచి మరొకటి. ఎన్నోసార్లు అనిపించింది- ఆ చెట్టు బొమ్మ వేసుకోవాలని. కాని అమ్మో - ఆఫీసులో ఎవరేనా చూస్తే ప్రమాదమట. ఆ అనుభవజ్ఞుడు చెప్పాడు. ఏం ప్రమాదమో, ఎందుకు ప్రమాదమో అడుగుదా మనుకున్నాడు గాని అడగలేదు. అయినా యిప్పుడు వేసుకుంటే బాగుణ్ణు. యీవేళ వాళ్ల *Section Head* శెలవు అందుకని కొంచం తీరికగా చెయ్యవచ్చుపని.

“ఏమిటోయ్! తదేకంగా ఆలోచిస్తున్నావ్” - అదిరిపడి చూచాడు ఆగొంతుక విని. శర్మ- నవ్వుతూ వెనకాల నిలబడ్డాడు. అప్రయత్నంగా - అన్నాడు. ‘చెట్టు’ అని...“ఆ! చెట్టు...అమ్మేశాం, కొట్టుకోడానికి వచ్చారు వాళ్లంతా.” అన్నాడు శర్మ. వళ్లు జలదరించింది అతనికి. “ఏం అంత అందమయిన చెటు కొట్టెయ్యడ మేమిటి? అక్కడుంటే ఏం ప్రమాదం,” అన్నాడు అతను. “ప్రమాదం కాదయ్యా, యిది ప్రభుత్వం వారి వన మహోత్సవంలో ఒక భాగం.” అన్నాడు రాజగోపాలం. యీవిట్కి నవ్వడానికి తగిన స్థితిలో లేడు అతను.

“ఎందుకు కొట్టించడం? - అక్కడున్న అమాయికపు అందమయిన చెట్టును?” శర్మకి నవ్వొచ్చింది.

“ఏమిటే కవిత్వం, ఆఫీసుకు ఎదురుగుండా ఎండిపోయిన చెట్టు అందమయినదంటా వేమిటి? నువ్వు ప్రస్తుతం ఏ లోకంలో ఉన్నావు? ఇది పగలా రాత్రా?- యిదిగో యిటు చూడు - యీ చేతికి ఎన్ని వేళ్ళున్నాయి?” ఉక్కిరి బిక్కిరయ్యేలా ప్రశ్నలు కురిపించాడు శర్మ. “పిచ్చివాడా యింకెక్కడా యిలా మాట్లాడకు. ఆఫీసు ముందు ఆ భాగంలో *Record Room* కట్టాలి. అక్కడ యీ చెట్టుండడం అడ్డం కాదూ. అంచేత కొట్టెయ్యక తప్పలేదు. పైగా ఎండిపోయిన చెట్టయ్యె. దానివల్ల నీడలేదు. యింక ఏమిటి ప్రయోజనం. అమ్మేస్తే, కొట్టుకున్నవాళ్ళు స్వంత ఖర్చుమీద కొట్టుకుని తోలుకుపోతారు. అని నోట్ పెట్టాను. తత్ఫలితంగా నిన్న ఆదివారం వేలంలో అమ్మేశాం. యీవేళ కొట్టుకుపోతారు. చవగ్గానే పోయిందిలే. పాతికరూపాయీలు. దీనికోసం అందమయిన చెట్టనీ, అమాయకపు చెట్టనీ - అంటావేమిటి - యీ ఎండుమోడుని?

“నీకూ, ఆ ఆర్డరు వేసినవాళ్లకీ మతిలేదు. యిది ఎండిపోయిందని ఎవరు చెప్పారు? ఆకులు రాల్చేసింది. వసంతం రానీ, మళ్లా హాయిగా చిగురిస్తుంది. గుబురుగా పెరుగుతుంది. చక్కగా నవ్వుతుంది. గాలికి నాట్యంచేస్తుంది. అందాన్ని దారుణంగా హత్యచేస్తున్నారు.

అతని కళ్ళంబట నీళ్లు వచ్చేస్తున్నాయి. యింకే చెట్టును చూసి కదలకుండా నిలబడిపోవడం? రోడ్డుపక్క చెట్టును చూస్తూ నిలబడితే జనం ఊరుకోరు. అదిమాత్రం యిలాగే కొట్టేయ్యరని నమ్మక మేమిటి? దానిపక్క యింకా చాలా చెట్లుండేవిట. యిళ్లు కట్టుకు నేప్పుడు కొట్టేశారట. యిదొక్కటే మిగిలిందిట. పాపం ఎంత కాలంనుంచీ యీ చెట్టు యిలా ఓపిగ్గా నిలబడి ఉందో. ఎన్ని వందల రకాల జనాన్ని చూసిందో. తనముందు ఆఫీసు కడుతూంటే అమాయికపు చెట్టు ఎంత సంతోషించిందో. ఎన్ని రకాల ఉదయా స్తమయాలు కళ్లారా చూసిందో; తదేకంగా. పాపం ఎన్నిసార్లు సూర్యచంద్ర కాంతుల్లో కరగిపోయిందో. ఎంతమంది అధికార్లని చూసిందో. యీ వేళతో దీనిదీర్ఘ జీవితం సరి...యింకే చెట్టు దాక్కున్న అందాలు వెతుక్కోవాలితను? దీని స్థానంలో కొద్ది రోజుల్లో నిర్జీవమైన రాతిభవనం నిలబడుతుంది. యిది ఎండిపోయిందని అనడం కేవలం ఒక కారణం మాత్రమే. ఏం ఆ భవనం యింకోచోట కట్టకూడదూ. అందం దారుణంగా హత్య చేయబడుతోంది.

(56 వ పేజీ చూడండి)

“ఒరే! అస్తమానం కళ్లు మూసుకుని అద్దం ముందు నిలుచుంటా వేంరా?”

“ఆఁ! ఏం లేదు! నిద్ర పోతున్న పోజులో నేను ఎల్లా వుంటానోనని!”

—శ్రీ మండలీక విశ్వేశ్వరరావు, మద్రాసు.

★ కాళరాత్రి ★

(19-వ పేజీ తరువాయి)

(జేబులో వేసుకుంటాడు తాళం చెవి)

నే వెళ్తున్నానిహ. పడమటిల్లు తలుపు తెరుస్తాడు)

సుకు: (ఏదో తట్టినట్టై కేక పెడ్తాడు) అమ్మ బాబోయ్!

రామా: (ఉలిక్కిపడి వెనక్కి తిరిగి) ఆపవయ్యా వెట్టికేకలు...ఏం వొచ్చింది మళ్ళీ?

సుకు: అది - రేడియో - పెట్టింది నారాయణ!...చచ్చి దయ్యమై వొచ్చి నట్టున్నాడు...అవును—(సోఫాలో కూల బడతాడు)

[రామానుజం పెదవులు తడుపుకుంటూ గది తలుపుల వంక చూస్తాడు]

నర: మతి లేకుండా మాట్లాడకండి.

రామా: (పడమటింటి తలుపుమూసేసి) పోనీ ఆగదిలోంచే పోతాను. ఎందుకైనా మంచిది. (భోజనాలగది కేసి వెళ్తాడు)

సుకు: ఇదుగో రామానుజంగారూ! నన్నుకూడా రానియ్యండి మీకొక్క పుణ్యం వుంటుంది. (అతని చెయ్యిపట్టుకు పోతూ,) అమ్మయ్య! మీరు పక్కన వుంటే కొండంత ధైర్యం నాకు.

[ఇద్దరూ భోజనాల గదిలోకి వెళ్ళి పోతారు. గదిలో నరహరి ఒక్కడే మిగులు తాడు. తుఫాను కొస్త శాంతించినట్లుంది గాని గాలి ఇంకా విసురుతూన్న శబ్దం విని పిస్తూంటుంది. మెట్లమీద గదికేసి ఓసారి చూస్తాడు. పడమటింటి వాకిలిదాకా పోయి తలుపు తెరవబోయి మళ్ళీ మనసు మార్చు కుని లైట్ ఆర్పివేసి భోజనాల గదిలోంచి వెళ్తాడు. గది ఇప్పుడు పూర్తిగా చీకటిగా వుంది.

ఒక్క క్షణం అవకాశంతో పడమటింటి తలుపు తెరుచుకుని అసహజమైన కాంతిలో తేలియాడుతూ ఒక ముఖం వస్తుంది. ఆ ముఖం సిగరెట్టు ముట్టించి సోఫాలో కూర్చోబోతూండగా బైట వరండాలో కొస్త చప్పుడవుతుంది. చేతిలో సిగరెట్ ఆర్పి పారేసి మళ్ళీ పడమటింటి లోపలికి వెళ్ళిపోతుందా ముఖం.

వరండా తలుపు తెరుచుకుని నళిని వచ్చి లైట్లు వేస్తుంది. చేతిలో తాళం చేతుల గుత్తి వుంటుంది. గబగబా మెట్లెక్కి వెళ్లి గది తలుపు తట్టుతుంది.]

రాజా: (లోపలనించి) ఎవరది?

నళిని: నేను - నళినిని.

రాజా: తలుపు బైట తాళం వేశారు నళినీ.

నళిని: అవును - వెంకన్న చెప్పాడు... మరేం ఫరవాలేదు. నాదగ్గర మరో తాళం చెవి వుంది. (తాళం తీస్తుంది).

రాజా: (బైటికొచ్చి) థాంక్స్ నళినీ! ఖర్మంజాలక నువ్వెప్పుడన్నా జెయిల్లో పడితే నీ వుపకారం మర్చిపోన్లే...రా - కిందికి పోదాం.

[గబగబా మెట్లు దిగుతాడు. నళిని అతని వైపే పరిశీలనగా చూస్తూ వస్తుంది.]

నళిని: ఏంపని చేశావ్ రాజా?

రాజా: (నవ్వుతూ) ఏం? అంత చెయ్య రాని పని అంటావా?

నళిని: ఓహ్ - ఎలా చెయ్యగలిగావ్ రాజా?

రాజా: (ఆమెను సమీపించి అర్ధ దృక్కులతో ఆమె ముఖంలోకి చూస్తూ) సరే - నిన్నుకూడా బాధపెట్టడం ఎందుకులే నళినీ. అసలు సంగతి చెప్తున్నా విను- అదంతా వుత్త తమాషా!

నళిని: తమాషా?

రాజా: అవును. అంతా నాటకం! ఆ మాత్రం అర్థం కాలేదా నీకు? అసలు పిస్టలు ఎలా పట్టుకోవాలో కూడా ఎఱగనని తెలీదూ చాలాసార్లు 'ఎందుకా పిస్టలు - అమ్మేస్తావంటే—'నాన్నగారిది. అట్టే పెట్టు'మన్నావు కూడానూ.

నళిని: నాటకం! ఓహ్ - (నిట్టూర్పు విడిచి, అంతలోనే పకపకా నవ్వుతూ, సోఫాలో కూలబడుతుంది. అకస్మాత్తుగా నవ్వు ఆపి కళ్లు ఒత్తుకుంటుంది.)

అయినా ఇంత దారుణమా? ఇంటికి పిలిచి వాళ్లనింత గగ్గోలెత్తించడానికి ఎలా మనసొప్పింది నీకు?

రాజా: నాన్సెన్స్. మరేం ఫరవాలేదు లెద్దూ. వచ్చినదగ్గర్నుంచీ ఒక టేగోల హత్య లనీ హంతకులనీనూ. నేనూ కాస రుచి చూపిద్దామనుకున్నాను.

నళి: ప్చ్—వాళ్లంతా హడిలిపోయి పోలీసులకి కబురు చెయ్యాలనీ నిన్ను విచారించి ఉరి తియ్యాలనీ ఆలోచిస్తున్నారు తెలుసా?

రాజా: అలాగా. అసలు వాళ్లు ఇంత తేలిగ్గా నమ్ముతారనుకోలేదు నళినీ. ఎంత వెలంవెర్రిగా వున్నారనుకున్నావ్!... కానీ....ఆ రామానుజం వున్నాడే-అరె— హడిలి చచ్చిపోయాలే! తను రాసిన పుస్తకాల్లో సంగతులన్నీ ప్రాణంపోసుకు వచ్చి నయ్యనుకున్నాడు పాపం!...ఏం నళినీ! వాడి పుస్తకాలు బాగున్నయ్యా—నా స్టంటు బాగుందా?

నళి: మరి నదిలో కొట్టుకుపోయిన శవం ఏమిటి మరి? రామానుజమూ నరహరీ కూడా కళ్ళారా చూశామన్నారు?

రాజా: (నవ్వుతాడు) అదా?...... నాలుగు దిళ్ళూ ఓ చొక్కా లాగూనూ! మిగతా పనంతా వాళ్ల ఊహే చేసింది!...

నళి: ఘోరం! సరే నే వెళ్తాను.

రాజా: నళినీ!...నళినీ!- వెళ్లకు-ప్లీజ్-

[నళిని ఆగి వెనక్కి తిరిగి అతని కళ్ళ లోకి చూస్తుంది. అకస్మాత్తుగా వచ్చిన ఏదో ఆవేశంవల్ల ఒక్క క్షణం మాట్లాడలేక పోతాడు రాజారావు......కొస్త ముందు కొచ్చి—] నళినీ!...నే నింతవరకూ అవగాహన చేసుకోలేదు నళినీ!...ఇన్నాళ్లయినా కూడా! నే చేసిన పనికి నిజంగా అంత బాధపడుతున్నావా?

నళి: (ఒక్క క్షణం ఆగి) అబ్బే! లేదు. వస్తాను. (నళిని త్వరత్వరగా వరండాలోకి వెళ్లిపోతుంది.)

నారా: హంతకుడా!

రాజా: నువ్వా? నారాయణా! (గడ్డం కింద టార్చిలైటు వెలిగించి పట్టుకున్న నారాయణను చూసి కుదుటపడతాడు.) ఇదోటా వాళ్లని హడలగొట్టి చంపడానికి. చచ్చి దయ్యమై మమ్మల్ని పీక్కు తింటానికూడా వచ్చావా? (నవ్వుతాడు)

నారా: మొత్తంమీద నాటకం బలేగా నడిపినట్టున్నావ్! వాళ్ల ఏడుపులూ పెడబొబ్బలూ అంతా వింటూనే వున్నాలే!

రాజా: వాళ్ల ప్రాణాలెక్కడ తీస్తానో అని నన్నో గదిలో పెట్టి తాళం కూడా వేస్తే!

నారా: మరివతలి కెలా వచ్చావ్?

రాజా: నళిని వచ్చి తాళం తీసింది. (చిర్నవ్వుతో) కాని వాళ్లుమటుకు నిజంగా చాలా హడావుడి పడ్డారు పాపం. గోల గోల!

నారా: ఇవతలకొచ్చి చూద్దామని మహ అనిపించింది గాని నాకు - వస్తే ఎక్కడ చూస్తారోనని అక్కడే గంపలో కూర్చుండిపోయాను. అప్పటికీ ఎలానో సందు జేసుకొచ్చి రేడియో పెట్టాను.

రాజా: ఆ పాటా గీటా విని నేనూ ఆశ్చర్యపోయాను ముందు. అంతా ఇక్కడ జేరి పెద్ద మీటింగు పెట్టారట! నన్ను ఉరి కంబం ఎక్కించి గాని నిద్రపోయేట్టు లేరట కూడానూ!

నారా: అంహాం—!

రాజా: అది సరేగాని—ఈ హంతకులంటేనూ ఈ ఎక్సైట్మెంటూ అదీ ఇప్పుడర్థం అవుతోందిరా! జీవితంలో

★ కాళరాత్రి ★

ఎన్నడూకూడా ఇంత గొప్పగా ఫీలవలేదు నేను. అసలు నిన్ను నిజంగానే చంపేస్తే బాగుండేదేమో!

నారా: అవునవును. ఇక్కడేం జరిగినా జరగొచ్చు.

రాజా: (ఉలిక్కిపడి కీడుశంకించి) అదేమిటి - అలా ఎందుకన్నావ్?

నారా: ఏం? నువ్వే అన్నావుగా—

రాజా: (తడబడి) అవునవును.

నారా: (ఆసామాషీగా) నా అకాల మరణానికి ఎవరన్నా ఏడిచార్రా?

రాజా: ఆహా. అందుకు మటుకు నేను చాలా బాధపడ్డా.

నారా: ఎవరు?

రాజా: కమల.

నారా: కమల ఒక్కతేనా?

రాజా: ఇందులో నే జోక్యం కలగజేసుకోరాదనుకో—అయినా నా సలహా కాస్తపాటించు. ఇకముందైనా నువ్వు కాస్త జాగ్రత్తగా మసులుకోవడం మంచిది.

నారా: జాగ్రత్తగా వుంటం ఎప్పుడూ మంచిదేననుకో. కాని ఎందుకలా ప్రత్యేకంగా చెప్తున్నావు?

రాజా: నరహరి కొంచెం ముక్కోపి అనుకుంటాను." ఆఁ—(జేబులోంచి రివాల్వరుతీసి) ఇహ నిది దాచేస్తాను. దీని అవసరం అయిపోయిందిగా (డ్రాయరు లాగి చూచి) అరె! దీనికి తాళం వేసివుండే! (రివాల్వరు డ్రాయరుమీదవుంచి తాళంచెవి కోసం చూసి) తాళంచెవికూడా కనిపించదు. చిత్రంగానే వుంది!

నారా: (ఎగిరి పడిలేచి) ఇష్—

రాజా: ఏమిటది?

నారా: (రహస్యంగా) ఎవరో భోజనాల గది లోకివచ్చినట్టున్నారు.

(ఆగదితలుపు గడియవేసివచ్చి)

వరండాతలుపుకూడా వేసిరా.

రాజా: ఎందుకూ?

నారా: ఎవరన్నా లోపలికొచ్చి చూస్తే?

రాజా: చూస్తేయేం?

నారా: ఇప్పుడిప్పుడే వాళ్లకి తెలీరాదు నే బ్రతికున్న సంగతి. ఏం?

రాజా: (నిట్టూర్చి వరండాతలుపు గడియవేసి) వద్దు నారాయణా. వాళ్లందర్నీ పిలిచి అసలు సంగతి చెప్పేద్దాం.

నారా: చెప్పేసి ఇంతా కష్టపడి ఇంతవరకూ లాక్కొచ్చిన నాటకం అంతా నాశనం చేద్దామంటావా?... అదేం కుదరదుగాని, నీ కెందుకు నువ్వు నిశ్చింతగా నిద్రపో. తెల్లారి కాఫీలదగ్గర కాస్త గాబరా పెడతాను. అంతే?

రాజా: (అయిష్టంగానే) సరే నీయిష్టం ...నువ్వుకూడా పోయి పడుకోరాదూ?

నారా: పడుకుంటాలే. కాస్సేపేమన్నా చదువుకుని తర్వాత పడుకుంటాను.

రాజా: ఓ యస్. రామానుజంగారి డిటెక్టివ్ నవలల్లో ఏది తీసుకున్నా సరే ఇట్టే నిద్ర వచ్చేస్తుంది.

[రాజా మెట్లెక్కి తన పడక గదిలోకి వెళ్తాడు.

నారాయణ సోఫాలో కూర్చుని సిగరెట్ వెలిగిస్తాడు, భోజనాల గది తలుపు తెరవడానికేదో ప్రయత్నం జరుగుతున్న చప్పుడవుతుంది. ఒక క్షణం ఆగి తలుపు తట్టిన శబ్దం.

నారాయణ సిగరెట్ ఆర్పి జేబులో టార్చి తీస్తాడు. గదిలో లైట్లు ఆర్పుతాడు. వెలిగించిన టార్చి గడ్డంకింద పెట్టుకుంటాడు. ఇందాక ఆ అభౌతికమైన కాంతిలో తేలియాడిపోయిన ముఖం ఇదే!...గడియ తీసి కాస్త వెనక్కివచ్చి నిలబడతాడు.

తలుపు మెల్లిగా తెరుచుకుని గుమ్మంలో ఓ మనిషి స్వరూపం కనిపిస్తుంది. ఆ మనిషి నారాయణ ఆకారంవంక కాస్సేపు తీవ్రంగా చూసి తర్వాత మాట్లాడుతాడు. కంఠస్వరాన్ని బట్టి నరహరి!]

నర: హలో! నారాయణా!

[అని స్విచ్ చేస్తాడు. నారాయణ తన ట్రిక్కుపని చెయ్యనందుకు కాస్త చిన్నబోయి టార్చి ఆర్పుతాడు.]

నారా: ఏం, నరహరీ!

నర: (తలుపేసి ముందుకొస్తూ సాలోచనగా సన్నగా నవ్వుతాడు. నాకు దయ్యాలంటే ఎప్పుడూ నమ్మకం లేదులే!

నారా: అలాగా!

నర. (నిశ్శబ్దంగా నవ్వుతూ) మొత్తం మీద బలే ట్రిక్కు! అసలెందుకు చేశారలా?

నారా: ఏముందీ-కాస్త వినోదంకోసం మీ కందరికీ కాస్త హడలుపుట్టిద్దామనీనూ.

[నరహరి మెత్తగా నవ్వుతాడు. నారాయణకూడా ఇకిలించి సోఫాలో కూర్చుంటాడు.]

నర: రాజారావేడీ?

నారా: వాడిగదిలో వున్నాడు.

నర: ఐతే ఇక తాళంతీసి ఇవతలకు రానియ్యొచ్చన్నమాట!

నారా: ఈపాటికి నిద్రపోయివుంటాడులే! ఐనా తలుపు తాళంవేసిలేదు.

నర: (గబుక్కున అతనివైపుతిరిగి) తలుపెవరుతీశారు? తాళంచెవి రామానుజం దగ్గరుండాలిగా.

నారా: నళినివచ్చితీసింది. మరోతాళంచెవి వున్నట్టుంది.

నర: ఓ—(అలాగా. బలే తెలివిగలది ...ఏమన్నది నిన్ను చూసి?

నారా: (గొప్పగా) నే కనిపించలేదుగా ఆ అమ్మాయికి!

నర: అంటే (ఆలోచనాపూర్వకంగా) —నీ హత్య వుత్తనాటకంమాత్రమే అని తెలిసింది నా కొక్కడికేనా?

నారా: ఇంతవరకూ నీ కొక్కడికే! తెల్లారి కాఫీలదగ్గర అందరికీ చెప్పేద్దామనుకున్నాం.

నర: బలే! చచ్చిపోయిన నువ్వు అనుకోకుండా బ్రతికొచ్చి అందరినీ హడలగొడతావన్నమాట.

నారా: మీరంతా ఎగిరిపడి పట్టుకుతిడతారని రాజారావన్నాడు గాని పాపం.

నర: (గంభీరంగా) దానికి లక్షకారణాలుండవచ్చు.

నారా: (కాస్తగాబరతో) అంటే?

నర: మమ్మల్నందర్నీ వెధవల్ని చేసిన మీ తెలివితేటలు...ఆగి నదిలో కొట్టుకుపోతున్న శవం?—

[టేబిలుమీద రివాల్వరు కళ్లబడుతుంది. నరహరి ముఖకవళిక మారిపోతుంది. ఒక క్షణం నిశ్శబ్దం. తిరిగి నారాయణ ముఖంలోకి చూస్తూ—]

అది వుత్తిదేమో అనుకుంటాను?

నారా: (తేరుకుని నవ్వుతూ) అవును. హడావుడిగా లాగూ చొక్కా తెచ్చి నాలుగుదిళ్లు ఇరికించి నదిలోకి తోసేశాం.

నర: బలే! నేనూ రామానుజమూ అది నిజంగా నీ శవమే ననుకున్నాం.

[కాస్త ఆగి తనలోతాను చిరునవ్వు నవ్వుకుంటూ—]

నిజానికి రామానుజం ఇంకా ఆ నమ్మకంలోనే వున్నాడు. ఎందుకూ—కోర్టులో బోనెక్కి నీ శవాన్నే చూశానని ప్రమాణం చెయ్యమన్నా చేస్తాడు.

[తల ఆడిస్తూ తన ఆలోచనకు తనకే నవ్వొస్తున్నట్టు—]

దానికితోడు రాజారావు తనే చేతులారా నిన్ను హత్యచేశానని అందరి ఎదటా ఇచ్చిన వాజ్మూలం! మా మటుకు మేం నమ్మేశాం...కోర్టులో జడ్జీకూడా నమ్మితీరేవాడనుకుంటాను...ఏమంటావ్?

నారా: (భయపడ్డాడుమనిషి) అదంతా

ఓ బుద్ధిలేనిపని అని ఇప్పుడర్థం అవుతోంది.

నర : అహం అలా అనకుమరి నిజంగా తెలివిగలపని! చాలా తెలివితేటల్తో పన్నిన పన్నాగం. ఎక్కడా కొస్తలోపంకూడా లేదు.

[లేచి ట్రేలో సిగరెట్ పారేసి రివాల్వరు తీసుకుంటాడు.]

అరె-ఇదికూడా ఇక్కడే వుందే! దీంతో నేనగదూ రాజారావు నిన్ను హత్య చేశాడని మేమంతా అనుకున్నది?...ఇందులో తోటాలైనా నిజమైనవేనా?... ఇది రాజారావు స్వంత రివాల్వరు కదూ?

[నారాయణ సోఫాలో నిటారుగా కూర్చుంటాడు]

అవును!...కదూ! ఏ జడ్జియినా రాజారావు నిన్ను తన స్వంత రివాల్వరుతో షూట్ చేసి చంపేసని నమ్మితీర్తాడు కదూ!

[రివాల్వరువంక ఏదో ఆలోచనతో చూస్తూ—]

నీ కివ్వాళ ఏదైనా ప్రమాదం సంభవిస్తుందనుకో—

[నారాయణ సోఫాలోంచి లేవబోతాడు]

వొద్దు—కూర్చో—

[రివాల్వరు అతనివైపు తిప్పి నిర్లక్ష్యంగా అతన్నే గురిచేసివుంచుతాడు. నారాయణ లేచే ప్రయత్నం విరమించుకుంటాడు]

నే చెప్పబోయేదాంట్లో నువ్వు అర్థం చేసుకోవాల్సింది చాలా వుంది... ఈ తమాషాసంగతి మన మిగతా మిత్రులందరికీ తెలీకముందే... ఈ రాత్రే నీకేదైనా ప్రమాదం సంభవిస్తుందనుకో ...అప్పుడు రాజారావు పరిస్థితి చాలా అధ్వాన్నంగా వుంటుంది...కదూ?...

నారా : (నవ్వలేక తెచ్చిపెట్టుకు నవ్వుతూ) మేం మిమ్మల్ని హడలగొట్టినందుకు నన్నుకూడా భయపెడ్తున్నావా?

నర : (చాలామృదువుగా) అబ్బే—నే చెప్పేదేమిటంటే... చిన్నతమాషా ఎంతి ఘోరమైన పరిస్థితులకైనా దారితీస్తుందీ అని!...ఎందాకో యెందుకూ...ఇప్పుడు చూడుమరి—అన్నెంపున్నెం ఎరగని రాజారావు...తాను కలలోనైనా చేసి ఎరగని నేరానికి... ఉరిశిక్ష అనుభవించాల్సి రావచ్చు...చూడు పాపం...

నారా: (లేచిమామూలుగా మాట్లాడటానికి విశ్వప్రయత్నం చేస్తూ) వాళ్లందరితో కూడా ఇప్పుడే చెప్పేస్తాను—మేం చేసిందంతా వుత్తినాటకమని—

నర. (తనూలేస్తూ) వద్దు—అప్పుడేవద్దు ఇంకావ్యవహారం పూర్తికాందే!—

[ఒకరి ముఖాలొకరు చూచుకుంటారు. ఇద్దరిమధ్యా రెండు గజాలు ఎడం.]

నారా : ఇదుగో-అది నావైపు పెట్టకు... తీసేద్దూ నీకు పుణ్యంవుంటుంది—

[నరహరికళ్లల్లో మృత్యువుని చూస్తాడు. ఓ అడుగు ముందుకు వేస్తూ—]

నారా : వొద్దు—వొద్దు-ఆగు నరహరీ! వొట్టు—దేవుడిమీద ప్రమాణంచేసిచెప్తాను కమలకీ నాకూ ఏవిధమైన—

[నరహరి రివాల్వరు పేలుస్తాడు. నారాయణ విరుచుకుని సోఫాలోపడిపోయి క్రిందికి దొర్లుతాడు.]

నరహరి అతనివంకే చూస్తూ చేతిగుడ్డతో రివాల్వరు శుభ్రంగా తుడిచి బల్లమీదపెట్టి, పడమటింటి తలుపులు గడియవేసి, వరండా తలుపుగడియచూసి లైటుఆర్పి వేస్తాడు. గది అంతా చిమ్మచీకటి. ఒక్క క్షణంతర్వాత. అతను తెరిచిన భోజనాల గదితలుపులమధ్య నుంచి వెలుతురు చారఒకటి ప్రసరిస్తుంది. నరహరి ఆ ద్వారంలోంచి వెళ్లిపోయి తలుపువెయ్యాంగానే గది అంతా మళ్లీ చిమ్మచీకటి. వెంటనే రాజారావు తన గదితలుపు తెరుచుకుని బాల్కనీమీదకు వస్తాడు—]

రాజా : నారాయణా- నారాయణా—

[అనిమెట్లుదిగుతూండగా దూరాన్నుంచి ఉరుములు గర్జిస్తూ వినిపిస్తాయి.]

[తెర]

[ఇంకా వుంది.]



విజ్ఞానవీధులు

"డాక్టర్"



140. అయితే, మనప్రాచీనుల విజ్ఞానపరిశోధన ఏ అంతస్థులోదీ ?

పాశ్చాత్యుల విజ్ఞానమే గొప్పదయితే, మన ప్రాచీనుల విజ్ఞానపరిశోధన ఎంతవరకూ వచ్చిందంటారూ? అని నలుగురైదుగురు అడుగుతూన్నారు. విజ్ఞాన పరిశోధనకి అంతస్థులు ఐదు. మొదటి అంతస్థు అవలోకనము, అంటే చూచి తెలుసుకోడము. బుధగ్రహాన్ని మన ప్రాచీనులు కూడా చూచి తెలుసుకున్నారు. అరుంధతీవశిష్టులు మామూలు కంటికి గోచరించగల ఒక్కగానొక్క నక్షత్రజంట. తక్కిన జంటలు దూరదర్శనీ సాధనముతో చూస్తేగాని కనపడవు. ఆ జంటని మన ప్రాచీనులు చూచి గుర్తించుకున్నారు. పేర్లు నిర్దుష్టముగా పెట్టకపోయినా, సూర్యరశ్మిలో చాలా రంగు లున్నాయని గుర్తించారు. ఆయా వేళ్లూ, బెరడూ, ఆకూ, విత్తనాలూలో ఔషధగుణాలున్నాయని అనుభవముతో చూచి నేర్చుకున్నారు. మనదేశాన్ని చుట్టివున్న సముద్రములో యవద్వీపమూ, లంకా, వంటి దీవులున్నాయని చూచారు. విషాల్ని గుర్తించారు. సూదంటురాయి ఇనపముక్కల్ని లాగడమూ, ఉన్నితో రుద్దిన లక్కముక్క తృణాల్ని ఆకర్షించడమూ చూచారు. రెండువస్తువుల్ని పాకము పట్టితే మూడోవస్తువు తయారౌతుందని గుర్తించి, లోహాల్ని, శిలల్ని భస్మములు చెయ్యడము యత్నించి చూచి నేర్చారు.

అయితే అవలోకనమువల్ల నేర్చిన సంగతుల్ని చేర్చి చూచి, ఆలోచించి, ఒక వాదము లేవనెత్తడము అవలోకనానికి పై అంతస్థు. ఈవాదము అవలోకించి తెలుసుకున్న విషయాలపైననే ఆధారపడాలిగాని, జాతియొక్క నమ్మకాలపైన ఆధారపడకూడదు. ఈ పనిలో మాత్రము మనవారు వెనకపడ్డారు. వైశేషికదర్శనము అంతటా ఎరగని కారణాల్ని 'అదృష్ట కారితమ్' అనే చెప్పేడు కణాదుడు. 'శబ్దగుణకమాకాశమ్' అన్నారు పూర్వులు. ఇది తప్పు. వాయువు శబ్దగుణకము; ఆకాశము కాదు. సూర్యుడికి మనకీ నడుమ ఆకాశమున్నా సూర్యగోళమ్మీది ప్రేలుడులు మనకి వినబడవు. శబ్దాన్ని వహించేది ఒక చోటినుంచి ఇంకొకచోటికి చేర్చేదీ వాయువు. నీరూ, పృధివీకూడా శబ్దాన్ని వహించగలవు. ఆకాశము అంటే వట్టిబయలు గాలిలేని బయలు. ఇది శబ్దాన్ని వహించదు. శబ్దగుణకమాకాశమనే సూత్రము అవలోకనముమీద ఆధారపడలేదు.

అవలోకనముమీద కలిగిన అభిప్రాయాన్ని గాని అనుమానాన్ని గాని 'నిజమా?' అని పరీక్షచెయ్యడము విజ్ఞానసాధనలో కడసారి మెట్టు. దీనిని మనవారెరుగరు. 'భ్రమరకీటన్యాయము', 'స్వాతి వాన చినుకు ముత్యమౌతుందన్న నమ్మకా', పాము చక్షుశ్రవమనే అపోహ, గ్రహాల మంచిచెడ్డలూ,—ఇవేవీ 'నిజమా?' అని సోదాచూస్తే జిజ్ఞాస వారి యత్నాల్లో కనబడదు. తాబేలు తోకతో నీరు పీల్చునని చూచారు. నీరు పీల్చితే త్రాగడానికే కదా అనుకొని 'కచ్ఛపము' అని పేరు పెట్టారు తాబేటికి. 'తోకతో నీరుత్రాగునది' అని కాబోలు దాని అర్థము. ఆనీటిని శ్వాసకోసము పీలుస్తుంది తాబేలు. చేపలు నీరు మింగి నీటిలో గాలిని వదిలేటట్టు తాబేలు గుదముద్వారా నీటినిపీల్చి గాలిని గ్రహించి, మళ్లీ వదిలేస్తుంది. ఊపిరితిత్తులే కాక తాబేటి కీయేర్పాటుకూడా వున్నది. ఇలాగే గబ్బిలము తలక్రిందులుగా వేళ్లాడుతూ రెట్టని తుప్పున ఉమ్మినట్టుగా చిమ్మడము గుర్తించారు. ఆలాగు గుదద్వారమునుంచి చిమ్మడము అసాధ్యమని తీర్మానించేసుకుని నోటిద్వారానే మలాన్ని చిమ్ముతోందని ఊహించుకుని గబ్బిలానికి 'వాగుదము' అని పేరుపెట్టారు. అంటే 'నోటినే గుదముగా గలది' అని అర్థము. నిజానికి గబ్బిలానికి రెట్టని చిమ్మేశక్తి గల కండరాలు గుదముకడ కలవు.

అయితే ఒక విషయము చెప్తేనేకాని ప్రాచీనులకు న్యాయము జరగదు. ఈ విజ్ఞానము తెలిసేనాటికి పాశ్చాత్యులకేనా, ఈసంగతులు నిర్దుష్టముగా తెలియవు. సోదా చూచి సత్యము గ్రహించే మెలకువ వారికి 15, 16 శతాబ్దాలలో కలిగింది. మన సిద్ధాంతులకూ, జ్యోతిష్కులకూ, కొందరు దేశాభిమానులకూ నేటికీ కలగలేదు!

141. ఖగోళాలు నిరాధారముగా ఎలానిలిచివున్నాయి?

అని విజయనగరంనించి ఎన్. కామేశ్వరరావుగారు అడుగుతున్నారు.

ఖగోళాల మాట నటుంచి భూమి యెట్లు అవకాశములో నిలచియున్నది? అని ఆలోచించండి. భూమి గుండ్రని గోళమన్న మాట నిర్వివాదాంశము. భూమిని నెత్తిమీద పెట్టుకుని మోస్తూన్నవారెవరూ ఎవరికీ కనబడలేదు. కనక భూమి నిరాధారముగా ఆకాశములో నిలిచి వున్నదన్నమాట. సూర్య, చంద్ర, గురు, శుక్రాది ఖగోళాలను కూడా వాటివాటి చోట్లలో నిలిచి వుండడానికి ఏ ఆధారమూ కనబడదు. అవికూడా నిరాధారముగానే నిలచి వున్నాయనాలి.

అయితే ప్రతీ గోళమూ ఇంకొక గోళాన్ని ఆకర్షిస్తున్నది కదా? సూర్యుడూ, భూమీ, చంద్రుడూ ఇవన్నీ ఆకర్షణవల్ల ఒకదాన్ని ఇంకొకటి కరుచుకుని ఎందుకు ఢీకొట్టవు? అంటున్నారు కామేశ్వరరావుగారు. ఒక గళాసులో సగానికి పైగా నీళ్లుపోసి, గళాసుమూతిని వేళ్లతో పట్టుకుని, నీళ్లు తొణికిపోకుండా ఉయ్యాలలాగ చెయ్యిఊపి, క్రమంగా ఊపే

దూరము ఎక్కువచేసి ఒక్క ఉదుటుని గళాసుని గిరగిరా వెయ్యితిరగగలిగినంత వర్తులములో తిప్పండి. గళాసులో నీరు కిందపడదు. గళాసు నెత్తి మీదికి తలక్రిందుగా వచ్చినా సరే నీరు పడదు



ఎందుకు పడలేదూ? వాస్తవానికి నీరు ఆ గళాసు అడుగును విడగొట్టేసి పారిపోడానికి యత్నిస్తుంది. చేతివేళ్లు కొంచెం పట్టు తప్పితే గ్లాసూ, నీరూకూడా ఆ వర్తులము నుంచి తప్పుకుపోతాయి. మీ చేయి గ్లాసును పైకేతిగా తప్పుకుపోకుండా లాగి పట్టి వుంచుతోంది. తాడు కొసకి రాయికట్టి గిరగిరా తిప్పినప్పుడు తాడుగాని బలహీనమైతే రాయి తాడుని తెంపేసి తప్పుకుపోతుంది. కనక వర్తుల మార్గంలో ఒక వస్తువు తిరుగుతూ ఉండాలంటే ఆ వస్తువుని ఆ వర్తుల కేంద్రమువైపు లాగి పట్టివుంచే శక్తి ఉండాలి. భూమీ, శుక్రుడూ, గురుడూ లాంటి గ్రహాలు ప్రభూత కాలములో సూర్యగోళమునుంచి విడిపోయి విశ్వాంతరాళంలోకి బయల్దేరేయి. ఆ స్థితిలో సూర్యగోళము వాటిని ఆకర్షించింది. ఈ గ్రహాల గమనము సూర్యగోళపు ఆకర్షణశక్తివల్ల దిక్కుమాలి, —ఎటో పోయేరాయి, తాడు కేంద్రానికి లాగుతూండడమువల్ల వర్తుల మార్గములో తిరిగినట్లుగానే — సూర్యుడి చుట్టూ తిరగడముగా మారింది. సూర్యుడి ఆకర్షణశక్తి హెచ్చితే, గ్రహాలు సూర్యుడికి దగ్గరగా వచ్చి ఇప్పటికంటే ఎక్కువ వేగముతో తిరుగుతాయి. ఆకర్షణశక్తి తగ్గిపోతే గ్రహాలు దూరంగాపోయి ఇప్పటికంటె నెమ్మదిగా తిరుగుతాయి. గ్రహాలు ఏవో మార్గములో విశ్వాంతరాళంలోకి తప్పుకుపోకుండా ఆకర్షణశక్తి పట్టి వుంచుతోంది, ఈ ఆకర్షణవల్ల సూర్యుడికి గ్రహాలు కొట్టుకోకుండా గ్రహాల గమనము కాపాడుతోంది.

అయితే నక్షత్రాలు ఒకదాన్ని ఒకటి ఆకర్షించుకుంటాయిగదా, మరి అవి యెందుకు ఢీకొట్టవు? అని అడుగుతారేమో! నక్షత్రానికీ నక్షత్రానికీ దూరము చాలా యెక్కువ. అంతంత దూరాలలో ఉన్న వాటికి ఆకర్షణశక్తి చాలా కొంచెముంటుంది. ఒక నక్షత్రాన్ని తక్కినవన్నీ అన్నిదిక్కులకీ లాగుతున్నాయి కదా? ఈ ఆకర్షణశక్తులన్నీ పరస్పర వ్యతిరేకతవల్ల చెల్లిపోయీ తగ్గిపోయీ, చివ్వరికి ఏతావాతా ఒక నక్షత్రాన్ని లాగే సారాంశ ఆకర్షణ చాలా బలహీనమై పోతుంది. ఈ ఆకర్షణ ఎంతో కొంత మిగిలివస్తే, ఆ నక్షత్రము అటువేపు కదులుతుంది. నక్షత్రాల సైజగతుల (*Proper motions*)లో ఈ ఆకర్షణగతులు కూడా ఇమిడివుంటాయి. ★

చిట్టిప్రశ్నలు - జవాబులు

—చేతి గోళ్లను కొరుకుతూండేవారు తమకి తెలియకుండానే ఆ గోళ్లలో వున్న కశ్మలమును నోటిలోకీ తద్వారా కడుపులోకీ పంపుకుంటున్నారన్నమాట. ఇది నష్టము కాదా?

—మనుష్యుల శిరోజములు సాఫుగా గాని వంకరలు తిరిగి గాని రింగులు రింగులుగా వుండుటకుగాని అసలే లేకపోవుటకు గాని కారణము చాలామట్టుకు వంశపరంపరాగత గుణధర్మమే. నీగ్రోసంబంధముగల అమెరికనులకు దళసరైన క్రింది పెదవులూ, వంకరటింకర గీతలవంటి పొట్టిజుట్టూ కనబడతాయి. తండ్రికి బట్టతల వుండినట్లయితే బిడ్డలకుకూడా కొసాకి బట్టతల రావడం మీరు గుర్తించలేదా?

—ఉన్నది. చంద్రునికివలెనే భూమికీ కూడా కాంతి వున్నది. సూర్యుని రశ్మి భూమిపై పడినప్పుడు పరావర్తమై వెన్నెల వలెనే పైకి వ్యాపిస్తుంది. ఈ "భూమి కాంతి" శుక్లపాడ్యమి చంద్రబింబముపై పడుటవల్లనే, ఆ బింబమునకు క్రింద ఎక్కడో రేఖవలె పడే సూర్యరశ్మి మాత్రమే కాక చంద్రబింబమంతా మసకమసకగా కనపడుతున్నదని శాస్త్రజ్ఞుల నమ్మిక.

—ఒకే తల్లికి పుట్టిన బిడ్డలు ఒకరు తెలుపూ ఒకరు నలుపూ కావచ్చును. దీనికి కారణం తల్లిదండ్రులు గాని, వారి తల్లిదండ్రులు గాని తెలుపు నలుపులుగా వుండడమే. ఎర్ర చంద్రకాంతిమునకునూ పసుపు పచ్చ చంద్రకాంతమునకునూ కలిసినచో బయలుదేరు విత్తనములవల్ల కలిగే మొక్కలు అన్నీ ఎర్రపూవులే పూయవచ్చును. 'ఈ మొక్కల విత్తనాలలో మాత్రం మూడు ఎర్ర పూలవి, ఒకటి పచ్చ పూలది అవుతుంది' అని మెండెలు కనిపెట్టినాడు.

—సూర్యుడు ఇంకా జ్వలిస్తూనే ఉండగా, సూర్యుడి నుంచి విడిపోయిన గ్రహాలు చల్లారిపోడానికి కారణముంది. సూర్యగోళమంతా వాయువే అయినా, సూర్యగోళపు సగటు సాంద్రతకంటె గోళమధ్య మండలి సాంద్రత 50 రెట్లు ఎక్కువ. కనక పెద్ద నక్షత్రమొకటి సూర్యబింబము చేరువగా దూసుకుని పోయినప్పుడు, సూర్యగోళపు పై పొరలలోని వాయువు ఆ నక్షత్రమువైపు తొంగిచూచి, తరవాత ఆ నక్షత్రము దాటిపోగానే చల్లారి గ్రహమైంది. సూర్యగోళము నడుమ ఉదజని వాయువు అంచులమీద హీలియముగా మారుతోందని, ఆ పరిణామానంతరము మిగిలిన శక్తి వేడిగాను వెలుగుగానూ విశ్వాంతరాళానికి వ్యాపిస్తోందని శాస్త్రజ్ఞుల అంచనా. ఈరీతి అణు పరిణామము గ్రహాల్లో ఏ(?)లోనూ జరుగుటములేదట. అందుకే గ్రహాలు నానాటికీ చల్లారి పోతున్నాయి.

—గ్రహమండలాలు మన సూర్యుడికి కాక ఇతర నక్షత్రాలకున్నట్లు ఇంకా తెలియలేదు. ఒక నక్షత్రము ఇంకొక నక్షత్రానికి చేరువగా దూసుకుపోయినప్పుడే, చిన్న నక్షత్రపు వాయుగోళమునుంచి కొంత ద్రవ్యము ఊడివచ్చి, తరవాత చల్లారి, పెద్ద బిందువులుగా ఏర్పడి, చల్లారి, గ్రహాలుగా తిరగాడు కావాలి. ఇప్పుడు కనిపించే దూరాలతో, ఒక నక్షత్రము ఇంకోదానికి అతి సమీపంగా పోగల అవకాశము ఇంకో కోటి కోటి సంవత్సరాలదాకా రాదట!

—ఏదేనా వస్తువును విసరునప్పుడు, ఆ వస్తువంతా చేతిని ఒక్క క్షణంలో వదలి వదలి పోయినట్లైతే తిరుగుతూ పోదు. ఆ వస్తువు యొక్క ఒక భాగము ఒక్కక్షణం వదలినప్పుడు తక్కిన వస్తుభాగాలు తక్కిన చేతికి తగులుతూనే వుండి, దానికి కొంచెము ఎక్కువ తిరుగుతాయి. ఎక్కువగా కదిలే భాగమూ, తక్కువగా కదిలే భాగమూ ఒకే వస్తువులో వుంటే అది తిరుగుతున్నదన్నమాటే. బండిచక్రాన్ని గమనించండి.

—అవును. మామూలు అయస్కాంతాన్ని వేడిచేస్తే దాని కాంతశక్తి తరిగిపోతుంది. సూర్యుడి అయస్కాంతశక్తి ఎందుకు తరగలేదంటారా? సూర్యగోళము అయస్కాంతము కాదు. సూర్యుని మచ్చలు మారుతూంటే భూమి అయస్కాంతకక్ష్యలో మార్పురావడానికీ, ఆమచ్చలలోనుంచి బయల్వెడలే విద్యుత్ ప్రవాహాలు కారణము.

—రోహిణీ కార్తె అన్నది సూర్యుడు రోహిణీ నక్షత్రము కనిపించే వైపు ఉండే $13\frac{1}{2}$ రోజులు. ఈ కాలములో మన దేశమూ, మొత్తముమీద ఉత్తరార్ధగోళమూ సూర్యుడివైపు మొగ్గి ఉంటుంది. అందువల్ల సూర్యరశ్మి నిటారుగా పడి మన దేశాన్ని ఎక్కువ వెచ్చబెట్టుతుంది. కనకనే వేసంగి ఎక్కువ వేడిని. ★



హిమగిరితనయ

★ వడ్డాది పాపయ్యగారి చిత్రాలు ★

'దివినుండి భువికి'





పొడుపు కథ

శ్రీ బొడ్డు బాపిరాజు

★

అనగనగ ఒక పాప; అతి మంచి పాప.
పాపకు రింగులా బంగారు జుట్టు;
పువ్వుల పరికిణీ, బుస్కు జాకెట్టు;
చూడ ముచ్చటయైన సొగసు ముస్తాబు!

అల్లరి చెయ్యదు—అనిపించుకోదు.
పోరుపెట్టదు—విసుగు పుట్టించబోదు—
తల చెరగనీదు—బట్టలు మాపుకోదు—
మారు చెప్పదు చాల మంచి అమ్మాయి!


బువ్వపెట్టిన, లాలపోసిన కాని,
బొట్టు దిద్దిన, బుల్లి జుట్టు దువ్వినను,
వద్దనదు, కద్దనదు, వగలేడ్చిపోదు,
తిప్పలు పెట్టదు చెప్పినట్లుండు.

'అది' అనీ 'ఇది' అనీ అడుగ దొకనాడు,
పేచీలు పడ దేమి పెట్టిపోసినను,
పనివేళ 'ఎత్తుకో' మ్మని అడ్డుపడదు,
అమ్మకు ముద్దైన యపుడె చంకెక్కు.

చీటికి మాటికి చిలిపి కోపాలు—
మూతి ముడుపులు—ఉడుకుబోతు పంతాలు—
మారాములును—పెంకి గారాము లసలు
మాట వరుసకు లేవు మహామంచి పాప!

చెప్పుకొండెవ్వరా చిన్నారి పాప?
చెప్పితే దోసెడు పప్పు బెల్లాలు
'చెప్పుకోలే' మంటె విప్పుతా కథను.
చెప్పనా? చెప్పనా? చెప్పివేస్తున్న—!

ఎవరంటె?—మా బాల ఎత్తు కాడేటి
అందమయినా మంచి చందనపు బొమ్మ!



అద్దెబోటులో-

ముచ్చటగా ముగ్గురు

(కుక్క సంగతి సరే సరి!)

10

'బెల్‌వయర్ లాక్' కోసం చూసిచూసి మా కళ్లు కాయలు కాచిపోయాయి. ఎంతకీ ఆ లాకు కనిపించకపోగా, దీన్ని కూడా ఎవడో యిటీవలి కాలంలో ఎత్తుకుపోయేవుంటాడని నేనూ, హారిస్సూ నిర్ధారణ చేసుకొన్నాం. 'స్టెయిన్స్'వరకు జార్జిగాడే పడవతాడు లాగాడు. అక్కడికి చేరుకొన్నాక మేము లాగటం మొదలుపెట్టాం. ఒకదశకి వచ్చేసరికి మేము లాగుతున్నది మామూలు పడవ కాదనీ, ఏభైటన్నుల బరువుగల ఏదో ఘన పదార్థాన్ని నలభైమైళ్ల దూరంనుంచి యీడ్చుకొస్తున్నామనీ అనిపించింది. సాయంకాలం ఏడున్నర అయ్యేదాకా మటుకు పళ్ళు బిగువున లాక్కొచ్చాం: ఆ తరువాత కాలుతీసి కాలువెయ్యటం కూడా మా తరంకాదనిపించింది. అంతటితో పడవని ఎడమవైపు ఒడ్డుదగ్గిరకి పట్టించి, ఆ రాత్రికి మజిలీవెయ్యటానికి మంచి చోటు ఏదైనా కనిపిస్తుందేమోనని నాలుగువైపులా పరకాయించి చూశాం.

మొదట అనుకొన్నప్రకారంఅయితే, మేమా రాత్రికి 'మాగ్నకార్టా' లంకల్లో మకాంవెయ్యాలి. ఆ లంకలు నిజంగా చాలా అందంగావుంటాయి. అక్కడ పీచేగాలికూడా వింత వింత పోకడలు పోతూ, మనకి కితకితలు పెట్టుతుంది. ఆ మాటకొస్తే అంత చక్కని లంకలు 'థేమ్స్'నదికి దిగువభాగంలో ఎక్కడా లేవు. పొద్దుగ్రుంకబోయేదాకా అక్కడికి ఎప్పుడెప్పుడు చేరుకొని, అక్కడి సుందరమయ ప్రకృతిని కన్నులార తనివితీర జూచి ఆనందిద్దామా అని వువ్విళ్లూరిపోయిన మాకే, ప్రొద్దుగ్రుంకబోతున్న సమయానికి 'యిప్పుడు ఆ లంకల అందం చూడకపోతే ఏం' లెమ్మనిపించింది. ఆ పూటకి ఎక్కడైనా పడవని కుదురుగా కట్టేసుకోవటానికీ, కాళ్లు ముడుచుకు పడుకోటానకీ, కాస్త చోటుదొరికితే చాలుననిపించింది. అప్పటి మా స్థితి 'సినరీలూ వద్దు; చట్టుబండలూ వద్దు: కడుపుకి యింత పడేసి కళ్లు మూసుకు పడివుందామ' న్నట్లుంది. అలా అనుకొంటూనే 'పిక్‌నిక్ పాయింట్' అనబడే చోటువరకూ పడవని యీడ్చుకెళ్లాం. అక్కడ మకాం చేయటానికి వీలుగా వుంది.

ఇక అన్నాలు తిందామనుకున్నాం. (ఆ వేళ పని తొందరలోపడి, మధ్యాహ్నం టీ మానేశాం.) వెంటనే భోజనాలు చెయ్యటానికి జార్జిగాడు వొప్పుకోలేదు. ముందుగా పడకకి కావలసిన ఏర్పాట్లన్నీ చేసుకొని మరీ భోంచెయ్యటం మంచిదని వాడి వాదన. పడకకి ఏర్పాట్లు అంటే—మరేమీ లేదు. పడవకి

మూలం :
జెరోమ్ కె. జెరోమ్
★
అనువాదం :
విశ్వాత్ముల నరసింహమూర్తి

★ ముచ్చటగా ముగ్గురు ★

నాలుగువైపులా నాలుగు పెద్ద యినపకొక్కేలు తగిలించి వాటిమీదగా ఒక పెద్దకాన్వాసు బిగించేస్తే, వుంటూ అదీ పడకుండా వెచ్చగా బోటులో పడుకోవచ్చు. అదీకాక, మరీ చీకటిపడిపోకముందే ఆ కాన్వాస్ పట్టా బిగించేస్తే, తిండితినేటప్పుడు ఏ తొందరా లేకుండా హాయిగా తినవచ్చునన్నాడు.

కాన్వాస్ పట్టా బిగించటానికి మేము ముగ్గురమూ అనుకొన్నదానికంటే ఎక్కువగానే శ్రమపడవలసివచ్చింది. ఏవో నాలుగైదు కొక్కేలు తగిలించేసి, వాటికి యీ పట్టాని బిగించేస్తే పని అయిపోతుందనుకొన్నామే కాని, తీరా పనిలోకి దిగాకగాని అదెంత కష్టమైన పనో తెలిసిరాలేదు. ముందు కొక్కేలు పైకి తీసి, పడవ చక్కల్లో వీటికోసం ప్రత్యేకంగా వున్న గంట్లు వెతికాం. ఒక్కొక్క గంటులో ఒక్కొక్క కొక్కెం చొప్పున పెట్టబోయాం కాని, ఒక్కటీ పట్టలేదు. ప్రతి కొక్కేన్నీ తన్ని, తిట్టి, కొట్టి విడిచిపెట్టితే గాని గాడిలో పట్టలేదు. ఎలాగో ఒకలాగు అన్నిటినీ గంట్లలోకి ఎక్కించాముకదా అని సంతోషించబోతుండగా, ఏ గంటులో పెట్టవలసిన కొక్కెం ఆ గంటులో పెట్టక ఒకదానిగంటులో మరొక కొక్కేన్ని పట్టి బలవంతాన ఎక్కించామని బయటపడింది. అంత కష్టపడి ఎక్కించినవాటి నన్నిటినీ మళ్లీ వూడపీకాల్సి వచ్చింది.


మేము ఎంత గింజుకొన్నా ఆ కొక్కేలు గంట్లల్లోంచి వూడిరాక మొరాయించాయి. ఇక యిల్లా లాభంలేదని ఒక్కొక్క కొక్కేన్నీ యిద్దరిద్దరూగా కలిసి ఐదునిమిషాలసేపు గట్టిగా పట్టుకుని గుంజటం మొదలు పెట్టాం. పళ్లుబిగించి కళ్లుమూసి లాగుతూ లాగుతూ వుండగా కొక్కెం ఎప్పుడో గభిక్కున వూడివచ్చేసేది. దాంతో యిద్దరమూ గాలిలో మూడు పిల్లిమొంగ్గాలు కొట్టి నదినీటిలో విరుచుకుపడ్డాం. పైగా ఆ కొక్కేలకి మధ్యభాగంలో మడతబందులు వుంటాయి. ఆ అనరాచూసుకొని, యీ దిక్కుమాలిన కొక్కేలు, మేము ఏదో పరాకుగా వున్నప్పుడు మడతపడిపోయి మా శరీరాల్లోని సున్నితమైన భాగాలమీద బరికేసేవి: అదీ కాకపోతే—కొక్కేనికి ఏదో ఒకపక్క పట్టుకొని దాని విధి దాన్ని చెయ్యమని మేము ఒక చెంప బ్రతిమాలుతూవుంటే, కొక్కెంతాలూకు రెండో భాగం మా వెనగ్గా వొంగివచ్చి మా తలలమీద దభీమని బాదేది.

ఈవిధమైన బాధ లనేకం పడి, కొక్కేలని గంట్లల్లో పెట్టి బిగించాం. ఇక కాన్వాస్‌పట్టా బిగించే పనిమాత్రం మిగిలివుంది. జార్జిగాడే ముందుగా పట్టా వూడదీసి ఒక అంచు బోటు ముందుభాగానికి బిగించేశాడు. అక్కణ్ణుంచి వాడు దాన్ని మడతవిప్పి అందిస్తే, తాను అందుకొని బోటుచివరన నించున్న నాకు అందివ్వటంకోసం హారిస్సుగాడు బోటు నట్టనడాన నిలబడివున్నాడు. అయినా ఆ పట్టా వాడిచేతుల్లోంచి హారిస్సుచేతిలోకి రావటానికి ఎంతోసేపు పట్టినట్లు అనిపించింది. జార్జిగాడు తనవంతుపని సవ్యంగానే చేసేశాడు: ఆ హారిస్సుగాడికి పని కొత్తకావటంచేత, వాడు దాన్ని నానా గందరగోళమూ చేసిపెట్టాడు.

వాడు అంత గందరగోళం ఎల్లా చేయగలిగాడో నాకు అర్థంకాకపోవటంలో ఆశ్చర్యంలేదు: అంతపని ఎల్లాచేశానా అని వాడే తరువాత విస్తుపోయాడు. మొత్తానికి ఏదోఅమానుషమైన శక్తేవాడిచేత అంత అఘాయిత్యం చేయించింది. చుట్టచుట్టుకుపోతున్న పట్టాని పట్టి బలవంతాన సాగదీయబోయి, వీడే ఆ కాన్వాస్ పట్టాల మడతలమధ్య బల్లి, బొద్దింకి యిరుక్కుపోయినట్లు యిరుక్కుపోయాడు. ఆయిరుక్కుపోవడంకూడా ఎంత బాగా యిరుక్కుపోయాడంటే, ఎంత గింజుకున్నా వాడంతట వాడు యీ జన్మకి అందులోనుంచి బయటకిరాలేనంత యిదిగా యిరుక్కుపోయాడు. అందులోంచి బయటికిరావటానికి బ్రహ్మాండమైన ప్రయత్నం చేశాడు. అంతపెద్ద ప్రయత్నంచేసినా తాను అందులోనుంచీ బయట పడలేకపోగా—ఎలా చేతనైందో ఏమో—దూరంగా నిలబడివున్న జార్జిగాడిని కూడా కాన్వాస్ మడతల్లోకి యీడ్చేశాడు. అక్కణ్ణుంచీ ఆ జార్జిగాడు తానుకూడా కాన్వాస్ పట్టా మడతల్లో యింకోమూల పడి కొట్టుకొంటూ, హారిస్సుని నానాతిట్లు తిట్టడం ప్రారంభించాడు.

ఇంత తంతు జరుగుతున్నా, ఆ సమయంలో

నాకు అదేమీ అర్థంకాలేదు. నన్ను వాళ్లిద్దరూ పడవకి రెండోకొనన నిలబడమన్నారు: నిలబడి చూస్తున్నాను:—మాంట్ మొరిస్సీకూడా నా పక్కనే నిలబడి తోక ఆడిస్తోంది. మే ముభయులమూ కూడా బంగారుతండ్రుల్లా పెద్దవాళ్లు చెప్పింది చెప్పినట్లు చేస్తున్నాం. అవతల ఆ కాన్వాస్‌పట్టా వుండివుండి ఎగిరెగిరిపడుతూ వుండటం మేము గమనించకపోలేదు: గమనించికూడా యిదంతా కాన్వాస్‌పట్టాని బిగించే క్రతు



★ ముచ్చటగా ముగ్గురు ★

వులో అంతర్భాగమే కాబోలు ననుకొన్నాను. అందుకనే చూస్తూ వూరుకొన్నాను.

కాన్వాస్‌పట్టా మడతల్లోనుంచీ ఏవో బూతులు వినిపిస్తునే వున్నాయి. వాళ్లిద్దరికీ ఆ పని చెయ్యటంలో ఏదో కాస్త కష్టం అనిపించి, యిలా తిట్టుకొంటున్నారు కాబోలు ననుకొన్నాను. వాళ్లకి అదంతా లొంగుబాటులోకి వచ్చేదాకా నేనాపని జోలికి పోకుండా వుంటేనే మంచిదనే అభిప్రాయంతో, వున్నచోటు నుంచీ కదలలేదు.

మరికొంతసేపు గడిచింది. కాని పరిస్థితిమాత్రం ఏమీ బాగుపడకపోగా, అంతకంతకూ విషమించినట్లుంది. చివరి కెప్పుడో చూద్దునుకదా, కాన్వాస్‌పట్టా మడతలలోనుంచి ఒకమూలగా జార్జిగాడి తల మొలుచుకొచ్చింది.

“దిష్టిబొమ్మలా నిలబడకపోతే, కాస్తవచ్చి మమ్మల్ని యిందులోనుంచి బయటికి లాగరాదుటరా! ఒకవంక మేము వూపిరాడక చస్తుంటే, నీకు వేళాకోళంగా వుందా ?” అని ప్రశ్నించింది ఆ తల.

మామూలుగానే ఆర్తనాదం వినిపించిందంటే, నేను ఆగలేను. అటువంటిది జార్జిగాడితల ఆ మాటలు అనేసరికి నేను అసలే ఆగలేకపోయాను. వెంటనే ఆ పట్టాని పట్టుకొని బలంగా విదిలించేశాను. అందులోనుంచీ జార్జి, హారిస్సు రాలిపడ్డారు. హారిస్సుగాడి మొఖం అప్పటికప్పుడే నల్లగా కప్పేసిపోయింది. ఇంకొక్క ఘడియ ఆలస్యంఅయినా కొంపమునిగేదే!

తరువాత ముగ్గురమూ కలిసి అరగంటసేపు తంటాలుపడి, ఎల్లాగైతేనేం, కాన్వాస్‌పట్టా బిగించేశాం. పడవఅంతటా చిందరవందరగా పడివున్న సుత్తులూ, మేకులు—వగైరా సామానంతా తీసేసి కాస్త శుభ్రంచేసి భోజనం తాలూకూ సరంజామా పైకితీశాం. పడవ అడుగుభాగంలో ఒకమూలగా స్టౌ వెలిగించి, దానిమీద కెటిల్‌తో టీకి నీళ్లు పడేసి, యివతలకి వచ్చి మిగిలిన పనులేవో చూసుకొంటున్నాం.

పడవలో ప్రయాణం చేస్తుండగా టీ నీళ్లు కాచమైనా ఆచూకీ అందిందో, అది యిక చస్తే నీళ్లని మరగనివ్వదు; ఆవిరిని పైకి పోనివ్వదు; మూతని ఎగిరెగిరి పడనివ్వదు. మిమ్మల్ని యిలా ఏడిపించటం దానికి మహా సరదా. ఈ చిన్న కిటుకు కనిపెట్టి, మీరుగనక స్టౌమీద కెటిల్ పడేసి యింక ఆ విషయమే మీకు అక్కరలేనట్లు దానివంక ఓరచూపుగానైనా చూడకుండా, దాని అస్తిత్వాన్నే గుర్తించకుండా మీదారిన మీరు యింకేదో పనిచేసుకొంటూపోవాలి. టీకోసం నీళ్ళుపెట్టి, మీ కసలు టీయే అక్కరలేనట్లు వ్యవహరించటం మొదలుపెట్టేసరికి, యీ కెటిల్‌కి ఎక్కడలేని వృడుకుమోతుతనమూ పుట్టుకొచ్చి, తుకతుకలాడిపోతుంది. అంతా అరనిమిషం గడిచేలోగా మీకు టీకి కావలసిన వేన్నీళ్లు తయారైపోతాయి.

మీకు యింకా తొందరగా టీ కావలసివచ్చినప్పుడు, యింకో చిన్నపనిచేస్తే సరిపోతుంది. కెటిల్‌ని స్టౌ మీద పెట్టేసి మీరు యిద్దరో ముగ్గురో అటువైపు తిరిగి కూర్చోండి. మీలో ఒకరు రెండోవాణ్ణి “ఒరేయ్, నీకు టీ కావాలా ?” అని అడగండి. దానికి సమాధానంగా రెండోవాడు “టీయా? దిక్కుమాలిన టీ !—నాకు అదంటేనే అసహ్యం. షరబత్ తాగుతాను. టీ చాలా అజీర్ణం చేస్తుందిరా బాబూ!” అనాలి. అంటే—యిక చూసుకోండి—ఈ మాటలు వింటున్న కెటిల్‌కి ఎక్కడలేని తొందరా పుట్టుకొచ్చి, పావు నిమిషంలోనే నీళ్లు కాగిపోతాయి.

ఈ చిటకానే మేము ఆరోజు ప్రయోగించి చూశాం: బాగా పనిచేసింది. ప్లేట్లలో భోజన పదార్థాలన్నీ పెట్టుకొనేలోగా టీ తయారైపోయింది. లాంతరు వెలిగించి, చుట్టూ కంచాలు పరుచుకొని కూర్చున్నాం.

ఆక్షణాన మా నలుగురికీ కూడా నిజంగా తిండి కావాలి.

తిండికి ఎగబడ్డాం. ముప్పైఐదు నిమిషాలసేపు పింగాణీ ప్లేట్లమీద ఫోర్కులు తాకిన చప్పుడు, కత్తులు గీసిన చప్పుడు, దవడలు ఆడిస్తున్న చప్పుడు

త్రేన్చి ఎడంకాలిమీద వేసుకొన్న కుడికాలుని కిందకి దించి కుడికాలుమీదికి ఎడమకాలిని ఎక్కించాడు.

మరొక ఐదు నిమిషాలు గడిచాక జార్జిగాడు కూడా 'బ్రేవ్' మని త్రేన్చి, ఆవేశం వచ్చినవాడిలా తనముందువున్న పింగాణీ ప్లేటుని దూరంగా విసిరేశాడు. ఇంకొక మూడు నిమిషాలు గడిచాక మాంటీ మొరస్సీ సంతుష్టిచిహ్నాలు వెలిబుచ్చింది. మహా ప్రయాణం ఆరంభమైనప్పటినుంచీ, యీక్షణంవరకు మాంటీ మొరస్సీ ఆమాత్రం సంతుష్టిగా కనిపించటం యిదే మొదటిసారి. ఇప్పుడు అది చేసిన చేష్ట కూడా సామాన్యమైనది కాదు. ఉన్నట్టుండి ఒక్కసారిగా నేలమీద పడిపోయి కాస్సేపు యిటునుంచి అటుకి, అటునుంచి యిటుకీ దొర్లింది: మరి కొంతసేపు వెల్లకిలా పడుకొని, కాళ్లు నాలుగూ గాలిలోకి ఎత్తేసి కదలకుండా అట్లా వుండిపోయింది.

అప్పటికి నాకూ కడుపు బాగా నిండిపోయింది. త్రేన్చుస్తూనే వెనక్కి వాలిపోయాను. కడుపునిండిన సంతుష్టిలో వున్నానేమో, దేనిమీద పడుతున్నానో చూసుకోకుండా పడిపోయాను. నాతల పోయి పెద్ద రాతికి కొట్టుకుంది. తలమీద యింతపెద్ద బొప్పి కట్టింది. అయినా నేనేమీ లెక్కచేయలేదు.

కడుపు నిండేసరికి మనతత్వమూ, మన ఆలోచనలూ అన్నీ మారిపోతాయి. మనను చూస్తే మనకే చాలా సంతోషంగా వుంటుంది. మనచుట్టూ వుండే యీలోకం అంతా కూడా చాలా సుందరంగా కనిపిస్తుంది. పరిశుద్ధమైన ఆత్మ వుంటే, మనిషి చాలా సుఖంగానూ సంతుష్టిగానూ జీవించగలడని నాతో ఒకరిద్దరు అంటూ వచ్చారు. పరిశుద్ధ ఆత్మకంటే కూడా కడుపునిండా తిండివుంటే సుఖంగానూ, సంతుష్టిగానూ వుంటుంది. పైగా ఆత్మని పరిశుద్ధంగా అట్టే పెట్టుకోవటానికి అయ్యేఖర్చుకంటే, ఖాళీ అయినప్పుడల్లా కడుపునిండా యింత తిండి పడేసుకోవటమే చౌక! పొట్ట ఫుల్లుగా నిండివున్నప్పుడు, ప్రతివాడూ ఎంతతప్పైనా యిట్టే క్షమించి ఎటువంటి శాస్తినైనా దయతో చూసే వుదారస్థితిలో వుంటాడు.

మన ఆలోచనలనీ, వ్యవహారాలనీ యీ జానెడు కడుపు ఎప్పటికప్పుడు యింతగా లొంగదీసుకొంటూ వుంటుందంటే, నిజంగా విచారించవలసిన విషయమే మరి! అంతదాకా ఎందుకు — కడుపు నిండుగా వుంటేగాని మనబుర్రలు ఏవీ పనిచెయ్యవు కదా? మన కడుపులకి మనం యింత బానిసలమా? నాకు చూడగా ఒకటి అనిపిస్తుంది — నీతి, నియమము, దయ, ధర్మము మొదలైనవాటిని గురించే అస్తమానం ఆలోచించటం మానేసి, ఎప్పటికప్పుడు పుష్టికరమైన ఆహారం యింత కడుపులో పడేస్తుంటే చాలు, మనుష్యులంతా మంచివాళ్లు అయిపోతారు. అప్పుడు ఎవరి ప్రయత్నమూ ప్రబోధమూ అక్కర లేకుండానే, మానవజాతి జాతి అంతా బాగుపడిపోతుంది. ప్రతిదేశమూ సుఖసంపదలతో తులతూగిపోతుంది: ప్రతిగృహమూ స్వర్గసీమ అవుతుంది: ప్రతి భర్తా మూర్తీభవించిన ప్రేమస్వరూప మౌతాడు. ప్రతి తండ్రీ బిడ్డలపాలిటి పెన్నిధి అవుతాడు.

అంతదాకా పోవటం ఎందుకు — ఆపూట భోంచెయ్యక పూర్వం మా హారిస్సుకీ, నాకూ ఒకళ్లమీద ఒకళ్లకి వొళ్లు మండిపోతోంది. ఏకాస్త కారణం దొరికినా ఒకడిపీక ఒకడు కొరికేసేటంత యిదిగా వున్నాం. అల్లాంటిది — భోజనాలు పూర్తిఅయ్యి, యిద్దరి కడుపులూ నిండాక, యిద్దరమూ ఎదురు బొదురుగా కూర్చుని ముసిముసి నవ్వులు నవ్వుకొన్నాం: మా యిద్దరి మధ్యగా ముట్టిదూర్చిన మాంటీ మొరస్సీ గాడిని కూడా రుచిరమందహాసవీచికలలో ముంచి తేవనేత్తాం. ఆక్షణంలో మే ముగ్గురమూ పరస్పరం గాఢంగా ప్రేమించుకొన్నాము: అసలీ సృష్టిలోవుండే సకల చరాచర వస్తుసముదాయాన్నీ మనస్ఫూర్తిగా ప్రేమించే పరిణతిని అందుకొన్నాం.

తమ్ముడు:- మెళ్లో జంధ్యం వేసుకొంటాడు ఎందుకురా, అన్నయ్యా?

అన్నయ్య:- తాళంచెవులు కట్టుకోవటానికిరా!

తమ్ముడు:- మరి మంగళసూత్రం దేనికి?

అన్నయ్య:- ఆమాత్రం తెలియదా? డబ్బా మూతలు తీసుకోవటానికి!

—శ్రీ పసుపులేటి సత్యనారాయణ, శిఖాపురం

(42-వ పేజీ చూడండి)

నాన్నగారి స్నేహితుడు

కడుపు దహించుకు పోతోంటే, యిన్ని కాఫీనీళ్ళయినా పోసుకుని వెళదామని హోటలు వేపు నడిచాను. హోటలు వాకిట జనం కితకితలాడు తున్నారు. ఓ వేపునించి వొచ్చేవాళ్ళు వొస్తోంటే, మరో వేపునించి వెళ్ళేవాళ్ళు వెళ్లు తున్నారు, ఎలాగో సందు చేసుకుని లోపలికి వెళ్ళడాని ప్రయత్నిస్తున్నాను. ఇంతలో, యెవరో వెనకనుండి పిలిచినట్టయితే వెనక్కి తిరిగి చూచాను. ఎరిగిన ముఖం యేదీ కనిపించ లేదు.

"ఐనా, యీవూళ్లో నన్నెరిగిన వాళ్ళెవరుంటారులే" అని అనుకొంటూ ముందుకు అడుగేశాను.

"నిన్నే నబ్బాయ్" యేదో చెయ్యిబలంగా నా బుజం మీద పడింది. వెనక్కి తిరిగాను. ఎవరో పెద్దమనిషి.. కాస్త వయసు మళ్లినా బలిష్ఠంగానే వున్నాడు. ఖద్దరు లాల్చి, బెంగాల్ కట్టుపంచె, కాళ్ళకు కాన్వాస్ షూస్, నల్లద్దాల కళ్ళజోడూ, చంకలో ఆంధ్ర పత్రికా, లెదర్ బ్యాగూ-ఆ ముఖాన్ని యెక్కడా చూచినట్టే గుర్తులేదు.

"మిమ్మల్నెక్కడో ...." బహుశా జ్ఞాపకం రాలేదేమో, ఎడంచేతి నడిమివ్రేలుతో నుదుటి మీద టపటప లాడించాడు.

"ఎక్కడ చూసుంటాను?"

"అదే జ్ఞాపకం రానంటుంది... ఆఁ...అసలు మందేవూరు?

"ఒంగోలండి".

"ఆ...అగ్గదీ ... అలా చెప్పవేం? ... కారంపూడి వాళ్ళ అబ్బాయివి కదూ?"

"అవునండి. సుబ్బారావుగారి అబ్బాయిని"

"అలా చెప్పవేం?..."

అమాంతం కవుగలించుకుని, "ఆరి బడుద్ధాయ్ ఎంతవాడివయ్యావ్ ... అయినా అదేమిటబ్బాయ్ అలా యెరగని వాణ్ణి చూచినట్టు చూస్తావ్ ... నాకు సరే?

శ్రీ వి. ఎస్. చెన్నప్ప

పెద్దతనం అనుకో ... కుర్రాడివి నీకయినా ఆమాత్రం గుర్తులేకపోతే ఎలా? ... అయినా ఎప్పుడో చూచావ్ పాపం, ఎలా గుర్తుంటుంది. నేనావూరు వొదిలిపెట్టే నాటికింకా నీవు స్కూలు కెళుతునే వున్నావాయ"

"మరేనండి" నాకప్పటికి గాని జ్ఞాపకం రాలేదు, వారిని మా వూళ్ళోనే చూచినట్టు

"అయితే అబ్బాయ్. సుబ్బారావు కులాసేనా?"

"లేరండి, ఆయన పోయారండి"

"ఏమిటీ? పోయాడా? ఎప్పుడేమిటి?"

"...ఏడేళ్ళయిందండి"

"ఏడేళ్ళే... అయ్యో, పాపం ఎంత మంచివాడు. వెన్నపూస లాంటి మనసు. వొకరు కష్టపడుతోంటే కళ్ళారా చూళ్ళేడు కదా. తనకు లేకపోయినా ఎదటివాడికి సాయం చేయాలనే తత్వం... ఇంతకూ మంచివాళ్ళు ఎంతకాలం వుంటారేమిటి యీ భూమ్మీద?..."

"ఐతే, అబ్బాయ్ సుబ్బారావు చనిపోతే ఓ కార్డు ముక్క పడెయ్యకూడదూ? సుబ్బారావే వుంటే అలానే చేసేవాడా? నేనంటే యెంత ప్రాణం! ఒక్క కంచాన తిని, ఒక్క మంచంలో పడుకున్నాం. నాతో సంప్రతించకండా యేపనీ చెయ్యడు కదా...అసలు నేన్లేందే యీ యింట్లో యేకార్యమూ జరగదనుకో.. అయినా, యీకాల పిల్లలకి స్నేహితులూ బంధువులూ కూడానా?..."

ఆయనకేం జవాబు చెప్పాలో తెలీక తికమక పడ్డాను.

"అవున్లే, పసివాళ్లు మీకేం తెలుసు? ఎప్పుడో పదిహేనేళ్ళ నాడు వూరొదలి వెళ్ళామాయె. ఎలా జ్ఞాపకం వుంటుంది?...అయితే అబ్బాయ్ నేను మాత్రం మనుష్ని మరచిపోను సుమా. కలకత్తాలో బిసినెస్ చేస్తున్నానా?... తెలుగువాడన్న వాడు కనుపిస్తే సరి, ప్రాణం వొదిలేవాణ్ణి తెలుసా?...ఆ మొన్నెవరో కనిపిస్తే గాన్నుల్నందర్నీ నిచారి...

గూడా...ఆఁ...నువ్వేదో యిన్షూరెన్సు ఏజెంటుగా పనిచేస్తున్నావని విన్నాను..."

"నేనుకాదండి,...మా అన్నయ్యగారు"

"ఏమిటీ...రాజారావా?"

"మరేనండి"

"అలా చెప్పవేం? ఆ...ఆ... అవునవును మొన్న మావాడికో వుత్తరం కూడా రాశాట్ట. కనీసం పాతికవేల కయినా యిన్షూర్ చెయ్యాలిసిందని. 'అలాగే' అబ్బాయిని ఓ మాటిక్కడికి రమ్మని రాయరా వెధవడబ్బు లేమిటి, మనుషులు కావాలి గాని, అని చెప్పాను కూడా మావాడికి. మావాడి వద్దనుండి వుత్తరం యీపాటికి అందే వుంటుందనుకుంటాను?..."

"తెలీదండి"

"ఆఁ ... అయినా నీకెలా తెలుస్తుంది?...అయితే అబ్బాయ్ నీ పేరు..."

"మధుసూదనుడండి"

"అద్గదీ...పెద్దతనం కాదుటోయ్. మతిమరుపు...కాకపోతే మొన్న పోస్టాఫీసు వద్ద పార్కర్ పేనా యెవరో అడ్రసు రాసుకుందుకు అడిగితే యిచ్చి తిరుగా తీసుకోకుండానే చక్కా వెళ్ళిపోదునా?... ఆఁ ...మధూ... ఆఁ ... ఇప్పుడుజ్ఞాపకం వొస్తోంది. మీనాన్న నిన్ను మధూఅని పిలిచేవాడు. నీవంటె అమిత ప్రాణం సుబ్బారావుకి...అదేమిటీ...నామతి మండిపోనూ ఎంతసేపు నిలేశాను. రానాయనా, రా, కాఫీ తీసుకు వెళదాం"

ఇద్దరం హోటలులోకి నడిచాం.




"నిన్నే నబ్బాయి"

ఆకలిగా ఉందేమో వారికి, నాకంటే రెండు మూడు పేట్లు అధనంగానే భోంచేశారు. కాఫీ పుచ్చుకుని లేచేనరికి సర్వరు బిల్లుతో తయారయ్యాడు, బిల్లు పుచ్చుకోబోతూంటే - "అదేమిటీ, నేనిచ్చుకోనూ" అని పేచీ పెట్టారు. వారి కెలాగో నచ్చచెప్పి బిల్లు పుచ్చుకునే సరికి తాతలు దిగివొచ్చినంత పనైంది. బిల్లు చెల్లించి బైటపడ్డాం.

ఇంతలో రామారావుకనిపించి. "అదేమిట్రా ప్లాట్‌ఫారమం తాగాలించి వొస్తున్నాను. ఎలా

(43-వ పేజీ చూడండి)



దీర్ఘాయువు

(బౌద్ధగాథ)

శ్రీ గోవిందులూరి సాంబశివరావు

(గత సంచిక తరువాయి)

5

దీఘితి దంపతులకు, తన తల్లిదండ్రులకు, ఇక్కడ నగరంలో ఈఅవమానం అంతా జగిరిపోతూ వున్న సమయంలో అక్కడ నగరానికి దూరంగా తనబసలో విద్యాభ్యాసంగంలో వున్న కుమార దీర్ఘాయువుకు పుస్తకం ముట్టుకోబుద్ధి కాలేదు. అక్షరం చదవగా మనస్కరించలేదు. మనస్సు అదోవిధంగా ఆరాటపడిపోయింది. అతని మనస్సుకు తల్లి వైపుకు, తండ్రి వైపుకు వంగింది. మనస్సు ఇట్లాఅంది. "తల్లిదండ్రుల దర్శనం చేసుకొని చాల కాలం అయింది. వెళ్లు! వారి దర్శనం చేసుకో." వెంటనే అతడు వారణాసికి బయలుదేరి వచ్చాడు.

ఏమిదర్శనం అది! ముండితమైన శిరస్సులతో, బద్ధితమైన బాహువులతో తల్లిదండ్రులు కనిపించారు. ముందు బాజాలు. వెనుక భజంత్రీలు. వెంటభటులు. ఇంటిముందు ఇంటిముందుఆపుతున్నారు. వీధివెంటవీధివెంట తిప్పుతున్నారు.కుమార దీర్ఘాయువు క్రుంగిపోయాడు. కుమార దీర్ఘాయువు దుఃఖపడ్డాడు. కుమార దీర్ఘాయువు కోపంతో ఘూర్ణిల్లిపోయాడు. కుమారుణ్ణి దీఘితి అంతదూరంలో చూశాడు. చూచి కుమారుణ్ణి సంబోధించి ఈలా అన్నాడు: "తండ్రీ! దీర్ఘాయువు! ఈవిషయాన్ని మనస్సుకు పట్టించుకోక! తాత! దీర్ఘాయువు! వైరం చేత వైరం శాంతిస్తుందా? శాంతించదు నాయనా! శాంతించదు. అవైరంచేత వైరం శాంతిస్తుంది. ఇది సత్యం."

ఈమాటలను విన్న కాశీరాజు భటులు దీఘితికి పిచ్చి ఎత్తిందన్నారు. "కోసలరాజా! ఏమి మాటలు చెబుతున్నావయ్యా? ఎండలో తిప్పడం చేత కొంచెం పైత్యం తలకు ఎక్కినట్లువుంది. తాతా! దీర్ఘాయువు అంటావు! ఆతాత ఎవడు? ఆదీర్ఘాయువు ఎవడు? నీకేమన్నా చుట్టమా? పక్కమా? అసలా దీర్ఘాయువు ఎక్కడా కన్పించడే! బలేవాడివయ్యా! గాలితోనా మాట్లాడుతున్నావు? ఎవరితోనయ్యా నీవు ఈమాటలు చెప్పేది? తాత! దీర్ఘాయువు! ఇదంతా నువ్వు పట్టించుకో వద్దంటున్నావూ! తాత! దీర్ఘాయువు! వైరంచేత వైరం శాంతించదంటున్నావు? అవైరం చేతనే, తాత దీర్ఘాయువు! వైరం శాంతిస్తుందంటున్నావు? నీకు పిచ్చి ఎత్తినట్లువుందే" అంటూ దీఘితి రాజును భటులు ఎగతాళీ చేశారు.

దీఘితి అన్నాడుగదా "అబ్బాయిలు! నాకు పిచ్చి ఎంతమాత్రం ఎత్తలేదు. నేను ఉన్మత్తుణ్ణంకాదు. నేను అనేమాటలు గూడా ఉన్మత్తుని ప్రలాపాలు కావు. ఎవరు

విజ్ఞులో వారికి నామాటలు అర్థం అవుతాయి"? అని. భటులు ఈసారి నిజంగా దిఘితికి పిచ్చిఎత్తిందను కున్నారు. పిచ్చి ఎత్తిందన్నారు. ఎగతాళీ చేశారు. మళ్లీ దిఘితి అదే ప్రత్యుత్తరం ఇచ్చాడు. మళ్ళీ ఎగతాళీ చేశారు. మళ్లీ దిఘితి అదే ప్రత్యుత్తరం ఇచ్చాడు. మూడుసార్లు భటులు దిఘితిని పిచ్చవాడన్నారు. మూడుసార్లు దిఘితి తాను పిచ్చవాణ్ణి కాదన్నాడు. ఈమూడుసార్లు దిఘితి మాటలను విని "ఓ! కోసలరాజు దిఘితి ఉన్మత్తుడై పోయినాడు" అని కాశీరాజు భటులు ఖచ్చితంగా తీర్పు చెప్పారు." ఇదుగో! ఓకోసల దేశపు రాజా! పిచ్చిఎత్తిందని ఒప్పుకో" అన్నారు. దిఘితి ఒప్పుకున్నా నన్నాడు.

ఆభటులు దిఘితిని ఆయన భార్యను ఒక ఇంటిముందు నుంచి ఇంకో ఇంటి ముందునా, ఒక వీధి నుంచి ఇంకోవీధి పొడువునా, వారాణాసీ నగరం అంతటా ఊరేగించారు. దక్షిణ ద్వారం వచ్చింది. అప్పటికి వారిని తీసుకువెళ్లారు. ఈనగరం దక్షిణముఖం ఎటువుందో అటు తిరగమన్నారు. వారు తిరిగారు. దిఘితిని రెండుగా భటులు నరికారు. కోసల పట్టమహిషిని రెండు తుండాల క్రిందకోశారు. ఒకొక్క దిక్కున ఒకొక్క ముక్కను బలిఇచ్చి, పహారావాళ్లను కాపలాకు పెట్టి, వెళ్ళిపోయారు.

కుమార దీర్ఘాయువు సర్వమైన ఈ ఘోరాన్ని తన కళ్లతో చూచాడు. ఏతల్లిని, ఏతండ్రిని చూద్దామని గంపెడు ఆశతో వచ్చాడో, ఆతల్లి ఇప్పుడు లేదు; ఆతండ్రీ ఇప్పుడు లేడు! అంతా అయిపోయింది. ఇక దహనక్రియలు మిగిలివున్నాయి. ఆశవఖండాలను ఎవ్వరూ ఎత్తుకుపోకుండా, కాశీ రాజు కాపలాకూడా పెట్టించాడు.

★ దీర్ఘాయువు ★

ఎట్లా వాటిని సాధించాలి? ఎట్లా తల్లికీ, తండ్రికీ ఉత్తర క్రియలు జరపాలి!

కుమార దీర్ఘాయువు దీర్ఘాలోచనా నిమగ్నుడైనాడు. ఆలోచించగా, ఆలోచించగా అతని మనస్సు కలత దేరింది. అతనికి ఒక దారి కన్పించింది. ఈ కాపలావాళ్లు వున్నారే వారికి సారాయము లంటే మహాఇష్టం. తనకు ఆసంగతి తెలుసు. ఈమార్గం మనస్సులో మెదలగానే, దీర్ఘాయువు బజారుకు వెళ్ళి, ఇంత సారాయం కొనుక్కొవచ్చి, నగరం నాల్గుదిక్కుల్లో బలిగావుంచిన మాతాపితృ శవ ఖండాలకు కాపలావున్న భట జనానికి కడుపునిండుగా పోసి, వారికి బాగా మత్తుఎక్కిన తర్వాత ఆశవ ఖండాలను తీసుకొని వెళ్లి, కట్టెలు తెచ్చి, చితిని పేర్చి, వాటిని దాని మీదవుంచి కొరవి ముట్టించి, అనంతరం ఆచితికి మూడుసార్లు, చేతులు జోడించుకొని, ప్రదక్షిణం చేసి, తన బసకు వెళ్లిపోయాడు.

కుమార దీర్ఘాయువు ఈక్రియ నంతా జరుపుతున్నప్పుడు కాశీరాజు బ్రహ్మదత్తుడు మహల్ మీద వున్నవాడు, ఇదిఅంతా చూచాడు. అతనిమనస్సుకు ఇట్లా అనిపించింది. "ఈవ్యక్తి ఎవ్వరు? కోసలరాజు జ్ఞాతి ఎవ్వడో అయివుంటాడు. అందులో అనుమానం ఏమీ లేదు. దిఘితికి ఇతనికి ఏదో రక్తసంబంధం వుండి వుంటుంది. ఇది నాకు ఏదో అనర్థంవలె కన్పిస్తోంది. దిఘితి జాతి వాడు ఒకడు అంటూ, ఈనగరంలో వున్నట్లు ఎవ్వరు చెవిని పడవేయక పోవడం విచిత్రం!

6

దీర్ఘాయువు తల్లిదండ్రుల దహన సంస్కారాదికాలు పూర్తి చేసుకొని వెంటనే అరణ్యానికి వెళ్లిపోయాడు. అతనికి కాశీలోవుండి ఏమి చెయ్యాలో తోచలేదు. కాశీరాజు తన తల్లితండ్రులకు చేసిన ఈపనికి ప్రతీకారం చేయడం ఎట్లాగా అని అతడు తెగ ఆలోచించాడు. కాశీలో అంత అవమానాన్ని భరిస్తూ కూడా తన తండ్రిదిఘితిఅన్నమాటలు, "తాత! దీర్ఘాయువా! వైరంచేత వైరం శాంతి పొందదు. అవైరంచేతనే వైరం శాంతిస్తుంది" అని అన్నమాటలు ఇంకా చెవుల్లో గింగురుమంటున్నాయి. అవైరంచేత వైరాన్ని ఎట్లా శాంతిపజేస్తాను! ఎట్లా తండ్రి ఈవాక్యాన్ని పాలిస్తాను! అని దీర్ఘాయువుకు తన తల్లిదండ్రులను కాశీరాజు బ్రహ్మదత్తుడు చంపించిన విధం అంతా కళ్లముందు ఆడింది. అతనికి దుఃఖం పొంగివచ్చింది. బిగ్గరగా ఏడ్పువచ్చింది. భోరున ఏడ్చాడు. మనస్సులో దుఃఖభారం కొంత శమించింది. తిరిగి ఆలోచించాడు, "ఏమి చెయ్యాలి ఇప్పుడు నేను! ఎట్లాగయినా కాశీరాజు దర్బారులో చేరి వైరమార్గం యొక్క నిర్వీర్యతను, అవైరమార్గం యొక్క ఉన్నతత్వాన్ని బ్రహ్మదత్తునికి చూపించాలి" అది తన తండ్రి దిఘితి మార్గం. అది ప్రశస్తమైనట్టిదని లోకకల్యాణ సంధాయకమైనట్టిదని వైరి బ్రహ్మదత్తునికి చూపించాలి.

కుమార దీర్ఘాయువు అన్ని విద్యలలోను ఆరితేరినవాడు. బ్రహ్మదత్తుడికి సంగీతం అంటే ఇష్టం. బ్రహ్మదత్తునికి ఒక కూతురు వుంది. ఆమెకు కూడా సంగీతం అంటే ఇష్టం. వారణాసిలో అందరికీ రాజుగారి ఈ అభిరుచిసంగతి తెలుసు. దీర్ఘాయువుకు కూడా తెలుసు. అయితే హేమాహేమీల లాంటి పండితులు రాజదర్శనంకోసం పడిగాపులుకాస్తూ వుండగా, తనకు ఆ దర్శనం ఎట్లా లభ్యమవుతుంది?

దీర్ఘాయువు ఒక ఆలోచన చేశాడు. ఆ ఆలోచనప్రకారం నడిచాడు. కాశీరాజుకు దుర్గంలోనే ఏనుగులశాల వుంది. దీర్ఘాయువు నగరానికి తిరిగివచ్చి, రాజుగారి దుర్గంలో ప్రవేశించి, ఏనుగులశాల అధికారి మహావతుణ్ణి కలుసుకుని "ఆచార్యా! మీవద్ద నేను గజశిక్షణ నేర్చుకుంటాను" అన్నాడు. మహావతుడు 'సరే' నన్నాడు. "కుఱ్ఱవాడ! అట్లాగే నేర్చుకో" అన్నాడు. దీర్ఘాయువు గజశాలలోనే మకాం పెట్టాడు. పగలల్లా గజశిక్షణ; రాత్రి అవుతుంది. ప్రొద్దు పోతుంది. దీర్ఘాయువు కంఠం విప్పిమంజులంగా పాటలు పాడుతాడు. వీణను తీసుకొని మధురంగా వాయిస్తాడు. కాశీరాజ బ్రహ్మదత్తుడు రాత్రిపూట ప్రొద్దుపోయిన తర్వాత మహాలుమీద పచారులు చేస్తూ వుంటాడు. దీర్ఘాయువు మృదుమధురసంగీతం ఆయన చెవుల పడుతుంది. దీర్ఘాయువు వీణ

మెట్లను నొక్కుతూ సృష్టించే మోహన గాంధర్వం బ్రహ్మదత్తుణ్ణి సమ్మోహితుణ్ణి చేస్తుంది. ఒకసారి. రెండుసార్లు; చాలాసార్లు రాత్రి వేళల్లో కాశీరాజు, కాశీరాజు కూతురు కుమార దీర్ఘాయువు సంగీతం విన్నారు. బ్రహ్మదత్తుడు ఇక తన కుతూహలాన్ని ఆపుకో లేకపోయాడు. బ్రహ్మదత్తుని కూతురు తన మనస్సును ఆపుకో లేక పోయింది. రాజు ఒకరోజున తన మనుష్యులను పిలిచి "ఒరే; ఎవర్రా! రోజూ గజశాలలో రాత్రి పూట సంగీతం పాడుతారు; వీణ వాయిస్తారు" అని వారిని అడిగాడు.

"ప్రభూ! మహావతుని శిష్యుడు: కుజ్జవాడు, రోజూ సంగీతం పాడుతాడు. వీణ వాయిస్తాడు"

"అట్లాగా! అయితే ఆకుజ్జవాణ్ణి నాదగ్గరకు తీసుకు రండిరా"

"చిత్తం! మహారాజా!" అని భటులు రాజుకు ప్రత్యుత్తరం ఇచ్చి, వెళ్లి, కుమార దీర్ఘాయువును వెంట పెట్టుకు వచ్చారు.

"అరే! అబ్బాయి! రోజూ రాత్రిపూట నువ్వేనా మంజుస్వరంతో సంగీతం పాడుతూ, వీణ వాయిస్తూవున్నది?"

"అవును! మహారాజా!"

"అయితే! కుజ్జవాడా! ఏదీ నీమంజుస్వరంతో ఒకపాట పాడి; వీణ వాయించు!"

"చిత్తం! మహారాజా"

దీర్ఘాయువు తన ప్రతిభనంతా కంఠంలోపెట్టి మంజుస్వరంతో సంగీతం పాడాడు. దివ్యంగా వీణ వాయించాడు. బ్రహ్మదత్తుడికి రోమాంచం అయింది. బ్రహ్మదత్తుని కూతురుసంగతి చెప్పనే అక్కరలేదు.

"అరే! అబ్బాయి! నువ్వు నా సేవలో చేరరా"

"చిత్తం! మహాప్రభూ" అని దీర్ఘాయువు బ్రహ్మదత్తుడుకి జవాబు ఇచ్చాడు. బ్రహ్మదత్తుని కొలువులో చేరాడు. చేసిన ఆలోచన చేసినట్లు ఫలించింది.

[ఇంకా వుంది]

★ చెట్టు ★

(22 వ పేజీ తరువాయి)

గబగబా మెట్లు దిగాడు. అమాంతం చెట్టుని కౌగిలించుకోవాలనిపించింది. కాని తను మనిషి ఆకారంలో ఉన్న విషయం గుర్తుకొచ్చింది...యీ ఆకారంలో ఏ పనీ స్వేచ్ఛగా చేయడానికి వీలులేదు.

తిన్నగా పోయి తన బల్లముందు కూర్చున్నాడు. కాగితాలు బరువుగా పడి ఉన్నాయి. పై కట్టతో ప్రారంభించాడు. చెట్టుమీద మొదటి గొడ్డలి దెబ్బ పడింది. గుండెమీద తగిలినట్లనిపించింది. ప్రతి దెబ్బా, తనకే తగులుతోంది. మనస్సు కొంకర్లు పోతోంది.

చేతిలో కలం ఆడుతోంది. ఏం రాస్తున్నాడో తెలియదు. చెట్టు మీద దెబ్బలు పడుతున్నాయి గబగబా. దాని కేసి చూడ్డానికి కూడా భయం వేసి తలవంచుకు రాసేసుకుంటున్నాడు. చెట్టు పడిపోతుందేమో, ఓసారి అటు చూస్తే... అమ్మో! యింకేమన్నా ఉందా. పోనీ ఆఖరిసారి పడిపోకముందు...

"ఏమయ్యా! ఆకాగితం అయిందా" గుమ్మాస్తాకి వినపడింది గొంతుక. పై అధికారి పై అధికారిది ఆ గొంతుక. యివేళ తనపై అధికారి శలవు. అందుకుని కేవలం పెద్ద దొరగారే స్వయంగా అడుగుతున్నారు.

చేతిలో ఉన్న కాగితం, సరిగా చూసుకోడానికేనా వ్యవధిలేదు. పంపేశాడు పైకి. చెట్టుపడిపోతుంది కాబోలు కానీ పటిలో...పాపం! చెట్టుకి మాటలు కూడా రావు. ఎవరేనా ఒక దేవుడు, ఒక మహాశక్తి, ఆ చెట్టుని పడకుండా ఆపకూడదూ! ఏదైనా జరగకూడదూ. అప్పుడు వాళ్ళంతా గొడ్డళ్ళు కిందపడేసి, అయ్యా యీ చెట్టు పడదండీ, యిదేదో మహాశక్తి - అని చెప్పేస్తే - దొరగారు విస్తుపోయి చేసేదేమీ లేక ఊరుకోవాల్సిందేగా అప్పుడెంత బాగుంటుంది...యిదంతా భ్రమ - పగటికల...యీ చెట్టుపడిపోతుంది. తిప్పడు. "బాబూ! అయ్యగారు రమ్మంటున్నారండీ తవుర్ని - "ప్యూన్ వచ్చి చెప్పాడు. వాడి అయ్యగారంటే పెద్దదొరగారే! ఎందుకు పిల్చారో! వెళ్లాడతను.

ఏమిటయ్యా! యీరాత, నువ్వు ఏ ప్రపంచంలో ఉన్నావ్. ఏమిటి రాత. వళ్లు పొగరెక్కి - ఉగ్రుడయిపోయాడు అధికారి. గడగడ వణకిపోయాడు తను. ఆ కాగితం తీసుకుని చూశాడు...

"అందాన్ని దారుణంగా హత్య చేసేస్తున్నారు. పచ్చగా బతికే చెట్టుని ప్రకృతితో పరిచయంలేని పరమమూర్ఖులు, పుస్తకాలు తప్ప ప్రపంచం ఎరగని పెద్దమ్మలు-కొట్టేస్తున్నారు." ముచ్చెమటలు పోసేశాయి అతనికి. తనకి తెలియకుండా నే రాసేశాడీ మాటలు, అఫీసు నోటు రాద్దామనుకుంటూ. బుర్ర పని చెయ్యడంలేదతనికి.

"ఊఁ. ఇందాకా వచ్చిందన్న మాట... నిన్నగాక మొన్న వచ్చి, నీపై అధికారులు మూర్ఖులు - నువ్వు మహాజ్ఞానివి... యింక చాలు నీ ఉద్యోగం......దయ చెయ్యి." కాగితం తీసుకొని బల్లమీద గట్టిగా పడేసి - దర్జాగా వెళ్ళిపోయాడు అధికారి.

అతని కర్థం కాలేదు...ఏ స్థితిలో ఉన్నదీ. అప్రయత్నంగానే బయటికి వచ్చేశాడు. చెట్టు కొట్టడం పూర్తి అయింది... పెద్దశబ్దం చేసుకుంటూ దభీమని పడిపోయింది - వేళ్ళతో సహా - ఆ 'అందమయిన' వృక్షరాజం. ★

★ ముచ్చటగా ముగ్గురు ★

(35 వ పేజీ తరువాయి)

అటూ యిటూ తిరగటంలో హారిస్సుగాడు పొరపాటున జార్జిగాడి మడిమెలమీది ఒరిపిడి కాయలని తొక్కేశాడు. ఈపనే భోజనాత్పూర్వం జరిగివుంటే, నిజంగా ఆజార్జిగాడు తారామండలానికి ఎగిరేవాడే. ఇంత తప్పుడు పని చేసినందుకు హారిస్సుగాడికి యీలోకంలోనూ పైలోకంలోనూ కూడా పుట్టగతులు లేకుండా చేస్తానని శపథం పెట్టేసేవాడు. ఇంకా ఏమేమి చేసివుండేవాడో వూహించుకొంటేనే, నాలాంటి సున్నితమైన మనస్సుగల మనిషికి చలిజర్వం వచ్చేస్తుంది.

అటువంటిది, వూరికే "జాగ్రత్తరా అబ్బాయి; గోధుమపిండిడబ్బా తన్నెయ్యగలవు!" అని ఒక్క చిరునవ్వు నవ్వి వూరుకొన్నాడు.

హారిస్సుమాత్రం ఏం తక్కువ తిన్నాడు? కడుపు ఖాళీగావున్నప్పుడు జార్జిగాడు అలాంటి దురుసు మాటలు మాట్లాడితే గుక్క తిప్పుకోవటానికి వీలు లేకుండా వీడూ ఛడామడా నాలుగూ పెట్టేవాడే. గడవాసంఅంతపొడుగున కాళ్లు పెట్టుకొని దారికి అడ్డంగా కూర్చుంటే జార్జిగాడికి చుట్టుపట్ల పదిగజాల దూరంలో ఎవరు కదలాలన్నా వీడి మడిమెలు తొక్కక తప్పదనే వాడే. అలాంటిది—వీడికీ కడుపునిండి మనస్సు వుల్లాసంగా వుండేమో — "చ్...చ్...చ్...! నీ మడిమె తొక్కేసినట్లున్నారా బ్రదర్? నొప్పి ఏమైనా వేస్తోందో" అని యెంతో అప్యాయంగా అడిగాడు.

జార్జి తనకేమీ నొప్పి పుట్టలేదని అంటూ అసలు అలా కాళ్లు బారజాపుకు కూర్చోవటం తనదే తప్పు అన్నాడు. జార్జిగాడు కాలుజాపుకు కూర్చుంటే మటుకు తను కళ్లు తెరుచుకు నడవ వలసిందని హారిస్సు తెగ నొచ్చుకొన్నాడు. 'తప్పంతా నాదే' నంటే 'తప్పంతా నాదే' నని యిద్దరూ కాసేపు ఒకరినొకరు మన్నన చేసుకొన్నారు.

వాళ్ల ఆధోరణి వినటానికి చాలా చమత్కారంగా వుంది.

(ఇంకావుంది)

నాన్నగారి స్నేహితుడు

(37 వ పేజీ తరువాయి)

వొచ్చావ్?" అని అంటూ, చేతిలోని సూట్ కేస్ అందుకున్నాడు.

"అసలు వుత్తరం చేరిందో లేదో అని, అనుమానంతో బండి దిగి నేరుగా వొచ్చేశాను...నువ్వొస్తావనుకోలేదు అని అంటూనే వున్నాను. మా నాన్నగారి మిత్రుడు యెవరోన్న కేకేస్తూ తిన్నగా జనంలో కలిసి పొయ్యారు.

రామారావు వారిని యెగాదిగా చూచి - "యీయనెవర్రా నీవెరుగుదువేం?" అని అడిగాడు.

"మా నాన్నగారి మిత్రుడోయ్. కలకత్తాలో బిసినెస్ చేస్తున్నారు"

"ఆఁ......హా? అలాగా!"

"వారి పేరూ?"

యేంజవాబు చెప్పాలో తోచలేదు. అసలు వారి పేరడగమే మరిచిపోయాను.

"అదేమిట్రా? పేరడిగితే అలా చూస్తావేం?"

"అదేరా...అడగడం మరిచాను"

"నీకు తెలీదేమిటి. మీ నాన్నగారి మిత్రుడంటున్నావ్""

"నాకు తెలిదురా. ఆయనే చెప్పాడు, మా నాన్నగారి స్నేహితుడని"

"అలారావోయ్ దానికి... ఐతే హోటలు బిల్లు యెంత వొదలిందేమిటి?" అని ఫకగబడి నవ్వసాగాడు.

అసలు తేలినవిషయమేమిటంటే, అతగాడిది ఆప్రాణేసట. యిలాగె కొత్తవారికి టోపీవేసి హోటల్ బిల్లు తగలగడుతూ వుంటాడట. కాని, నేను నమ్మలేకపోయాను.

"అయితే, మమ్మల్నందర్నీ తెలిసినట్టే మాట్లాడాడురా"

"అలాగే మాట్టాడతాడు. అవులిస్తే పేవులు లెక్కబెట్టే రకం."

"అయినా, మాగురించి అతగాడికెలా తెలుసంటావ్?"

"అతగాడికి తెలిసిందేమిటి? అన్నీ నీదగ్గరే రాబట్టి వుంటాడు.

మా యిద్దరి మధ్యా జరిగిన సంభాషణంతా నెమరేసుకున్నాను. రామారావుగాడికి అన్నీ, వొక్కటి మరిచిపోకండా, వరసగా వొప్పజెప్పాను. వాడు కూడా ఆశ్చర్యపడకండా వుండలేకపోయాడు.

ఇంతకీ మమ్మల్ని ఆశ్చర్యపెట్టిన విషయాలేమిటంటే - ఒకటి; నేను కారంపూడి వాళ్ళ అబ్బాయిననీ- రెండు; మా సోదరుల్లో వొకాడు ఫలానా యిన్స్యూరెన్సు ఏజెంటుగా పనిచేస్తున్నాడనీ,- మూడు; మా అన్నయ్య పేరు రాజారావనీ ఇతగాడికెలా తెలుసు?-అన్నది.

ఇవన్నీ అతగాడు స్వతహాగా అడిగిన విషయాలు.

మేము బుర్రలు బద్దలు చేసుకున్నాం కాని, అది మాత్రం తేల్చుకోలేక పోయాం.

భోజనానంతరం, ఇద్దరం, రామారావుగాడి ఆఫీసురూములో కూచుని కబుర్లు చెప్పుకుంటున్నాం. మధ్యలో రామారావుగాడి దృష్టి టేబుల్ మీదున్న నా సూట్ కేసు మీద పడింది.

క్షణం అలా చూచి, అదా సంగతి?" అని, పకపకా నవ్వసాగాడు.

"ఏమిట్రా. యెందుకలా నవ్వుతావ్. యేమిటి సంగతి?" అని అడిగాను.

"అదేరా, ఆ పెద్దమనిషికి ఆవిషయాల ఆచూకీపట్టిచ్చిందెవరో తెలుసా?"

"ఎవరేమిటి?"

"అదే...ఆసూట్ కేస్"

సూట్ కేస్ వేపు చూచాను. దానిమీద:

"కారంపూడి రాజారావ్. ఛీఫ్ ఏజెంట్

ఇంద్రా ఇన్స్యూరెన్సు కంపెనీ లిమిటెడ్ యస్. ఇండియా." అని, పెయింట్ చేసి వుంది.

అవసరానికి, అన్నగారి సూట్ కేస్ పట్టుకొచ్చినందుకు యింత పని చేసింది గదా అనుకున్నాను

★

"ఒరే రాముా! మనకో తమ్ముడు పుట్టాడురా"

"అట్లయితే ఉండక్కా! ఓపరుగువెళ్లి అమ్మకీసంగతి చెప్పొస్తా"

—సావిత్రి-సామిరెడ్డి పల్లె.


* * *

రమణ: అమ్మా నాకు తలనొప్పి రోజూ వస్తున్నదే. నే నివ్వాళ బడికి వెళ్లనే.


రమణ తల్లి: నీ కెక్కడ తలనొప్పి వస్తున్నదిరా?

రమణ: బడిలోనే నే!

రాధాక్రిష్ణమూర్తి, తెనాలి.



"దోబిఘాజమీన్" హిందీ చిత్రంలో నిరూపరాయ్, ఎల్ రాజ్ సహానీ, రతన్ కుమార్, నానా పల్సికర్ అత్యుత్తమ వాస్తవిక చిత్రమని పలువురు శ్లాఘిస్తున్న ఈ చిత్రాన్ని బిమల్ రాయ్ డైరెక్టు చేశాడు. బొంబాయి మెట్రో థియేటర్లో ఒక్క వారంలోనే 36 వేల రూ॥ల దాకా సేకరించి ఉత్తమస్థాయికళకూ, ప్రజానీకానికీ వంతెన కట్టింది యీచిత్రం



నల్లమందు మింగిన రేఖను ఆస్పత్రిలో చేర్పించారు
రోహిణీవారి ప్రొ॥ నెం. 9 లో జయ, జమున, లూసీ.


"పిచ్చిపుల్లయ్య" సమీక్ష

గత మాసం 17 వ తేదీన విడుదల అయిన నేషనల్ ఆర్ట్సువారి "పిచ్చి పుల్లయ్య" చిత్రం ఇటీవల వాహినీ స్టూడియోలో పత్రికలవారికి, తదితర అతిథులకు చూపించారు.

ఎన్. టి. రామారావు గారి సోదరుడు, త్రివిక్రమరావుగారు ఈచిత్రంనిర్మాత. డైరెక్టరు తాతినేని ప్రకాశరావు గారికిది రెండవ చిత్రం. కథ, సినేరియోకూడా ప్రకాశరావుగారే తయారుచేశారు. ఎన్ టి. రామారావు, గుమ్మడి వెంకటేశ్వరరావు, రమణారెడ్డి, అమర్‌నాథ్, అప్పయ్యా చౌదరి, మహంకాళి వెంకయ్యా, జానకి, కృష్ణకుమారి, ఛాయాదేవి మొదలగువారు నటించారు. కెమెరా రహమాన్; సంగీతం రాజు; మాటలు, పాటలు అనిశెట్టి సుబ్బారావు చాల తెలుగుచిత్రాలకంటె స్వల్పకాలంలో చిత్రం తయారుచేసి విడుదల చేయగలిగినందుకు నేషనల్ ఆర్ట్సువారిని అభినందించవలసి వుంది.

ఆకారానికి, చేష్టలకి పిచ్చి పుల్లయ్యాగా కనిపించినా, హృదయాన్నిబట్టి "మంచికి మారుపేరు" అనదగ్గ పుల్లయ్యా అనే పల్లెటూరి అమాయకుణ్ణి ప్రధాన పాత్రగా తీసుకుని ప్రకాశరావుగారు ఈ కథ వ్రాశారు. కథ వ్రాయడంలో, ఆయన సునాయాసమైన పద్ధతులవలంబించినట్లు తోస్తుంది. ఆయన స్వయంగా కల్పించి వ్రాసిన సన్నివేశమంటూ ఒక్కటీ ఈ చిత్రంలో కనిపించలేదు ప్రతి తెలుగుచిత్రానికీ సర్వసామాన్యమైపోయిన సంఘటనలనూ, సన్నివేశాలనే తీసుకుని గుదిగుచ్చి కథ నడిపించారు. ఎప్పటికప్పుడు కొత్తదనంకోసం అర్రులు చాచే ప్రేక్షకులకు ఈ చిత్రం ఆశాభంగం కలిగిస్తే ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు.

పుల్లయ్యా పల్లెటూరి అమాయకుడు. అతడు బస్తీలో జమీందారిణి మనోరమాదేవిగారింట్లో పనిపాటలు చేసేందుకు వెడతాడు. మనోరమాదేవియింట్లో ఆమె సవతికొడుకు చినబాబు, అతని భార్య వసంత, దాసీపిల్ల కాంతం, మనోరమతో రహస్య సంబంధం కలిగివుండి ఎస్టేటంతా నిరంకుశంగాపాలిస్తున్న భూపాలరావుఉంటారు. ఈయింట్లో వచ్చిపడ్డ పుల్లయ్యా అందరికీ తలలో నాలుకగా మెలగుతూ వుంటాడు గాని, ఒక్క భూపాలరావుమాత్రం అతన్ని చూసి కంటగించుకుంటాడు. వసంత అంటె కూడా అతనికి పడనందున వసంతకూ, పుల్లయ్యాకూ సంబంధం ఉన్నదని ప్రచారు వేస్తాడు. సవతితల్లికూడా అదేమాట అన్నందున చినబాబు వసంతను ఇంట్లోనుంచి వెళ్లగొట్టేస్తాడు. గర్భిణిగావున్న ఆమెను



ఎమ్. ఆర్. ఎ. వారి "లేడీ డాక్టర్"లో విజయకుమార్, రాజారెడ్డి, కృష్ణవేణి.

★ "పిచ్చిపుల్లయ్య" సమీక్ష ★

పుల్లయ్య ఆమెను తన ఊరు తీసుకు వెళతాడు. ఆమె అక్కడే పురుడు పోసుకుంటుంది. కాలక్రమేణా చినబాబు నిజం తెలుసుకుని పశ్చాత్తాపపడతాడు. మనోరమా దేవికూడా స్వతహాగా మంచిమనిషే. అయినందున భూపాలరావు అకృత్యాలు తెలుసుకుని అతనిపై ఎదురు తిరుగుతుంది. భూపాలరావు ఆమెకు విషప్రయోగం చేయబోతాడు. దాసీపిల్ల కాంతం ఈ అపాయం తప్పిస్తుంది. తను చేసిన నేరాలన్నీ భూపాలరావు పుల్లయ్యపై తోయాలని చూస్తాడు గాని చివరికి అతనిపై నేరాలు ఋజువై శిక్ష అనుభవిస్తాడు. చినబాబు, వసంత తిరిగి కలుసుకుంటారు. పుల్లయ్యకూ, అతన్ని ప్రేమించిన కాంతానికీ పెళ్ళి అవుతుంది. అంతా సుఖంగా వుంటారు.

ఈ చిత్రంలో దాదాపు ప్రతిపాత్రా ఇదివరకు ఏదో ఒక చిత్రంలో చూసిందే. కథకుడు తన పాత్రలను జీవితంలోనుంచి ఏరి తీసుకోవడానికి బదులు పాత సినిమాలలోనుంచి తీసుకోవడానికి ప్రయత్నించారు. పుల్లయ్య పాత్రలో కొంచెం కొత్తదనం కనిపించినమాట నిజమే. అయితే ఆ కొత్తదనం పుల్లయ్యగా నటించిన ఎన్. టి. రామారావువల్ల వచ్చిందిగాని పాత్రలో స్వతహాగా లేదు. సాధారణంగా హుందా అయిన పాత్రలు ధరించే రామారావు ఈ అమాయక పాత్రనుకూడా సమర్థతతో నిర్వహించడం వల్ల ఈ కొత్తదనం కలిగింది.

భూపాలరావువంటి విలన్ పాత్రలను, దుర్మార్గమే వృత్తిగా పెట్టుకున్న విలన్లను ఎంతమందిని ఎన్ని చిత్రాల్లో చూడలేదు? అలాగే ఏపాత్ర తీసుకొన్నా మనకు చిరపరిచితమే. సన్నివేశాలు తీసుకొన్నా అంతే. పుల్లయ్యకూ, వసంతకూ సంబంధం అంటగట్టడం, భర్త ఆమెను ఇంట్లోనుంచి వెళ్ళగొట్టడంవంటి ముఖ్య సంఘటనలనుండి ప్రతి చిన్న సన్నివేశమూ ప్రేక్షకులకు ఏ చిత్రంలోనో చూసినదానివలెనే కనిపిస్తుంది.

ఇంత సర్వసాధారణమైన కథ తీసుకున్న తరవాత దర్శకత్వంకూడా అలాగే వుండడం సహజం. దర్శకుని కిది ప్రథమ ప్రయత్నం కాకపోయినా ప్రథమ ప్రయత్నంలోని లోపాలు ప్రతిచోటా కనిపిస్తాయి. మూడు నాలుగు సన్నివేశాలకు క్లైమాక్స్ ప్రాధాన్యమివ్వడంతో ఏదీ వక్కి కట్టలేదు. కథ ఎలా అంతమవుతుందో మొదటినుంచీ ప్రేక్షకులకు తెలిసిపోతుంది. పుల్లయ్యవంటి మంచివాణ్ణి, భూపాలరావువంటి చెడ్డవాణ్ణి చూపించిన తరవాత, పుల్లయ్యకు ఎన్ని కష్టాలు వచ్చినా చివరికి జయిస్తాడనీ, భూపాలరావు జైల్లో పడతాడనీ ఊహించడం కష్టంకాదు. ఇటువంటి పాత్రలను తెలుగు కథకులు కొంతకాలంపాటూ వదిలివేసి ఇంతకంటె 'కాంప్లెక్స్' పాత్రలను ప్రయత్నించడం మంచిది. భార్యలను అనుమానించడం, విషప్రయోగాలు చేయడం, కోర్టుదృశ్యాలూ, పోలీ



నిజంగా దొంగతనం చేసినప్పుడు పటుపడలేదు—న్యాయానికి పోవడం తప్పు అయింది—

మద్రాస్ ఆర్ట్ ప్రొడక్షన్స "రోహిణి"లో ఎస్. ఎ. నటరాజన్, మాధురి, సహస్రనామం.

సులు, డాక్టర్లు, నర్సులు, ఇత్యాది సాధారణ విషయాలను కూడా కొంతకాలం మాని వేయడం మంచిది. ఏ పాత్రకు మానసిక క్లేశం కలిగినా బయట తుపానులు, ఉరుములు, మెరుపులు చెలరేగుతున్నట్లు చూపడంకూడా మాని వేయాలి. ఎందుకంటే ప్రేక్షకులలో పలువురు ఈమాదిరి దర్శకత్వంలోని కృత్రిమత్వాన్ని పసికట్టగలుగుతున్నారు. ఈ కృత్రిమత్వం ఒకచోట స్పష్టంగా కొట్టవచ్చినట్లు కనిపించింది. వసంత తండ్రి యింటినుంచి భర్తకు వ్రాసిన ఉత్తరాలన్నీ భూపాలరావు బైటకు రాకుండా నొక్కిపడతాడు. అవన్నీ బల్లమీద ఒక అట్టకింద దాచిపెడతాడు. వాటినిచూసి మనోరమాదేవి భూపాలరావు దుర్మార్గం గ్రహిస్తుంది. డిటెక్టివ్ నవలల్లో అపరాధి ప్రత్యేకం డిటెక్టివ్ కోసం కొన్ని గుర్తులు వదిలిపెట్టినట్లు, భూపాలరావు ఆ వుత్తరాలను చించి పారెయ్యకుండా దాస్తాడు. ఇటువంటి కృత్రిమాంశాలతో కథ రక్తి కట్టించడం అసంభవం.

ఎన్. టి. రామారావు పుల్లయ్యగా [illegible]గా నటించారు. జానకి "షావుకారు" తరువాత మళ్ళీ ఈ చిత్రంలో ప్రేక్షకులకు తృప్తికలిగేటట్లు నటించింది. ఈమెనుండి ఇంకా మంచి నటన రాబట్టవచ్చు. రమణారెడ్డి హాస్యనటనలో కృతకృత్యులయ్యారు. "సినిమా విలన్"గా గుమ్మడి వెంకటేశ్వరరావు చక్కగా సరిపోయారు.

సంగీత దర్శకుడు రాజా ఇచ్చిన సంగీతం ఆహ్లాదకరంగానే వున్నది. కొన్ని చోట్ల నేపథ్యవాద్యాలు మోతాదు మించి వున్నవి. పాటలు కొన్ని, హిందీపాటలను జ్ఞాపకంచేశాయి. ముందు ముందు ఆయన ఇంకా మంచి సంగీతం ఇవ్వగలరని ఆశ కలుగుతున్నది.

కొత్తగా సినిమా నిర్మాణ రంగంలోకి దిగేవారు ఏదో కొత్తదనం సాధిస్తారని మనం ఆశించడం సహజం. కొత్త నిర్మాతలుకూడా పాత నిర్మాతల పద్ధతులనే అనుకరిస్తే ఆశాభంగం కలుగుతుంది. అందరితోపాటు ఏదో సినిమా తీశామంటే తీశామని కాక, విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడానికి కొత్తవారు ప్రయత్నించాలి. అభ్యుదయ భావాలుగల నేషనల్ ఆర్టిస్ట్స్ వారు అందుకు సమర్థులై వుండికూడా అవకాశం జారవిడిచారు. ఈ సంస్థవారు ముందు ముందు మంచి చిత్రాలు తీస్తా ఆశిస్తున్నాము.

ఫిలిం ఫెడరేషన్ దినోత్సవం

రాజాజీ ఉపన్యాసం

ఆగస్టు 6వ తేదీన భారత ఫిలిం ఫెడరేషన్‌వారు భారతదేశమంతటా ఫెడరేషన్ దినోత్సవం జరిపారు. మద్రాసులో, వాహినీ స్టూడియోలో ఈ ఉత్సవం జరిగింది. ప్రొడ్యూసర్లు, స్టూడియో అధిపతులు, తారలు, తదితరులు పలువురు హాజ



పారమౌంట్ వారి "ఖోటనీ బే" టెక్నికలర్ చిత్రంలో ఎలాన్‌లాడ్, పెట్రీషియా మెడీనా, జేమ్స్ మేసన్.

★ ఫిలిం ఫెడరేషన్ దినోత్సవం ★

ర్పాటు చేశారు. దక్షిణభారత ఫిలిం వాణిజ్య మండలి, దక్షిణ భారత స్టూడియో అధిపతుల సంఘం ఆధ్వర్యాన సభ జరిగింది. ఎస్. ఎస్. వాసన్ అధ్యక్షత వహించారు.

మద్రాసు ముఖ్యమంత్రి రాజగోపాలాచారిగారు ఈ సందర్భంలో తమ అభిప్రాయాలు వెల్లడిస్తూ ఉపన్యాసం చేశారు. ఆంధ్రరాష్ట్ర విభజన, విద్యావిధానం, చేనేత పరిశ్రమ మొదలగు ప్రధాన సమస్యలు తీరిపోగానే, ఫిలిం పరిశ్రమపై పన్నులభారం తగ్గించాలనే ఆందోళనను గూర్చి ఆలోచిస్తామని హామీ యిచ్చారు.

సినిమాలకు తరచు వెళ్లవద్దని తాను ఇచ్చిన సలహా, తక్కువ జీతాలు తెచ్చుకునే కార్మికులకేననీ, సినిమాల్లో ఎక్కువ భాగం సెక్సు అప్పీలు కలిగినవై ఉండడం చేతనే తాను ఈ సలహా ఇచ్చివున్నాననీ, సెక్సు అనేది మానవునికి అంత ప్రధానమైన విషయం కాదనీ ఆయన అన్నారు. రంగులపై ప్రజలకు, ముఖ్యంగా ఆడవాళ్లకు మోజు అధికం గనుక ఇండియాలో రంగుచిత్రాలు అధికంగా తయారు కావాలని ఆయన చెప్పారు. ఇప్పటి చిత్రాలలో సంభాషణలు అధికంగా ఉంటున్నాయనీ, సంభాషణలను బాగా తగ్గించాలనీ, మన చిత్రాలు దాదాపు చార్లీ చాప్లిన్ సైలెంటు చిత్రాల్లాగ ఉండాలనీ కూడా ఆయనన్నారు.

"నేను ఫిలిం పరిశ్రమకు శత్రువును కాననీ, మీ పరిశ్రమనాశనం కావాలని నేను కోరడం లేదనీ స్పష్టం చెయ్యదలుచుకున్నాను. ఈ పరిశ్రమలోనివారు అత్యధిక ధనార్జన చేయడం కూడా నాకు అయిష్టం కాదు. ఎందుకంటే వాసన్‌గారు చెప్పినట్లు మీరెంత ఎక్కువ డబ్బు సంపాదిస్తే రాష్ట్ర, కేంద్రప్రభుత్వాలు అంత ఎక్కువ రాబడి తెచ్చుకుంటాయి. కనుక మీ డబ్బుపైనాకు ద్వేషంలేదు. నేను భయపడుతున్నదల్లా ఒకటే. సినిమాలవల్ల ప్రజల మనస్తత్వాలలో కలిగే దుష్పరిణామాలే నా భయకారణం. ఒకవేళ నాది దురభిప్రాయం కావచ్చు. సినిమాలవల్ల ప్రజలు చెడిపోకపోవచ్చు. అయినా నా సందేహాలు నాకున్నాయి.

ఈ పరిశ్రమలోని వారు పడుతున్న అవస్థలు, ఎదుర్కొనే కష్టాలు నాకు తెలియకపోలేదు. పరిశ్రమతో నాకు పరిచయం లేకపోయినా, కనీసం వాసన్ గారికి అర్థమైనంతయినా నాకు అర్థమైంది. ఈపరిశ్రమ వల్ల ప్రభుత్వానికి చాలా ఆదాయం వస్తున్న సంగతి నేను కాదనను. తక్కువ పన్నులు చెల్లించేవారిలాగ కాక వినోదంపన్ను చెల్లించేవారు ఒక్కదమ్మిడీ కూడా తీరుపోకుండా చెల్లిస్తున్నారు. ఇందుకు వారిని నేను మెచ్చుకుంటున్నాను. అయితే రాబడి పన్ను విషయంలో ఈ ముక్క చెప్తుందని నేను చెప్పలేను," అని రాజాజీ అన్నారు.

వాసన్‌గారి ఉపన్యాసానికి సమాధానం చెబుతూ ఆయన ఇంకా ఇలాగన్నారు: వినోదం పన్ను చెల్లించేది సినిమా ప్రేక్షకులు కాదని వాసన్‌గారన్నారు. కొంతవరకూ ఇది నిజమే. వినోదం పన్ను సరాసరి ప్రజలనుండి రాబట్టడం కష్టమే. ప్రభుత్వం సినిమాపారిశ్రామికులను వినోదం పన్నుకోసం ఒత్తిడిచేయగా, వారిశ్రామికులు ప్రజలను ఒత్తిడిచేసి ఆ పన్ను వసూలుచేసి ప్రభుత్వాని కప్పగిస్తున్నారు. ప్రభుత్వం వినోదం పన్ను ఎవరినుండి వసూలు చేసినా చివరికి చెల్లించేది ప్రేక్షకులే. పన్నుల భారం ఎక్కువగావున్నా, తక్కువగా ఉన్నా, చివరికి పన్నులసొమ్ము యూనియన్ లోకల్ బోర్డుల ద్వారా ప్రజోపయోగార్థమే వెచ్చించబడుతున్నది. అంతే కాని దుర్వినియోగం కావడంలేదు.

సినిమావారినుండి ఇన్ని కోట్ల ధనం వసూలుచేస్తూ కూడా ప్రభుత్వం సినిమాను చిన్నచూపు చూస్తోందని వాసన్‌గారన్నారు. డబ్బు బాగా ఇచ్చినంత మాత్రాన ఒకపని మంచిదైపోదు. మద్యపానం వల్ల డబ్బు బాగా వస్తున్నప్పటికీ ప్రభుత్వందాన్ని నిషేధించింది. మద్యపానం చెడ్డదని ప్రభుత్వ విశ్వాసం కనుక నేదాన్ని

(50-వ పేజీ చూడండి)

ప్రశ్నలు-సమాధానాలు

మిస్ శోభాశ్రీ—పాలకొల్లు.

మహాశయా, నేనింతవరకు *Miss* నే కాని *Mrs* (శ్రీమతి) అవలేదు. నాపేరు 29-7-58 పత్రికలో శ్రీమతి అని ప్రచురించినందుకు శోచనీయంగావుంది. తెనుగులో 'శ్రీమతి' అంటే వివాహితలకి, అవివాహితలకీకూడా చెంగుతుందా?

—శ్రీమతి అంటే శ్రీ తో కూడినదని అర్థం. శ్రీ అంటే లక్ష్మి, ధనము, ఐశ్వర్యము, శోభ, అలంకరణం మొదలైన అర్థాలున్నాయి. కనుక శ్రీమతి అనే పదాన్ని గౌరవవాచకంగా ఉపయోగించామని మీరు గ్రహించాలి. వివాహితలకి అవివాహితలకీ కూడా ఆ గౌరవ వాచకం వర్తిస్తుంది.

మనుచరిత్రలో ద్వితీయాఽశ్వాసంలో 57 వ పద్యంలో..."....బయి గాలిసోకినన్, వెన్నవలెఁ గరంగు నలివేణుల గౌగిటఁ జేర్చుభాగ్యముల్" అన్న పద్యభాగానికి విపులంగా అర్థాన్ని, భావాన్ని, మీ వ్యాఖ్యానాన్ని తెలుపండి?

—ఆ పద్యభాగానికి మీరు క్లుప్తంగా అర్థం తెలుసుకునిఉంటే చాలు. మీరింకా అవివాహితలే గనుక ఇంకా విపులంగా అర్థం తెలుసుకోవడం మంచిదికాదు.

* * *

శ్రీ తలుపూర్ శ్రీధరమూర్తి—బళ్లారి.

15-7-58 వ తేది ఆంధ్రపత్రికలో వినోదావారి "దేవదాసు" చిత్ర సమీక్ష వ్రాస్తూ హిందీ "దేవదాసు" చిత్రాన్ని వినోదావారు ముందుంచుకొని యధాతథంగా తెలుగులో చిత్రించారని అన్నారు. 22-7-58 సంచికలో దేవదాసు జంటతో ఇంటర్‌వ్యూ అనే శీర్షికలో "దురదృష్ట వశాత్తు హిందీ దేవదాసు నేను చూడలేదు. మా నిర్మాతలు చాల శ్రమపడికూడ ఆ చిత్రం కాపీ తెప్పించలేకపోయారు" అని నాగేశ్వరరావుగారు ఇంటర్‌వ్యూలో తెల్పారు. ఇందులో ఏది నిజమని నమ్మమంటారు?

—మా సమీక్షను మీరు అపార్థం చేసుకోవడం భావ్యంగాలేదు. హిందీ "దేవదాసు"ను యథాతథంగా తెలుగులో చిత్రించారని మేమెక్కడా వ్రాయలేదు. "వినోదావారు స్వతంత్రమైన ప్రతిభ" చూపారని వ్రాశాముగాని అనుకరించారని వ్రాయలేదు. నిజానికి హిందీ, తెలుగు "దేవదాసు" చిత్రాలకు చాలా తేడా కనిపిస్తుంది.

* * *

శ్రీ గర్నెపూడి జోసఫ్ ఎడిసన్—గుంటూరు.

మన చిత్రాలలో ఇన్‌డోర్ షూటింగులు, ఇంగ్లీషు చిత్రాలలో, అవుట్‌డోర్ షూటింగులు యెక్కువగా నుంటును. ఎందుచేత?

—పాశ్చాత్యులు సహజత్వంకోసం ఎక్కువగా పాటుపడతారు. అందుచేత ప్రకృతి వాతావరణంలోకే వెళ్ళి దృశ్యాలు తీస్తారు. మనవారు సహజత్వంకోసం అంతే శ్రద్ధవహించరు గనుక స్టూడియోలోనే ప్రకృతికి ప్రతిసృష్టి చేసి తీస్తారు. మన సినిమాల్లో కనిపించినంత 'స్టూడియో తనం' ఇంకే సినిమాల్లోనూ కనిపించదు.

* * *

శ్రీ ఎ. శాంతీదేవి—హుస్సేను నగరం.

సినిమాకవిత్వరచనలో తాపీవారిది అందెవేసిన హస్తమా? లేక పింగళి లక్ష్మీకాంతకవిగారిదా? ఎవరి కవిత్వం మధురమైనది?

—ఆంధ్రా యూనివర్సిటీ కాలేజీలో తెలుగు ప్రధానాచార్యులుగా పనిచేసి రిటైరయిన పింగళి లక్ష్మీకాంతంగారిని సినిమా కవుల జాబితాలో చేర్చారే? నయం, పింగళి నూరనను కూడా చేర్చలేదు!

★

ఆగస్టు 15 లోగా దసరాసంచిక ముఖచిత్రం.

రాబోయే అక్టోబరు 14 వ తేదీన ఆంధ్రపత్రిక సచిత్రవార పత్రిక పిల్లల దసరా సంచికగా వెలువడుతుందని పాఠకులకు తెలిసినదే. ఆ సంచిక ముఖచిత్రానికి వాటర్ కలర్స్, ఆయిల్ కలర్స్, పాస్టిల్ కలర్స్ ఏ రంగులతోనైనా బొమ్మలువేసి పంపించవచ్చును. పదిహేనేళ్లలోపు బాలబాలికలే పంపాలి. స్వీకరించబడిన బొమ్మకు ప్రత్యేక పారితోషికం ఇవ్వబడుతుంది. ముఖచిత్రంగా ఉద్దేశించిన బొమ్మలు ఆగస్టు 15 లోగా పంపాలి.

సంపాదకుడు.



వాహిని స్టూడియోలో జరిగిన ఫిలిం ఫెడరేషన్ ఉత్సవ సభలో సావిత్రి, భానుమతి.

★ ఫిలిం ఫెడరేషన్ దినోత్సవం ★


(48-వ పేజీ తరువాయి)

నిషేధించింది. అందుచేత డబ్బు ప్రసక్తి పదే పదే తేవద్దని వాసన్ గారిని కోరుతున్నాను.

సినిమాలు వినోదంకోసమేనని వాసన్ గారన్నమాట నిజం. ప్రజలకి వినోదం కావాలి గనుక సినిమాలు వినోదం సృష్టిస్తున్నాయి. అది నిజంగా సంఘసేవే. అయితే సినిమాలు ఇచ్చే వినోదపు మంచి చెడ్డలనుగురించి ప్రభుత్వానికి బాధ్యత ఉన్నది. వినోదంపేరుతో అవినీతిని ప్రోత్సహిస్తుంటే ప్రభుత్వం సహించలేదు. ప్రజలు నీతివంతులు కావాలనే మనమంతా కోరాలి."

ప్రస్తుతం సినిమాలలో సెక్స్ అప్పీలు అధికంగా ఉంటున్నదనీ, దీనివల్ల ప్రజానీకానికి చాలా చెరుపు వున్నదనీ, ప్రజల సర్వశక్తి దేశాభివృద్ధికి వినియోగపడవలసిన అవసరం ఉన్నప్పుడు వారి మనస్సులలో సెక్స్‌ను ప్రకోపింపజేసే చిత్రాలు చూపించడం భావ్యంకాదనీ రాజాజీ అన్నారు. మానవుడిలో సహజంగానే ఎక్కువ సెక్స్ ఉన్నదనీ, దానిని తగ్గించే ప్రయత్నాలు చెయ్యాలిగాని ఎక్కువచెయ్యరాదనీ, సెక్స్ అప్పీలుకంటె ఆరోగ్యవంతమైన ఇతర "అప్పీల్లు" ప్రవేశపెట్టమనీ రాజాజీ నిర్మాతలకు సలహా ఇచ్చారు. ఫిలిం పరిశ్రమలో బ్లాక్ మెయిలింగ్ రోజురోజుకీ ఎక్కువవుతున్నదనీ, తారలను బ్లాక్ మెయిల్ చేసే పత్రికలను అనేకం తాను చదివి ఎంతో బాధపడ్డాననీ, కేవలం డబ్బు సంపాదించడం కోసమే ఈ బ్లాక్ మెయిలింగ్ వ్యాపారం జరుగుతున్నదనీ, ఈ దుర్వృత్తిని ప్రభుత్వం అణగద్రొక్కి తీరుతుందనీ రాజాజీ అన్నారు.

ద. భా. ఫిలిం వాణిజ్యమండలి అధ్యక్షుడు శ్రీ ఎ. రామయ్యగారు మాట్లాడుతూ ఫెడరేషన్ దినోత్సవం జరపడంలో తమ ఆశయం ఫిలిం పరిశ్రమలోనివారందరినీ ఫెడరేషన్ ఆధ్వర్యం క్రిందకు తీసుకురావడమేననీ, ఫెడరేషన్ నిధిని ప్రోగుచేయడం మరొక ఆశయమనీ వివరించారు.



ఫిలిం ఫెడరేషన్ ఉత్సవ సభకు హాజరైన రాజాజీ, వాసన్, హెచ్. ఎమ్. రెడ్డిగార్లు.



అసోసియేటెడ్ ప్రొడ్యూసర్సువారి "ఆశైమగన్" చిత్రంలో గణేశ్, బి. ఎస్. పరోజ, సత్యన్.

ఫిలిం పరిశ్రమ నెదుర్కొంటున్న సమస్యలను గూర్చి శ్రీ ఎ. రామయ్య, బి. నాగిరెడ్డి, మెయప్ప చెట్టియార్, శ్రీమతి భానుమతి, ఎస్. ఎస్. వాసన్ గార్లు ఉపన్యసించారు.

డైరెకర్ కె. సుబ్రహ్మణ్యం అభినందనలు తెలిపిన తరువాత, వైజయంతీమాల నృత్యంతో సభ ముగిసింది. ★

★ సినిమా వార్తలు ★

భరణీవారి "చండీరాణి" ఈ నెలలో ఒహూశా విడుదల కావచ్చునని తెలుస్తున్నది. ఈ చిత్రం తెలుగు, తమిళం, హిందీలలో తీయబడినది. నటిగా, గాయకురాలుగా ఖ్యాతి సంపాదించిన భానుమతి ఈ చిత్రానికి దర్శకత్వం, సంగీత దర్శకత్వం కూడా నిర్వహించినది.

* * *

నిర్మాత, డైరెక్టరు శాంతారాం ఈ సంవత్సరం ఏప్రిల్‌లో ప్రారంభించిన "సురంగ్" చిత్రాన్ని పూర్తిచేశారు. కార్మికుల జీవితం కథావస్తువుగా కలిగిన ఈ చిత్రంలో ఉల్హాస్, వినోద్‌కుమార్, శీలారమణి, శశికళ, చంద్రశేఖర్, వికాస మున్నగువారు నటించారు. సంగీతం శివరాం కృష్ణ.

* * *

బెంగాలీ డైరెక్టరు మధుబోస్ "షెషేర్ కవిత" అనే చిత్రం రవీంద్రనాథ టాగూర్ వ్రాసిన కథ ఆధారంగా తీస్తున్నాడు. "విక్రమోర్వశి" అనే మరొక చిత్రంకూడా మధుబోస్ తీస్తున్నాడు. ఈ చిత్రంలో ఊర్వశి నృత్యాలకు డాన్సు డైరెక్టరుగా సాధనాబోస్ పనిచేస్తున్నది. సంగీతం కాళీపాదసేన్.

* * *

ప్రసిద్ధ గాయకురాలు లతామంగేష్కర్ సురేల్ చిత్రసంస్థ తరఫున "కాంచన్" అనే మరాఠీ చిత్రం నిర్మిస్తున్నది. వసంత్ దేశాయ్ సంగీతం సమకూరుస్తున్నాడు.

* * *

పూర్వం న్యూథియేటర్స్‌వారు సైగల్ కథానాయకుడుగా "చండీదాస్" అనే చిత్రం తీశారు. అదే కథ హీరేన్ బోస్ దర్శకత్వాన "రామీధోబన్" అనే పేరుతో తిరిగి నిర్మించబడుతున్నది. భక్తకవి చండీదాసుగా అభీ భట్టాచార్య నటిస్తున్నాడు. చండీదాసు ప్రేమించిన రజకవనిత రామీగా కామినీ కౌశల్ నటిస్తోంది. రమేష్‌వ్యాస్, సులోచన చటర్జీ, లీలా చిట్నిస్ మున్నగు వారు కూడా నటిస్తున్నారు. ★

నన్ను గురించే

(9 వ పేజీ తరువాయి)

రా : ఏమిట్రా అంటావ్.

రామా : నమస్కారం శివరామయ్యగారూ. పరధ్యానంగా ఉంటున్నారే.

శివ : ఏం రామారావూ నువ్వా?

రామా : అవునండీ.

శివ : ఏం ఈ రూటులో వస్తున్నావ్? ఎక్కడెక్కావ్.

రామా: బ్రజుల్లా రోడ్డు దగ్గర ఎక్కాను.

శివ : ఆహా. అలాగా పలకరించావ్ కాదేం?

రామా : మీరు సీనమ్మతో మాట్లాడుతున్నారని పలకరించలేదు.

శివ : శీనమ్మను నీకెలా తెలుసు?

రామా : బాగుందండోయ్. శీనమ్మ ఎవరికి తెలీదు?

రా : ఏమిట్రోయ్. నా సంగతి వీడికి తెలుసుగాబోలు.

శివు : ఎవ్రా వాడు?

రా : మా ఆఫీసులో గుమాస్తారా.

శివు : అయితే.

రా.: ఇంకేముందిరా, ఆఫీసు అంతా ఊదుతాడురా.

శివు : ఊదనీ నీకేం భయం?

రా : నీకు తెలీదురా. గొప్ప చిక్కొచ్చిందే.

రా : ఏమండీ. అలాగున్నారు. ఒంట్లో బాగులేదా. అరె. జ్వరం తగిలిందే. ఒళ్ళు మండిపోతోంది. ఇంత జ్వరంతో ఆఫీసుకి వస్తున్నారేం?

ఈమాత్రం జ్వరానికేనా?

రామా : అలా కాదు సార్. దిగండి. ముందు ఇంటికి పదండి.

శివ : వాడు చెప్పిందే రైటు. ముందు ఇంటికి పద.

రాము : నన్ను ఇంట్లోకి చేర్చి వీడు లోకమంతా కూస్తాడురా.

శివు : అయితే నీకేం భయం.

రామా: బస్సు ఎన్నిగంటలకి వస్తుందో టాక్సీలో పోదాం. ఏయ్ టాక్సీ. ఏయ్ టాక్సీ. (టాక్సీ, బస్సు, సైకిల్ గందరగోళం)

3

[జరుగుతున్నంతసేపూ ఆ లిం డి యా రేడియో గ్రామఫోను రికార్డుల సంగీతం. తమిళపాట రెండు సెకన్లు. తరవాత ఎన్నాళ్ళిందెద విహసుఖములలో - నాగయ్య రికార్డు.]

చిన్నమ్మాయి : నాన్న మన కెందుకు చేయిస్తాడే. తన పెళ్ళానికి చేయించుకోంటాడు గాని.

పెద్దమ్మాయి : అవున్లే. పెళ్ళమంటే బెల్లం.

చిన్న : పొద్దున్న చెప్తూ ఉంటే విని పించుకోన్నాడే కాదు.

శివు : ఒరేయ్ రాముడూ బస్సు దిగిపో. తిరుగు బస్సులో ఇంటికి వెళ్లిపో.

రాము : నా ఒళ్ళు మండుకోస్తున్నదిరా.

శివు : అవును. అందుకే ఇంటికి వెళ్ళిపోమంటున్నాను. జ్వరం తగిలింది.

రా : జ్వరం కాదురా, రామారావుమీద ఒళ్ళు మంటరా ఇది.

రామా : మీరు నెక్స్టు బస్సులోఇంటికి వెళ్లిపోండిసార్. నేను ఆఫీసులో చెప్తానులెండి.

రా : చూశరా ఆఫీసులో చెప్తానంటున్నాడు.

శివు : ఏమిటి చెప్తాడు నీ మొహం.

రా : నన్ను గురించేరా. చెప్తాడురా. వాడంతవాడేనురా. చెప్పితీరుతాడు.

రామా : పోనీండి నేను కూడా వచ్చి మిమ్మల్ని ఇంట్లో దిగబెట్టమన్నారా? స్టాపింగ్ హోల్డాన్. కండక్టర్ స్టాపింగ్ హోల్డాన్. (బస్సు ఆగుతుంది)

శివ : ఫరవాలేదోయ్ రామారావ్.

పెద్ద : ఎందుకు వినిపించుకుంటాడే? ఏబ్బు విషయం తప్ప నుకేదయినా మన స్సులో నాటుకొన్నా ఆయనకు ఇట్టే వినబడుతుంది.

చిన్న : పది రోజులాయి అడుగుతున్నామే - సమాధానం కూడా చెప్పడేం? చేయించను అంటే మళ్లా అడుగుతామా?

పెద్ద : ఇలా అడిగితే లాభంలేదే. రాత్రి ఇంటికి రాగానే-వీను గాజులు చేయించకపోతే మేం భోజనం చెయ్యమని పట్టు పడదాం.

చిన్న : అవును. అదే మందు. ఈ రేడియో కొనిపించినట్టే అవి కొనిపించాలి.

(టాక్సీ హారన్.)

రామారా : రత్తమ్మగారూ. తలుపు తలుపు.

పెద్ద : ఎవరదీ.

రామా : నేను తలుపు తియ్. (తలుపు తీసిన చప్పుడు) మీ నాన్నగారికి జ్వరం వొచ్చింది. మంచం వాల్చి పక్క వెయ్. అందాకా ఈ పడకకుర్చీలో పడుకోండి సార్.

శివరా : చిన్నా, అమ్మేదే?

చిన్న : శీనమ్మగారింటికి వెళ్ళింది నాన్నా.

శివ : శీనమ్మగారింటికా?

చిన్న : అవును నాన్నా. బంగారమ్మా, రాజారాంగారి కోడలూ వస్తే అందరూ కలసి వెళ్ళారు.

పెద్ద : పక్క వేశాను పడుకో నాన్నా.

శివ : సరేనమ్మా. రామారావ్.

రామా : ఏం సార్.

శివ : ఆఫీసులో చెప్తావుకదూ.

రామా : చెప్తాను సార్. మీరు పడుకోండి.

శివ : రేడియోలో ఏమిటోయ్ పాట.

రామా : ఆఫ్ చేసేమన్నారా?

శివ : ఉండనీ. చూడూ పెద్దమ్మాయ్.

పెద్ద : ఏం నాన్నా.

శివ : ఆ డ్రాయరులో చెక్కుబుక్కు తే అమ్మా.

పెద్ద : ఎందుకు నాన్నా.

శివ : తేవే అమ్మా. చూడూ రామారావ్. బంగారం ధర ఎంతోయ్?

రామా : నాకు తెలీదుసార్.

శివ: ఎంతో ఉండదు. డెబ్భయి అయిదో డెబ్భై ఆరో ఉంటుంది. చెక్కు రాసిస్తా. మా అమ్మాయికి సాయంత్రం ఆఫీసునించి వచ్చేటప్పుడు గాజులు కొనితే.

చిన్న : మా కిప్పుడొద్దు నాన్నా.

రామా : ఇప్పుడేం తొందరొచ్చింది. రేపు మీరే వెళ్ళి కొందురుగాని. నాకు ఆ నగల సంగతి తెలీదు.

శివ : ఫరవాలేదు కొనవయ్యా, కొను.

పెద్ద : ఇదుగో నాన్నా పుస్తకం.

రామా: ఎందుకు సార్, నాకు తెలీదండేను.

శివ: అయితే రామారావ్ ఓ సంగతి అడుగుతాను. బస్సులో నాపక్కన ఎవరు కూర్చున్నారు?

రామా: ఎవరో ఆడమనిషి కూర్చుంది.

శివ: నిజం.

రామా: నిజం సార్. బ్రహ్మాండ్లా కోడు దగ్గుతుంటే నేను ఎదురుగుండా నించొనే వున్నాను.

శివ: అయితే నే నెవరితోటీ మాట్లాడ లేదన్నమాట.

రామా: మీలో మీరే ఏదో మాట్లాడు కొంటున్నారు.

శివ: ఆహా, అలాగా. రామారావ్. నీకు శివమ్మగారి ఇల్లు తెలుసా.

రామా: తెలుసు. ఎందుకు.

శివ: నా ఆవిడ అక్కడే ఉంటుంది దమ్ముని చెప్పు. కంద తెప్పు. గాజులు మరచిపోకు. జైలు లివ్వండే.

[గాజుల చప్పుడు]

పెద్ద: ఇదుగో నా జైలు.

చిన్న: ఇవ్వండి.

రామా: వెళ్లొస్తాను సార్. డాక్టర్ని కూడా పంపిస్తాను.

శివ: డాక్టరెందుకోయ్, నేను కులాసాగా ఉంటాను.

రామా: తలుపేసుకో అమ్మాయ్ గారూ.

శివ: అయితే బస్సులో నీకు తెలిసినవాళ్లెవ్వరూ నాపక్కన కూర్చోలేదంటావు.

రామా: లేదు సార్. ఏమలా అడుగుతున్నారూ?

శివ: ఏంలేదు. చిట్టీ. చిన్నమ్మాయ్, తలుపు వేసిరా. (విదానికి వాలు స్వర్గసీమ నుండి. స్వర్గసీమకదా స్వర్గసీమ) చిన్నా ఇలారా. ఎందుకు కన్నీళ్లు!

చిన్న: ఏం లేదు నాన్నా.

శివ: నాకు తెలుసులే. ఆ కన్నీళ్ళు నన్ను గురించే. అవునా.

చిన్న: కాదు నాన్నా.

శివ: అవును. నన్ను గురించే, ఏం?

చిన్న: అవును నాన్నా.

శివ: సరే, ఫ్లాస్కులో కాఫీ ఉంటేనా తేమ్మా.

శి: ఏంరా నాయనా.

రా: ఏం.

శి: గుమ్మడికాయల దొంగైపోయావే.

రా: అంతే.

శి: ఏం లేదులే. మనస్సులో చేసిన పాపం, బంగారంతో హరించుకుపోతుందా?

చిన్న: కాఫీ లేదు నాన్నా.

నాన్నా నాన్నా ఏమిటి నాన్నా. నీలో నువ్వే మాట్లాడుకొంటున్నావ్? అక్కా ఇలా రావే.

శి: ఏమీ లేదమ్మా. నన్ను గురించే భయపడకు. ★

★ కోడలు ★

(౦ వ పేజీ తరువాయి)

లేదేం' అంది లక్ష్మి జట్కా దిగి యింట్లోకి వస్తూనే.

'అదేమిటి లక్ష్మీ. ఉత్తరం ముక్క కూడా లేకుండా వచ్చేశావు. ఒక్కదానివే వచ్చేశావేమిటి' అంటూ కాళ్ళకు నీళ్ళిచ్చింది రాజ్యం.

'వారికి శెలవు దొరకలేదు వదినే. అన్నయ్యను స్టేషనుకు రమ్మని టెలిగ్రాం యిచ్చి నన్ను నిన్న మెయిలెక్కించారు. స్టేషనులో అన్నయ్య కనుపించలేదు. నేనే బండీ చేసుకొని వచ్చాను' అన్నది లక్ష్మి.

ఇంతలో రాము యింటికి వచ్చాడు. 'ఏమే లక్ష్మీ. నిన్నంగా వచ్చావా' అన్నాడు చెల్లెలుతో.

'ఆ - ఖులాసాగానే వచ్చానన్నయ్యా. బావ యిచ్చిన టెలిగ్రాం అందలేదా అన్నయ్యా' అన్నది లక్ష్మి.

"అందిందమ్మా. ఆఫీసుపని తొందరవల్ల స్టేషనుకు రాలేక. అయినా యిది నీకు క్రొత్త చోటు గాదుగా" అనేశాడు రాము.

నాలుగయిదు రోజులు గడిచిపోయినవి. రాము చెల్లెలుతో అంతయిదిగా మాట్లాడ లేదు. లక్ష్మికి కారణం తెలియలేదు. ఒక నాడు సాయంకాలం వంటయింట్లో నున్న తల్లితో అంది. 'అమ్మా. ఎందుకమ్మా అన్నయ్య అదోరకంగా వున్నాడు. యిది వరకుమాదిరి సరదాగా మాట్లాడటమే మానేశాడు. బావనుగురించి అడగనన్నా లేదు. ఏమి జరిగిందమ్మా యీ మధ్య?'

'ఏముంది లక్ష్మీ. వాడిప్పుడు పూర్తిగా మారిపోయాడు. అన్నింటికీ రాజ్యం ఎలా అంటాడు. నేను ముద్ద తింటేనే అంతా అయిపోతున్నట్లు మాట్లాడు తాడు, వదినేలన్నయ్య గాదమ్మా యిప్పుడు. 'ఏంచేస్తాం' అని కంట తడిపెట్టింది సుభద్రమ్మగారు.

'అయితే నన్నెందుకు రమ్మనమని వ్రాయించావమ్మా. ఏదో కష్టమో, సుఖమో అక్కడే వుండిపొయ్యేదాన్ని. పోనీ మనం యిద్దరమూ పండగ వెళ్ళంగానే అక్కడికే పోదాం. నీవంటే మాకేం ఎక్కువ లేదమ్మా. వారుకూడా ఎంత మంచివారనుకొన్నావు. ఇక్కడ అన్నయ్యకూ బాధ తగ్గుతుంది.'

'అదేంమాట తల్లీ. నీవంటే ఎరిపోయింది గాని నే నెందుకమ్మా అక్కడకు. కన్న కొడుక్కే భారం అయితే పరాయమ్మ గన్న కొడుక్కు మటుకు భారంగాదూ. తప్పు లక్ష్మీ. ఏదో వచ్చిపోతావు. అంతే చాలు తల్లీ. అప్పుడప్పుడు వచ్చి పోతుండమ్మా. పండగ వెళ్ళంగానే వచ్చేద్దామమ్మా. పాపం ఆయన హోటలు తిండితో బాధ పడుతున్నారు గాబోలు' అన్నది సుభద్రమ్మగారు. రాజ్యం ప్రక్కవాట్లో కూర్చొని యీ సంభాషణంతా వింటూనే వున్నది. తనపేర తప్పుత్రోవలో పడ్డానుగదా అని విచారించింది.

5

'అదేమిటి రాజ్యం పండగపూట క్రొత్త చీర కట్టుకోనన్నా లేదు' అంది సుభద్రమ్మగారు కోడలితో.

'ఆ. ఎందుకులే అత్తయ్యా. అందరూ లేనిపండుగ నాకేమిటి' అన్నది ముక్తసరిగా.

'బాగుందమ్మా. ఏదో మనస్సుపడి వాడు కొన్నాడు. చీర కట్టుకుంటే నీకేం పోయింది వదినా' అన్నది లక్ష్మి రాజ్యంతో.

'ఊరుకో లక్ష్మీ' అని మాత్రం అన్నది రాజ్యం. ఆరాత్రి రాము అడిగాడు రాజ్యాన్ని. 'రాజ్యం. నేనెంతో సరదా పడి చీరకొంటే నీవు కట్టుకోనన్నా లేదు. ఎందుకని?'

'తర్వాత మీకే తెలుస్తుందిలెండి' అని మాత్రం అనేసి ఊరుకొంది.

మర్నాడే లక్ష్మి తెనాలికి బయలు దేరింది.

'ఏ రాధాబాయి. అమ్మాయి యున్నాకే చెప్పి

★ కోడలు ★

పోతుందిట. విదన్నా తేలికలో ఒకచీరే రవికెగుడ్డా తీసుకరా నాయనా. కట్టుకు పోతుంది? అని అడిగింది సుభద్రమ్మగారు.

'ఇప్పుడు డబ్బెక్కడ్నించొచ్చిందమ్మా చీరెలూ సారెలూ కొంటానికి. రైలు ఛార్జీలకే పదిరూపాయిలు ఎట్లాగా అని చస్తుంటేను. అయినా తడవతడవకూ చీరలెక్కడ్నించివస్తవి చెప్పు. ఏదో వచ్చి చూసి పోతే సరిపోయిందిగాని' అన్నాడు రామం.

'అబ్బాయీ. ఒక్కగా నీఒక్క కూతురు. అమ్మాయికి ఒకచీరెఅన్నా కొని పెట్టకపోతే నలుగురూ నవ్విపోరురా.'

'ఆ నలుగురూ నవ్వనీ ఏడ్వనీ-నాదగ్గర యిప్పుడు చిల్లిగవ్వన్నా లేదు.' అన్నాడు రామం. పాపం సుభద్రమ్మ చాలా నొచ్చుకొంది. ఏంచేయగలదు మరి. లక్ష్మికి అన్నీ తెలుసు గనుక ఏమీ అనుకోలేదు.

'అమ్మా. నేను వెళ్ళివస్తానమ్మా' అంటూ తల్లితో చెప్పినపుడు సుభద్రమ్మగారు కంట తడిపెట్టింది. అమ్మాయిని కౌగలించుకొని 'పోయిరా తల్లీ' అని మాత్రం అని వూరుకొంది.

'వదినే, వెళ్ళివస్తానమ్మా.' అని రాజ్యం దగ్గర కెళ్ళింది. 'నీ ఇష్టం లక్ష్మీ. ఇదుగో ఈ చీర కట్టుకొని మాత్రం వెళ్లు' అని అంటూ కొత్త పట్టుచీరె మడత చేతికందించింది. పసుపూ కుంకుమలతో.

'ఇదేమిటి వదినే. యీ చీరె నాకెందుకూ' అన్నది లక్ష్మి.

'నీకుగాక నాకెందుకు లక్ష్మీ. మీ అన్నయ్యకు తెలియకపోయినా నాకుమటుకు తెలియవద్దా మర్యాద. ఇంటి ఆడుపడుచుకు నీకుగాని నాకుటమ్మా చీరే సారేను. నాయందు దయవుంచి కట్టుకోతల్లీ. మీ అన్నయ్య తప్పులను గూడా మరచిపో లక్ష్మీ. ఆయనకు యింకా తెలియదు.' అని అంటుంటే లక్ష్మికండ్లు ఆనందంతో చెమ్మగిల్లినవి.

రామం అక్కడకు రావటం ఎవ్వరూ చూడలేదు.

'అమ్మా, లక్ష్మీ. మీ వదినె నాకో చక్కని పాఠం నేర్పిందమ్మా. ఇన్నాళ్లకు మరలా నేనెవరినో నీ వవరవో తెలియజెప్పింది. నా తప్పు క్షమించి ఇవ్వాళటికి నీ ప్రయాణం మానుకోవూ. నాలుగు రోజులు పోయినతర్వాత నేనే వచ్చి నిన్ను బావదగ్గర దిగబెట్టవస్తాను. సంసారం అంటే పెండ్లామే ననే మోహంలో పడ్డ నాకు మీ వదినె బాగా బుద్ధిచెప్పింది. తల్లీ, చెల్లెలూ అంటే ఏమిటో గూడా తెలిసి వచ్చింది' అని బొంగురుపోయిన గొంతుకతో అంటున్న రామాన్ని చూసి అంతా ఆశ్చర్యపోయినారు.

సుభద్రమ్మగారెంతో సంతోషించింది.

'అమ్మ రాజ్యం. నిజంగా నీవమ్మ కోడలివంటే' అని మాత్రం అనగలిగిందంత సంతోషంలోనూ. ★

★ కాలక్షేపం ★

(5-వ పేజీ తరువాయి)

జీతం పద్ధతిమీద ఏర్పాటు చేశాడు. ఆయన పూర్తి పేరు 'హంసలదీవి అప్పలాచార్యులు'. అయినప్పటికీ చిన్నపట్టణంలో ఆయనను "హంసప్ప" "హంసప్ప" అని అందరూ పిలుస్తూ ఉండేవారు. "హంసప్ప" అనేది చిన్న పేరైనా చిన్నపట్టణంలో ఆయన పెద్దపేరు సంపాదించాడు ... ఆయన శుద్ధ శ్రీవైష్ణవుడు. "శ్రీమతే రామానుజాయ నమః" అనకుండా నిద్రపోడు. నిద్రలేవడు. రామానుజాచార్యులవారు బోధించిన విశిష్టాద్వైత తత్వంలో ఆయనకు పరిపూర్ణమైన నమ్మకం ఉంది. జీవాత్మయున్ను, పరమాత్మయున్ను అయిక్యం అవుతాయి' అద్వైతసిద్ధి పొందుతాయి. పాలు నీరు కలిసి మెలసి మిళితమైనట్లే అవుతాయి. కాని, పాలల్లో ఉన్న నీరున్నూ పాలున్నూ వేర్వేరు విశిష్టతత్వాలుగానే సదా విభజింపదగినవై ఉంటాయి. ఇదే శ్రేష్ఠమైన అద్వైత సిద్ధాంతంఅనినీ ఇదే విశిష్టమైన అద్వైత సిద్ధాంతమనినీ హంసప్పగారు సదా వాదిస్తూ ఉండేవాడు. జీవాత్మ పరమాత్మల అద్వైత అయిక్యతత్వంలోకూడా జీవాత్మయొక్క ప్రత్యేక వ్యక్తిత్వం చెడకుండా ఉంటుందని వాదించేవాడు. అటువంటి సూక్ష్మవిషయాన్ని పాలునీరు విడదీసినట్లుగా హంసప్పగారు అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లుగా అవలీలగా వివరించేవాడు. అంతేకాదు. హంసప్పగారు ఆలయంలో పూజ చేయించడంలో ఆరితేరిన అందెవేసినచెయ్యి. ఆయన నడుము బిగించి ఒక చేతితో గంట మోగిస్తూ మరొక చేతితో హారతి పళ్లెమును స్వామియెదుట త్రిప్పుతూ మంత్రపఠనం చేస్తూఉంటే, ఆయన త్రికరణశుద్ధిగా పూజచేస్తున్న స్థితి ప్రజ్ఞ్యడిని మహర్షులు కూడా హర్షిస్తారు. అటువంటి హంసప్పగారికి చిన్నపట్టణంలో పెద్ద కుటుంబం పోషించడం భారంగా ఉంది. వేణుగోపాలస్వామి కృపారసము కూడా ఆయనమీద కించిత్తయినా కరియలేదు. అందువల్ల గుళ్లో అర్చకత్వంకంటే హాయిగా కాఫీహోటలులో పాచకత్వం మంచిదని ఎంచి గోపాలస్వామికోవెలలో నవుకరీ మానివేసి, గోపాలయ్యరు హోటలులో నవుకరీకి చేరాడు. దధ్యోదనం పులిహోర, అవడలు చేయడంలో ఆయన ప్రతిలేని ప్రవీణుడు. అందువల్ల ఆ జీవితం కంటె యీ జీవితం హాయిగా సాగిపోతోంది.

చలమయ్యగారి ఆలయంలో మరొక అర్చకుని యేర్పాటు చేయలేదు. భక్తితో చేసే స్వామిపూజకు జీత బత్తె మెందుకని ఎంచి చలమయ్య స్వయంగానే, సహస్రనామార్చన చేసి స్వామికి తిరుమంజనంవగైరా చేయడం ప్రారంభించాడు. కాని, హారతి యిచ్చే సమయంలో హంసప్పగారి మాదిరిగానే ఒక చేతితో గంట వాయిస్తూ, ఇంకొక చేతితో కర్పూరం వెలిగించి హారతి పళ్లెమును త్రిప్పుతూ, నోటితో మంత్రమును చదువుటకు ప్రారంభించాడు. కాని, ఒక చేతితో గంటను మోగిస్తూ విగ్రహంచుట్టూ గంటను త్రిప్పినప్పుడు, అదే సమయంలో రెండవ చేతితో, కర్పూరం వెలిగించినహారతి పళ్లెమునుకూడా త్రిప్పడంఅతనికి సాధ్యంకాలేదు. అయినా, చాలా అవస్థపడి త్రిప్పడం సాగించాడు. అలవాటులేని ఔపాసనవల్ల మూతిమీసాలన్నీ తెగకాలిపోయినవన్నట్లుగా ఆ హారతి పళ్లెం తలక్రిందై, వెలిగించిన కర్పూరం క్రింద పడిపోయి వేణుగోపాలస్వామికి కట్టిన పీతాంబరం పరశురామప్రీతి అయింది. చలమయ్యగారి యింట్లోవాళ్లు యిదంతా చూచి అమంగళం అన్నారు. ఒకచేత్తో హారతి పళ్లెం త్రిప్పుతూ, ఇంకోచేత్తో గంటను మోగించి త్రిప్పుతూ, ఒక పనియాలంగా యింకోపనికి ఆటంకం అభ్యంతరం లేకుండా, తీర్థానికి తీర్థం ప్రసాదానికి ప్రసాదం అన్నట్లుగా రెండు పనులను విభజనగా రెండుచేతులతో ఏకకాలమందే చేయడం ఆచార్యులవారి అపూర్వమైన విద్యయనిఅంగీకరించాడుచలమయ్యకూడా. మనం రెండుపనులనూ వేర్వేరుగా మాత్రమే చేయగలం. "సత్యం, స్వాతంత్ర్యం" వేర్వేరు విశిష్టతత్వాలుగా విభజించి గ్రహించిన తత్వజ్ఞానిమాత్రం, ఆ రెండింటికీఉన్న క్షీర నీర న్యాయసంబంధమును కూడా నిరూపిస్తాడు. అటువంటి విచక్షణజ్ఞానం గలది హంస. బ్రహ్మండనాయకు డైనప్పటికీ, అటువంటి "నైపుణీ జనిత మహోయశో విభవ సారము హంసకు మాన్ప జాలు నే?"

జనకమహారాజువంటి జ్ఞానయోగులు రాజ్యం చేసిన భారతదేశం ప్రపంచ రాజ్యాలలో పరమహంస. భారతమాతకీ జై! వందే మాతరం! ★

★ ఉపకారమా? ★

(18–వ పేజీ తరువాయి)

బట్టాడు. ఒకసారి కాలేజీలో ఒక లెక్చరరు కొంచెం అవమానకరంగా మాట్లాడేసరికి, శేఖరం నిలబడి ఆయన్ని ఆమాటలు ఉపసంహరించుకోమన్నాడు. ఆయన ఒప్పుకోలేదు. శేఖరం నాయకుడై సమ్మె చేయించేడు ఆయన ఒప్పుకొనేదాకా. ఆ పౌరుషం అంతా ఏమయిపోయిందో యీనాడు? ఆ శేఖరమేనా యీనాడు తలవాల్చింది? ఈ వాతావరణంలో మానవునిలో నిర్వీర్యత కలిగించే విషవాయువేదేనా ఉందేమో?— ఇలా ఆలోచించుకుంటూ శేఖరం కళ్ళు తెరిచేడు. బాగా చీకటిపడింది. ఒకళ్లిద్దరు గుమాస్తాలు గ్రుడ్డి హరికేన్‌లాంతర్లు పెట్టుకొని ఏదోరాస్తూనే ఉన్నారు యింకా. మిగిలినవాళ్లు మేనేజరు ఎప్పుడు వెళ్ళిపోతాడా అని కనిపెట్టుకూర్చున్నారు.

ఇంతలో ఒక యువకుడు వచ్చి దగ్గరబల్ల మీద కూర్చున్నాడు. సుమారు తన యీడే వుంటుంది. ఇతనో గుమాస్తా. "మీకు అంతా కొత్తగా ఉండిగాబోలు. నేను మొదట యిలాగే ఫీలయ్యాను. నాలుగు రోజులుపోతే మీకూ అలవాటవుతుంది. కంగారుపడకండి." అని స్నేహభావంతో చెప్పి వెళ్లిపోయాడు.

పదిహేను రోజులు గడిచింది. శేఖరం పరిస్థితిలో ఏమీ మార్పులేదు. రోజు రోజుకూ రాయవలసిన కాగితాలు పెరిగిపోతున్నాయి. హెడ్డు గుమాస్తా చీవాట్లతో పాటు. రోజు గడవడమే బ్రహ్మాండంగా తయారైంది. ప్రక్క గుమాస్తా నెవరినైనా కాస్త సాయం చెయ్యమంటే "సరిసరి - నాపనే తెములక నేను చస్తూంటే నీకు సాయంకూడానా" అంటున్నారు. హెడ్ గుమాస్తా దగ్గరికి వెడితే కరుస్తున్నాడు. శేఖరానికి మతిపోయేటట్టు కనబడుతోంది. రాత్రి పీడకలలువచ్చి నిద్రపట్టడం లేదు. నిద్రపడితే హెడ్డుగుమాస్తా నానాతిట్లూ తిడుతున్నట్లు కలవచ్చి ఉలిక్కిపడి లేస్తాడు. పలుగఆఫీసులో అంతులేనిఆవేదన.

ఒకరోజున శేఖరం ఆఫీసుకు వెళ్ళి తన కుర్చీలో కూర్చోబోతూంటే "శేఖరం! ఒకసారి యిలారా" అని హెడ్ గుమాస్తా పిలిచేడు. ఈరోజున ఆయన పిలుపులో యింత మృదుత్వం ఎలావచ్చిందా అని ఆశ్చర్యపోతూ శేఖరం దగ్గరికి వెళ్లేడు. హెడ్ గుమాస్తా పక్కన ఒక ఖద్దరు బట్టల మనిషి కూర్చుని ఉన్నాడు. "చూడు - వీరిది ఒక చెక్కుంది - అది నువ్వు తాలూకాఫీసుకు పట్టుకెళ్ళి పే ఆర్డరు వేయించుకు రద్దూ" శేఖరం ఆలోచిస్తూ నిలబడ్డాడు. "ఆలోచించక్కర్లేదు. ఆయ నేదో ముట్టచెప్తాడులే" అని చిరునవ్వు నవ్వేడు హెడ్ గుమాస్తా. శేఖరానికి వళ్ళు భగ్గుమంది, లంచం పేరు చెప్పేసరికి. "నేను వెళ్ళను. అది నా పనికాదు" అని తన సీటుదగ్గరికి వెళ్ళిపోయాడు. "ఏమిటీ - నామాట త్రోసేస్తావా? రేపుం కుదురుస్తాను" అని పళ్లు పటపట కొరికేడు హెడ్డుగుమాస్తా.

మరునాడు ఆఫీసుకు రాగానే కొత్త మిత్రుడువచ్చి "శేఖరంగారూ! మీమీద హెడ్‌గుమాస్తా మేనేజరుగారికి ఘాటైన నోటు వ్రాశేడు. మీకు బహుశా కబురొస్తుంది" అన్నాడు. "మంచిదే" అని శేఖరం ఆలోచనలో పడ్డాడు. ఇంతలో ఆఫీసు బంట్రోతువచ్చి "శేఖరంగార్ని మేనేజరుగారు రమ్మంటున్నారు" అని చెప్పి వెళ్లేడు.

శేఖరం ధైర్యంగా లేచి కోటు తగిలించుకొని బయలుదేరాడు మేనేజరుగారింటికి. గేటులో ఉన్న బంట్రోతు "అయ్యగారు భోంచేస్తున్నారు. ఆబెంచీమీద కూర్చోండి వెళ్ళి" అన్నాడు. శేఖరం మెట్లెక్కేడు హాలు కనబడుతోంది. హాలులో గోడకి ఒక ఎన్‌లార్జిమెంటు ఉంది. పురుషుడు మేనేజరుగారే - స్త్రీ - ఆయన భార్య. ఈయనకు రెండవ పెళ్ళి కాబోలు - ఆవిడ నెక్కడో చూసినట్లుందే - ఎక్కడచెప్మా - అని ఆలోచిస్తూ శేఖరం బెంచిమీద కూర్చున్నాడు.

ఆఫీసుగది తెరచుకుంది. మేనేజరుగారు తువ్వాలుతో మూతి తుడుచుకుంటూ

★ ఉపకారమా? ★

కుర్చీలో కూర్చున్నారు. శేఖరం లోపలికి వెళ్ళేడు.

"ఏం శేఖరం - నువ్వు చేరి నెలవుతోంది. కదా ఒక్క కాగితానికి నా జవాబు రాయ లేదుట ఎందుచేత? ఇది కాలేజీ అనుకున్నావా? లేకపోతే మీ యిల్లు అనుకున్నావా? ఏం! జవాబు చెప్పవేం?" అని అడిగేరు మేనేజరుగారు కళ్ళెర్రజేస్తూ.

"నాకు కొత్తగా ఉంది. ఎలా జవాబులు రాయాలో చెప్పమంటే హెడ్డుగుమాస్తా గారు చెప్పటంలేదు. తోటి గుమాస్తాలు చెప్పడంలేదు. నన్నేం చెయ్యమంటారు?"

"నీకు తెలియకపోతే నాకెందుకు వచ్చి చెప్పలేదు? పైగా నీఅంతట నువ్వు నేర్చుకోవాలి గాని, ఎవరిపనివారు చేసుకొని నీ కెవరు నేర్పుతారు? పైగా హెడ్‌గుమాస్తాను అవమానం చేశావుట! ఆయన అంతర మెంత? నీఅంతర మెంత? రేపటినుంచి నిన్ను పనిలోంచి తీసేస్తున్నాను ఇకవెళ్ళు." శేఖరం ఏదో చెప్పబోయాడు కాని ఆయన వినిపించుకోలేదు.

శేఖరానికి మొదట తన విరగబడిపోయినట్టయి వ్యాపారం తేలికయింది. కాని ఉద్యోగం పోయాక ఏంచెయ్యాలి? అసలే ముసలివాడైన తండ్రికి ముఖం ఎలా చూపించడం? తన కొడుకు ఉద్యోగం చేస్తున్నాడని గర్వంగా పొరుగువాళ్ళతో చెప్పుకునే తల్లిదగ్గరకు వెళ్ళి ఎలా నిలబడడం? పోనీ మరోక ఉద్యోగం దొరికేదాకా యింటికి వెళ్ళకపోతే? - తనకు ఉద్యోగం యివ్వడానికి ఎవరు కాసుకుని కూర్చున్నారు? ఏపనీ లేకుండా ఎలా బ్రతకడం? - ఈ ఉద్యోగాన్ని నిరసించడం తప్పేమో? - తనకేం ఉందని అంతకంటే పెద్దది ఆశించడం? - ఎంతిమందిబి. ఏగాళ్ళు గుమాస్తా పన్లు చెయ్యడంలేదు? అసలు బి. ఏ గుమాస్తాకి తప్ప మరెందుకు పనికొస్తుంది? తనకి వేరేకన్ని తెలియదు. బజారులో కొట్టు పెట్టుకుని - నలుగురిలో నిలబడగలడా? లేదు. తన చదువు తనకు గుమాస్తాగిరీ కొలువే కట్టబెట్టింది. తాను మరెందుకూ పనికిరాడు. ఆ ముసలి హెడ్ గుమాస్తా నాశ్రయిస్తే తనకు పని నేర్పి ఉండును. ఉద్యోగం పోకపోవును. తన తలబిరుసు తనమీదే యింతవరకూ తెచ్చింది - ఇలా ఆలోచించుకుంటూ గడిపేశాడు ఆరోజు శేఖరం.

మరునాడు, తాను ఆఫీసువేళ్ళాలో అక్కడికెళ్ళేదో సందేహం వచ్చింది శేఖరానికి. ఇంతలో బ్యాంకు బంట్రోతు ఒక కవరుతెచ్చి యిచ్చేడు. వణికే చేతులతో శేఖరం కవరు విప్పేడు శ్రీముఖం వచ్చిందనుకుంటూ.

నమస్కారములు—

మిమ్మల్ని మేనేజరుగారు చివాట్లువేస్తూ ఉన్నప్పుడు నేను తలుపువెనుక నిలబడి విన్నాను. మీరు బహుశా ఉద్యోగం పోయిందనే ఆందోళనలో ఉండిఉంటారు. మీరు భయపడనక్కరలేదు. నేను మేనేజరుగారితో మాట్లాడి అంతా సర్దుబాటు చేసేను. పైగా రేపటినుంచి హెడ్‌గుమాస్తా గారు మీకు సహాయంచేసే ఏర్పాటుకూడా చేసేను. మీకు ఆశ్చర్యం కలుగుతుం దనుకుంటాను. కాని ఇందులో ఆశ్చర్యపడ వలసినదేమీ లేదు. క్రిందటి సంవత్సరం వేసవిసెలవుల్లో నన్ను చూసుకోవడానికి వచ్చేరు మీరు. నాకు తగినంత చదువు రాదనీ, మావాళ్ళు మీరు కోరినంత కట్నం యివ్వలేరనీ, మీరు మా సంబంధం తిరస్కరించేరు. అప్పుడు అలాగే జరిగి ఉండకపోతే ఈనాడు చాలీ చాలని జీతంతో రాత్రింబగళ్ళు గాడిద చాకిరీ చేస్తూ, అధికారులచేత ప్రతిదానికీ మాటికీ చివాట్లు తింటూ జీవితంలో ఆనందలేశమేనా లేకుండా గానుగెద్దులా బ్రతికే ఒక గుమాస్తాకు నేను భార్యనై ఉండేదాన్ని. అందువల్ల మీకు నేనెంతో ఋణపడి ఉన్నాను. ఈవిధంగా మీ ఉద్యోగం నిలబెట్టి, ఆ ఋణం కొంత వరకూ తీర్చుకున్నానని నా ఉద్దేశం.

సెలవు.

మీ క్షేమాభిలాషి, రాజ్యలక్ష్మి,

శేఖరం నిశ్చేష్టుడయ్యాడు. ఇది ఉపకారమా? లేక తన్ను నిరాకరించినందుకు ప్రతీకారమా? ఇది ప్రశ్నగా నేమిగిలిపోయింది. శేఖరం మెదడులో. ఆనాడు తాను పెళ్ళిచూపులకు వెళ్ళినప్పుడు కళకు కాటుక పెట్టుకొని, కాళ్ళకు పసుపుతోనూ, పట్టుపరికిణీతోనూ సిల్కు జంపరుతోనూ, తన హృదయంలో స్థానంకోసం అర్థించిన రాజ్యలక్ష్మి, అతని కన్నులముందు మెరిసింది. శేఖరం

రాజ్యలక్ష్మి-నువ్వు వ్రాసినది నిజం. ఆనాడు నేనేదో గొప్ప పదవిలోకి వెడతాననీ, నువ్వు నాకు తగవనీ, నిన్ను నేను నిరాకరించేను. ఈనాడు నువ్వు బ్యాంకు మేనేజరుగారికి భార్యవు. నేను ఆ బ్యాంకులో ఒకగుమాస్తాని" అంటూ కన్నీళ్ళు తుడుచుకున్నాడు. ★

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St, Madras.

అమ్మకమునకు సిద్ధముగా నున్నది!!

రెండు మహానగరాలు

చార్లెస్ డికెన్స్



అది ఒక వైభవోజ్జ్వల మహాయుగం— వల్లకాటి అధ్వాన్నశకం; వెల్లివిరిసిన విజ్ఞానం—బ్రహ్మాజెముడులా అజ్ఞానం; ఆశాకుసుమాలు పుష్పించిన ఆమధుర వసంతం— నైరాశ్యపు చలి గుబుళ్లు యీచుకున్న శిశిరాస్యం; సర్వసంపత్సమృద్ధి— సర్వతోముఖ క్షామం; సూక్ష్మంగా చెప్పాలంటే—నేటి పరిస్థితికి నకలుగా వుంది నాటి పరిస్థితి.

అలాంటి కల్లోలదినాలలో లండన్ పారిస్ నగరాలను రెంటినీ పెనవేసుకుని సాగిన ప్రణయబలిదాన గాథ! ఆంగ్ల నవలా ప్రపంచ నిర్మాత చార్లెస్ డికెన్సు ప్రతిభా సంపత్తులు వెల్లివిరిసిపోయిన "టేల్ ఆఫ్ టూసిటీస్" అనే 'క్లాసికల్' నవలకు అనువాదం.

అనువాదకులు:

శ్రీ తెన్నేటి సూరి

ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రికలో సీరియల్ గా వెలువడిన ఈ రచనను యిప్పుడు గ్రంథరూపంలో అందజేస్తున్నాం.

వెల: రూ. 3-0-0 లు   పోస్టుఖర్చులు ప్రత్యేకం.

ఆంధ్ర గ్రంథమాల. మద్రాసు-1.